www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గురువారం | 7-2-2019 | పేజీలు: 16 + 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 59 సంచిక (Issue) : 293 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: విదియ ఉ. 7.52 తదుపరి తదియ; నక్షత్రం: శతభిషం మ. 12.10; తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా. 7.19-9.06; దుర్ముహూర్తం: ఉ. 10.37-11.22, మ. 3.08-3.53; అమృతఘడియలు: తె. 6.02 మొదలు; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.09 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

కాపు కాశారు!

పదిలో సగం కాపులకు! మిగిలిన 5 శాతం ఇతరులకు

- కాపు కోటాపై రాష్ట్రం మరో అడుగు
- పదిశాతం ఈడబ్ల్యూఎస్ కోటా 'విభజన'
- అసెంబ్లీలో రెండు వేర్వేరు బిల్లులు
- నేడు శాసనసభలో చర్చ... ఆమోదం!
- దళిత క్రైస్తవులకూ ఎస్సీ హోదా 14
- కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం


విద్యుత్ బైక్ పరిశీలిస్తున్న సీఎం

కాపు కోటాపై రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన పదిశాతం ఆర్థిక బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోటాలో సగం కాపులకు కేటాయిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టింది. దీనిపై గురువారం ఆమోద ముద్ర పడనుంది. మరోవైపు... దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలంటూ అసెంబ్లీ తీర్మానం చేసింది. దీనిని కేంద్ర ప్రభుత్వానికి పంపనుంది. బుధవారం అసెంబ్లీలో ఈ కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి.

ఎవరితోనూ పొత్తుల్లేవ్!

- అన్ని స్థానాల్లో ఒంటరి పోరే.. హోదాపై కాంగ్రెస్, బీజేపీ మోసం
- మోదీ హామీ మోసమే.. నవరత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- బూత్ కమిటీ సభ్యులతో జగన్.. తిరుపతిలో శంఖారావం తొలి సభ



13

పోలీసులకు ప్రలోభాలు

- మైలవరం వైసీపీ నేతల తెగింపు
- వచ్చే ఎన్నికల్లో సహకరించాలంటూ
- వసంత కృష్ణప్రసాద్ మనిషి బేరం

కక్ష్యలోకి జీశాట్-31

- ఫ్రెంచ్ గయానా నుంచి
- విజయవంతంగా ప్రయోగం
- ఏరియన్ రాకెట్ ద్వారా నింగిలోకి
- డీటీహెచ్, ఏటీఎం సేవలకు ఊతం 16

టీటీడీ జేఈవోగా లక్ష్మీకాంతం

- గుంటూరు రేంజ్ ఐజీగా మీనా
- 12 మంది ఐఏఎస్‌లు, ముగ్గురు ఐపీఎస్‌లు బదిలీ 2



పరంజ్యోతి

శివరూప సూక్ష్మాంత పరమ్..



ఈశ్వరానుగ్రహా దేవ, పుంసామద్వైత వాసనా
మహాభయ పరిత్రాణాద్విజ్ఞాన ముపజాయతే

అద్వితీయమైన పరబ్రహ్మ విచారం స్థిరం కావడం కోసం, సంసార దుఃఖం తొలగించి రక్షించడానికి, పరమేశ్వరుని కారుణ్యకటాక్ష వీక్షణమైన అనుగ్రహ మాత్రంతోనే అజ్ఞానులైన జీవులకు జ్ఞానం కలుగుతోందని అవధూతగీత ఉపదేశం. ఈశ్వరుడు భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు పరుడు. ఆ పరమేశ్వర తత్వం ఇంద్రియాలకు గోచరం కానిది, అతీంద్రియం, అనిర్వచనీయం, అగ్రాహ్యం, అసంగంకావడం వల్ల.. ఆత్మజ్ఞాన సంపన్నులు మాత్రమే తురీయ సమాధి యందు అంతర్ముఖులై తమ హృదయాకాశాన్ని కుశాగ్రబుద్ధితో దర్శించగలుగుతారు. అజ్ఞానావరణముతో కూడి బహిర్ముఖుడై ఉన్న 'జీవాత్మ' పరమేశ్వర తత్వాన్ని గుర్తించలేడు.

ఆత్మాత్వం గిరిజామతిః పరిచరాః ప్రాణాః శరీరం గృహం
పూజాతే విషయోప భోగ రచనా నిద్రా సమాధిస్థితిః
సంచారః పదయోః ప్రదక్షిణ విధిః, స్తోత్రాణి సర్వాగిరో
యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనం

..'నా ఆత్మ నీవు, నా మతి పార్వతి, నా పంచప్రాణాలు పరిచారికలు, నాకు ఏయే విషయాల మీద ఆసక్తి కలదో అవన్నీ నీకు పలు పూజలు. నేను సమాధి స్థితిని చేరునది నిద్రించునప్పుడే. నా పాదాలు భూమిని సంచరించినదంతా నీకు ప్రదక్షిణములే. నా పలికినపలుకులన్నీ నీ స్తోత్రాలే. నేను చేసే కర్మలన్నీ నీకు నేచేసే ఆరాధనలే' అంటారు శంకరులు 'శివ మానసిక పూజాస్తోత్రం'లో.

'శివరూప సూక్ష్మాంతపరమ్'.. 'స్థూలం, సూక్ష్మం, పరం' అని శివుని రూపాలు మూడు. సామాన్యులు శివుని స్థూలరూపాన్ని మాత్రమే చూస్తారు. 'సూక్ష్మయోగిభిః' అంటే యోగులు యోగాంగ నియమాలను ఆచరించి శివుని సూక్ష్మరూపాన్ని చూస్తారు. శివభక్తులు లింగరూపధారి శివుని స్థూల, సూక్ష్మ రూపాలకు అతీతమైన పరరూపాన్ని చూసి శివానందాన్ని పొందుతారు. శివుని తలపై ఉండే అర్ధచంద్రుడు.. అష్టమినాటి చంద్రుడు. అష్టమి అంటే.. ఎనిమిది ప్రవృత్తులతో కూడిన ప్రకృతి. ఆ బింబం సగం వెలుగును, సగం చీకటినీ ధరించి ఉంటుంది. అందులో చీకటి భాగం అవ్యక్తంగా ఉండే పరమాత్మను సూచిస్తే.. వెలుగు, వ్యక్త ప్రకృతిగా ఉన్న జగన్మాతను సూచిస్తుంది. అదే ప్రకృతి పురుషుడు కలిసిన స్థితి.. అర్ధనారీశ్వర తత్వం.

- మేఘశ్యామ, 8332931376

ఇక మీరే చూసుకోండి

- జయరామ్ హత్య కేసు తెలంగాణకు..
- ఉత్తర్వులు జారీ చేసిన పోలీస్ శాఖ
- నందిగామ కోర్టుకు రాకేశ్, శ్రీనివాస్
- 20వ తేదీ వరకు వారికి రిమాండ్

అమరావతి, విజయవాడ/నందిగామ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారవేత్త చిగురుపాటి జయరామ్ హత్య కేసులో రాష్ట్ర పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. కేసును తెలంగాణకు బదిలీ చేస్తూ డీజీపీ ఆర్పీ ఠాకూర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. జయరామ్ హత్య హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో జరిగినట్లు నందిగామ పోలీసుల విచారణలో తేలడంతో, ఈ కేసును బదిలీ చేయాల్సిందిగా కృష్ణాజిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని డీజీపీ ఆదేశించారు. జయరామ్ మేనకోడలు శిఖా చౌదరి స్నేహితుడు కవకుంట్ల రాకేశ్‌రెడ్డి హైదరాబాద్‌లోని తనఇంట్లో జయరామ్‌పై జనవరి 31న దాడికి పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. ఆ దెబ్బలకే జయరామ్ మృతిచెందాడని, ప్రమాద ఘటనగా చిత్రీకరించేందుకు నిందితుడు కారులో శవాన్ని తీసుకొచ్చి కృష్ణా జిల్లాలో వదిలేసినట్లు కృష్ణాజిల్లా ఎస్పీ వెల్లడించారు. ఇప్పటికే రాకేశ్‌రెడ్డి, వాచ్‌మెన్ దున్నే శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న శిఖాచౌదరి మాత్రం పోలీసు విచారణ నుంచి ఇంటికి వెళ్లిపోయారు. ఈ విషయంలో జయరామ్ భార్య పద్మశ్రీ అసంతృప్తిని వ్యక్తం చేశారు. తాజాగా ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు శిఖాచౌదరిపై ఫిర్యాదు చేశారు. తన భర్త హత్య కేసులో అసలు దోషులు బయటకు రావాలని, శిఖాపైనా తనకు అనుమానాలున్నాయని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఘటన జరిగింది జూబ్లీహిల్స్‌లో గనుక కేసు అక్కడికే బదిలీ చేయాలని డీజీపీ ఠాకూర్ నిర్ణయం తీసుకొన్నారు. దీంతో, నందిగామ పోలీసులు ఈ కేసును హైదరాబాద్ పోలీసులకు బదిలీ చేశారు. న్యాయనిపుణులతో చర్చించాక ఈ నిర్ణయం తీసుకొన్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు. కాగా, జయరామ్ హత్య కేసులో ఏ1, ఏ2 కలకుంట్ల రాకేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌ను నందిగామ పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపరిచారు. వారికి ఈ నెల 20 వరకు కోర్టు రిమాండ్ విధించింది. వాస్తవానికి రాకేశ్‌రెడ్డిని కస్టడీకి తీసుకోవాలని నందిగామ పోలీసులు భావించారు. కేసు ఇక హైదరాబాద్‌కు బదిలీకావడంతో అక్కడి పోలీసులు కస్టడీకి తీసుకుని విచారిస్తారు.





సీఎం సమక్షంలో సాఫ్ట్‌బ్యాంకుతో ఒప్పందం చేసుకుంటున్న అధికారులు

'ఎనర్జీ ఇన్నోవేషన్ సమ్మిట్-2019'లో అక్షరశక్తి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, జస్టిస్ భవానీ ప్రసాద్, అజయ్‌జైన్, విజయానంద్

గ్రామానికో విద్యుత్ గ్రిడ్

- రైతుల నుంచి సౌర విద్యుత్ కొనుగోలు
- మిగులు గ్రామ అవసరాలకు వినియోగం
- రైతులకు ఇదో మంచి ఆదాయ వనరు
- ఎనర్జీ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు
- ఏటా 'ఐఎస్ఏ-అమరావతి' అవార్డు ప్రదానం
- సౌర విద్యుత్‌లో సాఫ్ట్ బ్యాంకుతో ఈడీబీ ఒప్పందం

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు అటు వ్యవసాయానికి, ఇటు అదనపు ఆదాయానికి ఉపయోగపడేలా సరికొత్త విధానం అమల్లోకి తీసుకురాబోతున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రతి గ్రామానికీ ఒక విద్యుత్ మైక్రో గ్రిడ్ ఏర్పాటు చేస్తామని, రైతులు ఉత్పత్తి చేసే సౌర విద్యుత్‌ను దానికి అనుసంధానం చేస్తామని వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న 17లక్షల విద్యుత్ పంపుసెట్లను సోలార్‌గా మారుస్తామన్నారు. మిగులు విద్యుత్‌ను యూనిట్ రూపాయిన్నర చొప్పున కొనుగోలు చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామని వివరించారు. దాన్ని గ్రామ అవసరాలకు వినియోగించడం ద్వారా 30శాతం విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు చేపట్టే సంస్థకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన 'ఎనర్జీ ఇన్నోవేషన్ సమ్మిట్-2019' ముగింపు కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ, విద్యుత్ సంస్కరణలకు ఏపీ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. 2014లో తాము అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో 22.5లక్షల మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరత ఉందని, 2నెలల్లోనే దాని అధిగమించి మిగులు రాష్ట్రంగా మార్చామని చెప్పారు. రెన్యువబుల్ ఎనర్జీకి పెద్దఎత్తున ప్రోత్సాహం ఇచ్చామన్నారు. ప్రజలకు 23మిలియన్ల ఎల్ఈడీ బల్బులు పంపిణీ చేశామని, మార్చినాటికి వీధిదీపాలను నూరుశాతం ఎల్ఈడీగా మారుస్తామని ప్రకటించారు. విద్యుత్ వృథాను కేవలం 9.7శాతానికి తగ్గించామన్నారు. అనంతపురంలో భారీ పవన విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సూర్యోదయ రాష్ట్రంగా ఉన్న ఏపీని సోలార్ విద్యుత్ రూపంలో సూర్యుడు ఆశీర్వదించాడని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఒక సెల్‌ఫోన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. 2022 నాటికి 15శాతం వృద్ధిరేటు సాధించడమే లక్ష్యంగా పేర్కొన్నారు. కాగా, ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్(ఐఎస్ఏ)- అమరావతి పేరుతో ఏటా ఉత్తమ సోలార్ ఉత్పత్తి నగరానికి అవార్డు ఇవ్వడంపై ఐఎస్ఏ డైరెక్టర్ జనరల్ ఉపేంద్ర త్రిపాఠీ ప్రతిపాదనను సీఎం ఆమోదించారు. వచ్చే ఏడాది నుంచి అమరావతి వేదికగా ఈ అవార్డు ఇస్తామన్నారు. ఇందుకోసం రూ.10కోట్లు వెంటనే విడుదల చేయాలని ఇంధనశాఖను ఆదేశించారు. ఏటా అమరావతిలో అంతర్జాతీయ విద్యుత్ హాకథాన్ నిర్వహిస్తామన్నారు. రెండు రోజుల సదస్సులో నిర్వహించిన పిచ్ కాంపిటీషన్ విజేతలకు సీఎం నగదు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్, విద్యుత్‌శాఖ అధికారులు అజయ్‌జైన్, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ బ్యాంకుతో ఎంవోయూ

సోలార్ విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టనున్న సాఫ్ట్ బ్యాంకుతో సీఎం సమక్షంలో ఈడీబీ ఒప్పందం చేసుకుంది. రూ.13,200కోట్ల పెట్టుబడితో 4గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఆ సంస్థ ముందుకొచ్చింది.

టీటీడీ జేఈవోగా లక్ష్మీకాంతం

- గుంటూరు రేంజ్ ఐజీగా మీనా
- 12 మంది ఐఏఎస్‌లు, ముగ్గురు ఐపీఎస్‌లు బదిలీ

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వివిధ స్థాయిల్లో పని చేస్తున్న 12 మంది ఐఏఎస్‌లు, ముగ్గురు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణాజిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతంను తిరుమల తిరుపతి దేవస్థానం(తిరుపతి) జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బదిలీ చేసింది. అక్కడ ఉన్న పోల భాస్కర్‌ను సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్‌గా నియమించింది. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా ఎం.రామారావును నియమించి... అక్కడ ఉన్న ధనుంజయ్‌రెడ్డికి ఏపీ టూరిజం కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు అప్పగించింది. ఎక్సైజ్ కమిషనర్ లక్ష్మీనరసింహాన్ని చేనేత, జౌళి శాఖ కార్యదర్శిగా బదిలీచేసి... అక్కడ ఉన్న శ్రీనివాస శ్రీనరేష్‌ను గనులశాఖ కార్యదర్శిగా నియమించింది. అక్కడ పనిచేస్తున్న శ్రీధర్‌కు పశుసంవర్ధకశాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది. ఇప్పటివరకూ పర్యాటకశాఖ కార్యదర్శిగా ఉన్న ముఖేష్ కుమార్ మీనాను ఎక్సైజ్ కమిషనర్‌గా నియమించింది. ఆయన పర్యాటకశాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు కూడా నిర్వహిస్తారు. టూరిజం డైరెక్టర్ హిమాన్షుశుక్లాను గుంటూరు జేసీగా నియమించి... గుంటూరు జేసీగా ఉన్న ఇంతియాజ్‌కు కృష్ణా కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించింది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ కృతికా శుక్లాను కృష్ణా జాయింట్ కలెక్టర్‌గా నియమించి... అక్కడ పనిచేస్తున్న విజయాకృష్ణన్‌కు సాధారణ పరిపాలనశాఖలో డిప్యూటీ సెక్రటరీ బాధ్యతలు ఇచ్చింది.

ఏపీఎస్పీ చీఫ్‌గా గోపాలరావు

ఏపీఎస్పీ ఐజీ రాజీవ్‌కుమార్ మీనాను గుంటూరు జోన్‌కు ఐజీగా బదిలీ చేసింది. ప్రస్తుతం గుంటూరు ఐజీగా ఉన్న గోపాలరావును ఏపీఎస్పీ చీఫ్‌గా నియమించింది. విజయవాడ సిటీలో శాంతి భద్రతల డీసీపీగా పనిచేస్తున్న గజారావు భూపాల్‌ను మంగళగిరిలోని 6వ బెటాలియన్‌కు బదిలీ చేసింది.

ఏపీపీఎస్సీ సభ్యుడిగా ఎం.వి.రామరాజు

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిగా ఎం.వి.రామరాజును నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పునేఠ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రామరాజు ప్రస్తుతం సాధారణ పరిపాలనశాఖ (జీఏడీ)లో అదనపు కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

సీపీఎస్‌పై ఆందోళన ఆగదు : ఎమ్మెల్సీ కత్తి

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు కోసం అసెంబ్లీ సమావేశాల్లో ఆందోళన కొనసాగిస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి చెప్పారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దుకు గురువారం చలో అసెంబ్లీకి పిలుపునిచ్చామన్నారు. సీపీఎస్‌పై ప్రభుత్వం కమిటీ వేసినా ఇంత వరకు నివేదిక ఇవ్వలేదని చెప్పారు. నిరాహార దీక్ష చేసిన 21 మందిపై పెట్టిన కేసులను ప్రభుత్వం ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

హామీపత్ర టీచర్ల బకాయిలకు మోక్షం: కత్తి

డీఎస్సీ-2008 హామీ పత్రాల ఉపాధ్యాయులకు 2014 జూన్ 2 నుంచి వేతన వ్యత్యాసాల ప్రయోజనాలు వర్తింపజేస్తూ పాఠశాల విద్యాశాఖ స్పెషల్ సీఎస్ ఆదిత్యనాథ్ దాస్ బుధవారం ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విడుదలైన జీవో 140ను అనుసరించి చేసిన ప్రతిపాదనలపై ఈ ఉత్తర్వులిచ్చారని ఆయన వివరించారు.

దేశంలో 12,500 ఆయుష్ కేంద్రాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశవ్యాప్తంగా ఆయుష్ సేవలు అందించేందుకు 12,500 ఆరోగ్య కేంద్రాలను గుర్తించాలని కేంద్ర ఆయుష్‌శాఖ మంత్రి శ్రీపాద్ యశో నాయక్ కోరారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆయుష్/ఆరోగ్య మంత్రుల 4వ సదస్సును బుధవారం ఢిల్లీలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమశాఖ పరిధిలోని పరిశోధక మండలి రాష్ట్రాల్లో కేన్సర్, మధుమేహం, గుండె జబ్బుల నివారణ, నియంత్రణకు దేశవ్యాప్త కార్యక్రమం(ఎన్‌పీసీడీసీఎస్) చేపడుతోందని తెలిపారు. ఏపీలోని కృష్ణాజిల్లాలో సీసీఆర్‌హెచ్(కేంద్ర హోమియోపతి పరిశోధన మండలి) ఎన్‌పీసీడీసీఎస్ చేపడుతోందని చెప్పారు.

మోదం.. ఖేదం

- 25% ఫిట్‌మెంట్‌పై ఎన్ఎంయూ ఆగ్రహం
- రాష్ట్రవ్యాప్తంగా డిపోల వద్ద నిరసనలు
- ఇదే ఫైనల్ కాదు: జేఏసీ

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వేతన సవరణ కోసం దాదాపు రెండేళ్లు వేచి చూసిన ఏపీఎస్ఆర్టీసీ కార్మికులు తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 50శాతం ఫిట్‌మెంట్ సాధించి తీరుతామన్న జేఏసీ 25 శాతానికి అంగీకరించడంపై కార్మికులు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా బస్‌డిపోల ముందు ఎన్ఎంయూ నిరసన చేపట్టింది. ఇది బ్లాక్ డే అంటూ జేఏసీపై మండిపడింది. అయితే 25శాతమే ఫైనల్ కాదని, ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ తర్వాత వారితో సమానంగా ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని జేఏసీ కన్వీనర్ పలిశెట్టి దామోదర్‌రావు తెలిపారు. 2017 ఏప్రిల్‌లో జరగాల్సిన వేతన సవరణ వాయిదా పడుతూ వస్తుండటంతో గత ఏడాది గుర్తింపు సంఘంగా ఉన్న ఎన్ఎంయూ 54శాతం కావాలని యాజమాన్యంపై ఒత్తిడి పెంచింది. దీంతో 19శాతం మధ్యంతర భృతి ప్రకటించిన సంస్థ ఆర్టీసీలో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలకు సిగ్నలిచ్చింది. దీంతో 50శాతం ఫిట్‌మెంట్ సాధించి తీరుతామని హామీఇచ్చిన ఈయూ కూటమి ఎన్నికల్లో విజయం సాధించింది. అనంతరం యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిపిన ఈయూ కూటమి నేతలు 50శాతం వేతన సవరణకు డిమాండ్ చేశారు. పలు సందర్భాల్లో చర్చలు విఫలమవడంతో ఈయూ కూటమి 8 కార్మిక సంఘాలతో కలిసి జనవరి 23న జేఏసీగా ఏర్పడి ఫిబ్రవరి 6 నుంచి సమ్మెకు వెళతామని ప్రకటించింది. దీంతో ప్రభుత్వం రవాణాశాఖ మంత్రి అచ్చెన్నాయుడును రంగంలోకి దించింది. 25 శాతం ఫిట్‌మెంట్‌కు జేఏసీ అంగీకరించింది.



ఆర్టీసీ డిపో ముందు ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ

52 వేలమందికి ద్రోహం: ఎన్ఎంయూ

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయిస్తాం, 50శాతం వేతన సవరణ సాధిస్తాం అని కార్మికులను మభ్యపెట్టి ఓట్లేయించుకున్న ఎంప్లాయీస్ యూనియన్ 52 వేల మందికి ద్రోహం చేసిందని ఎన్ఎంయూ నేతలు మండిపడ్డారు. రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు విజయవాడ, తిరుపతిలో నిరసనలో పాల్గొని జేఏసీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నేతలు ఎంతకు అమ్ముడు పోయారని నిలదీశారు.

ప్రేమ పేరిట ఉన్మాదం

- ఇంటర్ విద్యార్థినిపై కొబ్బరి బొండాల కత్తితో దాడి
- చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న బాలిక



నిందితుడు భరత్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానంటూ రెండేళ్లుగా వేధిస్తున్నాడు! పోలీసులు, తల్లిదండ్రులు, షీటీమ్స్ హెచ్చరించినా వినలేదు. ప్రేమ పేరిట ఉన్మాదిగా మారాడు! కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో విచక్షణ లేకుండా దాడి చేశాడు! ఇప్పుడు ఆ బాలిక చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటన హైదరాబాద్‌లోని బర్కత్‌పుర సత్యానగర్‌లో బుధవారం జరిగింది. కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యానగర్‌లో ఉంటున్న కె.రాములు రెండో కుమార్తె మధులిక (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇదే బస్తీలో ఉంటున్న భరత్ (19) జాగృతి కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాడు. భరత్ రెండేళ్లుగా మధులికను ప్రేమిస్తున్నానని వెంటపడుతుంటే ఆమె నిరాకరిస్తూ వస్తోంది. ఆమె తల్లిదండ్రులు కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేస్తే వాళ్లు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. షీటీమ్స్ బృందం కూడా కౌన్సెలింగ్ ఇచ్చింది. అయినా, భరత్‌లో మార్పు రాలేదు. ఆమెపై కక్షపెంచుకున్నాడు. బుధవారం ఉదయం కాలేజీకి వెళుతుండగా కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ దాడిలో ఆమె ఎడమ చేతి నాలుగు వేళ్లు తెగిపోయాయి. చేతులు, భుజం, మెడపై కత్తితో ఇష్టం వచ్చినట్లు దాడి చేశాడు. ఆమెను మలక్‌పేటలోని యశోదా ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. మధులిక మైనర్ కావడంతో ఆమెపై కత్తితో దాడి చేసిన భరత్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని కాచిగూడ ఏసీపీ సుధాకర్ తెలిపారు.

టీవీ నటి నాగఝాన్సీ ఆత్మహత్య

- ఫ్లాట్‌లో చున్నీతో ఉరివేసుకొని బలవన్మరణం
- సూర్య అనే వ్యక్తితో ఏడాదిగా ప్రేమాయణం
- పెళ్లికి ప్రియుడు మొహం చాటేయడంతో కలత
- ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో..

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తమ ప్రేమ.. పెళ్లి బంధం దాకా వెళుతుందని కలలు కంది. అతడి మైకంలో పడి నటిగా వచ్చిన అవకాశాలనూ వదులుకుంది. ప్రేమ విషయంలో కన్నవారి అభ్యంతరాలనూ కాదని అతడినే నమ్ముకుంది. తీరా ఆ 'ప్రేమ ప్రయాణం' పెళ్లిదాకా వచ్చేసరికి అతడు మొహం చాటేయడాన్ని భరించలేకపోయింది. మనోవేదనతో ఆత్మహత్యకు పాల్పడింది. ప్రముఖ టీవీ నటి.. 'పవిత్ర బంధం' డైలీ సీరియల్ ఫేమ్ నాగఝాన్సీ (21) విషాదాంతమిది! మంగళవారం రాత్రి హైదరాబాద్ అమీర్‌పేటలో తాను ఉంటున్న ఫ్లాట్‌లోనే ఆమె ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో తీసుకుందని.. ఆ వీడియోను పోలీసులు చూశారనే ప్రచారం జరుగుతోంది. ఆమె ఫోన్‌లోని ఇన్‌కమింగ్.. ఔట్ గోయింగ్ కాల్స్.. వాట్సాప్ చాటింగ్‌లో కొన్ని మెసేజ్‌లు డిలీట్ అయినట్లు సమాచారం.

ఏడాదిగా ప్రేమలో..

సంవత్సరం క్రితం నాగఝాన్సీ విజయవాడకు చెందిన సూర్యతేజతో ప్రేమలో పడింది. పెళ్లికి ఝాన్సీ కుటుంబం అంగీకరించలేదు. అయితే, పెళ్లి చేసుకుంటానని చెప్పిన సూర్యతేజ తర్వాత మొఖం చాటేయడంతో ఝాన్సీ తీవ్ర మానసిక వేదనకు లోనైంది.



సూర్యతేజతో నాగఝాన్సీ (ఫైల్)

నాలుగేళ్ల క్రితం నగరానికి..: నాగఝాన్సీ స్వస్థలం కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం వడాలి గ్రామం. నాలుగేళ్ల కిందట తల్లి, సోదరుడితో కలిసి అమీర్‌పేట నాగార్జుననగర్ కాలనీ సాయిరాం రెసిడెన్సీలోని 401 ఫ్లాట్‌లో ఉంటోంది. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి 8:30 గంటలకు ఇంటికివచ్చిన అన్న తలుపులు తట్టినా నాగఝాన్సీ తీయలేదు. అనుమానంతో తలుపులను బలవంతంగా తెరిచి చూడగా.. నాగఝాన్సీ చున్నీతో ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. పంజాగుట్ట పోలీసులు, క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించారు. గాంధీలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

గుట్టంతా సెల్‌ఫోన్‌లోనే!

నాగఝాన్సీ వాడుతున్న రెండు సెల్‌ఫోన్లనూ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక సెల్‌ఫోన్‌లో ఔట్ గోయింగ్, ఇన్‌కమింగ్ కాల్స్.. వాట్సాప్ చాటింగ్ చేసిన మెసేజ్‌లు డిలీట్ చేసినట్లు గమనించారు. ఆత్మహత్యకు ముందు ఆమె సూర్యతో వాట్సాప్ చాట్ చేసినట్లు, ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుసుకున్నారు. తర్వాత సెల్ఫీ వీడియో తీసుకుందని, పోలీసులు వీడియో కోసం మరో ఫోన్ పరిశీలించగా అది లాక్ చేసివున్నట్లు తెలిసింది.

లోకం తీరు



ప్రతిపక్షాలతో పాటు వీళ్లు కూడా మనకు ఎన్నికల్లో ప్రత్యర్థులే సార్..!

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
విశాఖపట్నం	15.6	32.8
హైదరాబాద్	17.3	32.0
చిత్తూరు	18.0	30.5
కడప	18.0	34.0
గుంటూరు	19.9	32.8
విజయవాడ	20.5	31.1
ఒంగోలు	21.7	31.6
నెల్లూరు	22.5	32.0

ఉత్తర కోస్తాలో పెరిగిన చలి

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తర కోస్తాలో చలి పెరిగింది. మధ్య భారతం మీదుగా వస్తున్న చలిగాలులు ఉత్తర కోస్తా వరకు విస్తరించాయి. దీంతో బుధవారం రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. కళింగపట్నంలో 15 డిగ్రీలు నమోదైంది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో ఉత్తర కోస్తాలో చలి కొనసాగుతుందని వాతావరణ అధికారి తెలిపారు. వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ ప్రభావంతో రెండు రోజుల తరువాత చలి పెరుగుతుందన్నారు. కోస్తా, రాయలసీమల్లోని మిగిలిన ప్రాంతాల్లో చలి ప్రభావం తగ్గింది. పగటి పూట ఎండ తీవ్రత పెరిగింది. కర్నూలులో 34.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా రానున్న మూడు రోజుల తరువాత కోస్తా, రాయలసీమలో వర్షాలకు అవకాశం వున్నదని వాతావరణ అధికారి తెలిపారు.



కాంగ్రెస్, బీజేపీవి హిందూత్వ రాజకీయాలు

కాంగ్రెస్, బీజేపీలు రెండూ హిందూత్వ రాజకీయాలను అవలంబిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో యోగి ప్రభుత్వం ముజఫర్‌నగర్ అల్లర్లలో నిందితులపై ఉన్న కేసులను కొట్టివేసింది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ముగ్గురు గోవధ నిందితులపై జాతీయ భద్రతా చట్టాన్ని ప్రయోగించాలని చూస్తోంది.

- పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ



నన్ను చంపేందుకు నితీశ్ కుట్ర

గతవారం రాజ్‌భవన్ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నపుడు నన్ను చంపేందుకు బిహార్ సీఎం నితీశ్ కుమార్ కుట్ర పన్నారు. ఆ ప్రదర్శనలో నా మీద, ఇతర నాయకులపైన పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ ఘటనపై పట్నా హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.

- ఆర్ఎల్ఎస్పీ చీఫ్ ఉపేంద్ర కుశావహ

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్ (విజయవాడలో)		డీజిల్	
పాత ధర	రూ. 74.17	పాత ధర	రూ. 70.29
కొత్త ధర	రూ. 74.17	కొత్త ధర	రూ. 70.34
మార్పులేదు		పెరుగుదల: 5 పైసలు	

ధ్యానంతో అలసటకు చెక్!

వాషింగ్టన్, ఫిబ్రవరి 6: పారిశ్రామికవేత్తలు వృత్తిలో బిజీగా మారితే అలసటతో సరిగా నిద్రపోరు. అలాంటి వారు రోజులో కనీసం 10 నిమిషాలు ప్రశాంతంగా ధ్యానం చేస్తే తమ శక్తిని తిరిగి కూడదీసుకోవచ్చునని తాజా సర్వే పేర్కొంది. అమెరికాలోని ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. రోజులో 44 నిమిషాలు ఎక్కువ నిద్రపోతే ఎంతటి ఉపశమనం కలుగుతుందో.. వారానికి 70 నిమిషాలు ధ్యానం చేయడం వల్ల అంతే ప్రశాంతత లభిస్తుందని సర్వేలో తెలిపారు.

ఊబకాయంతో కేన్సర్ ముప్పు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఊబకాయం లేదా అధిక బరువుకు.. 13 రకాల కేన్సర్లకు సంబంధం ఉందని తాజా సర్వే గుర్తించింది. అందుకే ఊబకాయం తగ్గించుకుంటే కేన్సర్ ముప్పు అంతగా ఉండదని సూచిస్తోంది. ఒక్క కేన్సరే కాకుండా టైప్2 షుగర్, హృద్రోగ సమస్యలకూ దూరంగా ఉండొచ్చని చెబుతోంది. బ్రెస్ట్, కొలన్, ఎండోమెట్రియల్, స్టమక్, ఒవరియన్, ఎసోఫాజియల్, గాల్‌బ్లేడర్, కిడ్నీ, లివర్, పాంక్రియాటిక్, ప్రొస్టేట్, థైరాయిడ్, మెనింగియోమా కేన్సర్లకు ఊబకాయానికి సంబంధం ఉందని తేల్చారు.

ఐడియాకు రూ.50 వేలు!

- 26 కాలేజీల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి కార్యక్రమం
- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- అంతర్జాతీయ కంపెనీలతో ఏపీఎస్ఎస్‌డీసీ ఎంవోయూ
- ప్రత్యక్షంగా ఉద్యోగ, ఉపాధి కల్పిస్తాం
- బయటివారికీ అవకాశం: సీఈవో కృత్తికా శుక్లా

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్టార్టప్ ఐడియాలకు సంబంధించి ఒక్కో ఐడియాకు రూ.50 వేలు, ఆపై అందించే అవకాశం కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో కృత్తికా శుక్లా తెలిపారు. ఇందులోభాగంగా విద్యార్థుల్లో వ్యవస్థాపక సామర్థ్యాన్ని పెంచే ప్రముఖ సంస్థలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా 26 కాలేజీల్లో ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఔత్సాహిక పారిశ్రామికవేత్తల) డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. బుధవారం విజయవాడలోని కార్యాలయంలో వెంచర్ ఇంక్యుబేషన్ హబ్‌లు ఏర్పాటు చేయబోయే కాలేజీలకు చెందిన ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఏపీఎస్ఎస్‌డీసీ - ఐ2ఈ ప్రోగ్రామ్ విజవంతానికి వాధ్వాని ఫౌండేషన్, ఐడియా ల్యాబ్స్, టాటా ట్రస్ట్, స్టార్టప్ ఇండియా ల్యాబ్స్ ఫౌండర్ పంకజ్ దివానీతో పాటు వాధ్వాని ఫౌండేషన్, టాటా ట్రస్ట్, టీఐఈ ప్రతినిధులతో బుధవారం ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా కృత్తికా శుక్లా మాట్లాడుతూ 2019-20 నాటికి 40 వేల మంది విద్యార్థులకు ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా శిక్షణ లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. స్టార్టప్స్‌కు ఎంపిక అయిన ఐడియాలకు టాటా ట్రస్ట్ వారు 50 లక్షల ఫండ్ ఇస్తారని, మిగతా సంస్థల నుంచి కూడా ఆర్థిక సాయం అందేలా చూస్తామని చెప్పారు. కాలేజీ యాజమాన్యాలు ఈ ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకుని తమ విద్యార్థులను ఎంటర్‌ప్రెన్యూర్‌గా తయారు చేయాలని కృత్తికా శుక్లా సూచించారు.

సీఎంతో కేఈ సోదరుల భేటీ

- కోట్ల చేరిక... డోన్, పత్తికొండ స్థానాలపై చర్చ

కర్నూలు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, సోదరులు బుధవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఉండవల్లిలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. జనవరి 28న కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆయన భార్య, డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి ఉండవల్లిలో సీఎంతో భేటీ అయిన సంగతి తెలిసిందే. కర్నూలు లోక్‌సభ స్థానంతో పాటు ఆలూరు, డోన్ అసెంబ్లీ స్థానాలు కోట్ల అడిగినట్లు తెలుస్తోంది. అయితే, మొదటి నుంచి డోన్‌లో కేఈ సోదరుడు కేఈ ప్రతాప్, పత్తికొండ నుంచి కేఈ తనయుడు కేఈ శ్యాంబాబు పోటీ చేస్తారని ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో కేఈ కృష్ణమూర్తి, సోదరులు, తనయుడు శ్యాంబాబు సీఎంతో సమావేశమై... పత్తికొండ, డోన్ తమకే కేటాయించాలని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. కాగా, కేఈ కుటుంబంపై ఉన్న గౌరవం తగ్గదని సీఎం అన్నట్లు సమాచారం. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ సీఎంతో భేటీపై సంతృప్తి వ్యక్తం చేశారు.

జగన్‌కు తగిలింది చిన్న గాయమే: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ శాసనసభ ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డిపై 2018 అక్టోబర్ 25న విశాఖ విమానాశ్రయంలో ఫ్యూజన్ ఫుడ్ రెస్టారెంట్‌కు చెందిన ఉద్యోగి ఒకరు దాడి చేయడంతో ఆయనకు స్వల్పగాయమైందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ అహిర్ చెప్పారు. రాజ్యసభలో బుధవారం వైసీపీ ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ ఆ ఉద్యోగిని పోలీసులకు అప్పగించారని, ఈ సంఘటనపై దర్యాప్తును జాతీయ పరిశోధన సంస్థ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ)కి అప్పగించామని ఆయన పేర్కొన్నారు. సీఐఎస్ఎఫ్ నివేదిక వివరాలు వెల్లడించాలని కోరినా మంత్రి జవాబివ్వలేదు.

పురపాలికల్లో ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల పరిధిలో ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాల్సిన వారికి రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. భవనాలు, ఖాళీ స్థలాలపై ఆస్తి పన్ను బకాయిలతోపాటు 2018-19 ఆర్థిక సంవత్సరపు పన్ను కూడా కలిపి ఒక్కసారే చెల్లిస్తే సదరు మొత్తాలపై వడ్డీ మాఫీ అవుతుందని పేర్కొంటూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం వచ్చే నెల 31వ తేదీ వరకు గడువు ఇచ్చింది. ఇప్పటికే బకాయిలు చెల్లించినవారికి వడ్డీ రూపంలో చెల్లించిన నగదును భవిష్యత్తులో వారు చేయబోయే ఆస్తి పన్ను చెల్లింపుల్లో సర్దుబాటు చేయాలని ఆదేశించింది.

ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్‌తో ఈ నెలాఖరులో భేటీ కాబోతున్నట్టుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' ప్రసంగంలో నిర్ధారించడం సంతోషించవలసిన పరిణామం. 'నేను అధ్యక్షుడిని కాకపోయివుంటే ఉత్తరకొరియాతో ఈ పాటికి అమెరికా భీకరమైన యుద్ధంలో ఉండేది. లక్షలాదిమంది ప్రాణాలు కోల్పోయేవారు' అన్నారు ట్రంప్. కొరియాతో గత పాలకుల కంటే ఎక్కువగా తలగోక్కున్నదీ, ఇందుకు భిన్నంగా కిమ్‌తో ప్రత్యక్షభేటీకి సాహసోపేతంగా దిగివచ్చిందీ ఈయనే. గత ఏడాది జూన్‌లో సింగపూర్ వేదికగా కిమ్–ట్రంప్ తొలిభేటీ జరిగితే, ఫిబ్రవరి 27–28 తేదీల్లో తదుపరి భేటీకి వియత్నాం వేదిక కాబోతున్నది. 'ఎంతకాలం గ్యాంగ్‌స్టర్‌లా వ్యవహరిస్తారు? ఆంక్షలు ఎత్తివేస్తారా, లేక మళ్ళీ అణ్వస్త్ర తయారీకి ఉపక్రమించమంటారా?' అంటూ జనవరి 1 ప్రసంగంలో కిమ్ తీవ్ర హెచ్చరికలు చేసిన విషయం తెలిసిందే.

కిమ్‌ను భయాన తప్ప నయాన దారికి తేలేమని బలంగా నమ్ముతున్న వారందరినీ సింగపూర్ భేటీ అమితాశ్చర్యంలో ముంచింది. అమెరికా అంచులను తాకే క్షిపణి పరీక్షలతో, ఉభయదేశాధ్యక్షుల మధ్యా సాగిన మాటల యుద్ధంతో, వాణిజ్య సమరంతో 2017లో ప్రపంచం యుద్ధభయంలో మునిగిపోయింది. అంతటి ఉద్రిక్తతల నేపథ్యంలో, గత ఏడాది పాలకులు ఇద్దరూ చూపిన చొరవతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ట్రంప్–కిమ్ మధ్య పదమూడు సెకండ్ల పాటు సాగిన కరచాలనం ఘర్షణాత్మక వాతావరణాన్ని ఛేదించింది. కానీ, ఆ స్ఫూర్తి, వేగం ఆ తరువాత లేకపోయింది. సింగపూర్ భేటీ దండుగనీ, అణు నిరాయుధీకరణకు సంకల్పం చెప్పుకోవడం వినా నిర్దిష్ట కార్యాచరణంటూ లేనందున కిమ్ ఎంతమాత్రం హామీలకు కట్టుబడరని అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. కానీ, కిమ్ మాటకు కట్టుబడ్డారు. ట్రంప్ తన ప్రసంగంలో పేర్కొన్నట్టుగా అనేక నెలలుగా క్షిపణిపరీక్షలు, అణ్వాయుధాల తయారీ,

మరో ముందడుగు

ప్రయోగం వంటివేమీ లేవు. అత్యంత కీలకమైన పుంగ్యేరీ అణుకేంద్రాన్ని కూడా కొరియా ధ్వంసం చేసినట్టు వార్తలు వచ్చాయి. మరొక పక్కన, ఉత్తరకొరియా తన అణు, క్షిపణి సామర్థ్యాన్ని యథాతథంగా నిలబెట్టుకున్నదనీ, క్షిపణులను దాచిందనీ, ఆంక్షలు ఉల్లంఘిస్తూ ఎగుమతి దిగుమతులు జరుపుతున్నదని ఐక్యరాజ్యసమితి నిపుణుల బృందం హెచ్చరిస్తున్నది. జనవరి 1 ప్రసంగంలో కిమ్ చేసిన హెచ్చరికలు ఉత్తిమాటలు కావనీ, అమెరికా దిగిరానిపక్షంలో ఆయన పూర్వావతారంలోకి మారిపోతారన్నది వాస్తవం. తాను ఎంత దిగివచ్చినా ఆంక్షలు అలాగే సాగడం, చర్చలు స్తంభించిపోవడంతో కిమ్ ఆగ్రహించి నాలుగైదుసార్లు రైల్లో చైనా వెళ్ళొచ్చారు కూడా. కిమ్ హెచ్చరికల తరువాత అమెరికావైపునుంచి మళ్ళీ కదలిక మొదలైంది.

ఉత్తరకొరియా సంపూర్ణ నిరాయుధీకరణకు కృషిచేస్తుందన్న హామీ మినహా గత ఒప్పందంలో అణునిరాయుధీకరణకు ఏం చేయాలి, ప్రక్రియ ఏ విధంగా సాగాలి, కాలవ్యవధి ఏమిటన్న స్పష్టతలేవీ లేకపోయాయి. అందువల్ల ఈ సారైనా విస్పష్టమైన విధివిధానాలతో ఒప్పందాలు జరుగుతాయని ఆశించాలి. సింగపూర్ సమావేశం వరకూ ఉభయనేతలూ తొలిసారిగా కలవడం, కూర్చుని మాట్లాడుకోవడమే ఒక అద్భుత విజయం, చరిత్రాత్మకం. కానీ, ఈ మలి భేటీలో అస్పష్టతకు ఏమాత్రం తావిచ్చినా అప్రదిష్ట తప్పదు. నిరాయుధీకరణ ప్రక్రియ దశలవారీగా సాగుతూ ప్రతి దశలోనూ కొంత ప్రతిఫలం దక్కాలని ఉత్తరకొరియా కోరుకుంటున్నది. ఇప్పటివరకూ చేసినదానికి ప్రతిఫలంగా ఆంక్షలనుంచి ఉపశమనం అందాలని అంటున్నది. అమెరికా, ఐక్యరాజ్యసమితి ఆంక్షలతో కొరియా తీవ్ర ఇబ్బందులు పడుతున్నది. ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని ప్రజలకు కిమ్ ఇచ్చిన మాట నెరవేరాలంటే ఆంక్షలు తొలగాలి. సంపూర్ణ అణు నిరాయుధీకరణ తరువాతే ఉపశమనాలన్న మొండివైఖరిని అమెరికా సడలించుకుంటే తప్ప ఈ పరిస్థితుల్లో మార్పురాదు. సింగపూర్ సమావేశం తరువాత, ఇచ్చిన హామీలకు కిమ్ కట్టుబడతారన్న నమ్మకం తనకుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇలా అంటూనే, ఆర్నెల్ల తరువాత తాను పొరపాటు చేశానని ఒప్పుకోవలసి రావచ్చనీ, అప్పుడు ఏవో కుంటిసాకులు వెదుక్కుంటానని కూడా ట్రంప్ అన్నారు. తనకు ఆ అవసరం రానీయకుండా చేసిన కిమ్ విషయంలో మరింత సానుభూతితో, సానుకూలంగా వ్యవహరించవలసిన బాధ్యత ట్రంప్‌పై ఉన్నది.

చంద్రన్నకు ఎందుకు ఓటెయ్యాలి?

అవును! ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు నిలకడైన నాయకుడిని, అనుభవంతో కూడిన పాలనను, దార్శనికత నిండిన సారథినీ, సామాజిక న్యాయాన్ని అందించే పార్టీనీ కోరుకుంటున్నది. రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి కాకుండా క్రమశిక్షణతో, కట్టుబాటుతో ముందుకు సాగాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరమున్నది. అది, ఎవరితో పొత్తయినా, ఎలాంటి ఎత్తయినా, ఆంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తే లక్ష్యంగా ఆలోచించి నిర్ణయం తీసుకునే చంద్రబాబు సారథ్యమే ఆయన గెలుపు అవసరాన్ని ముందుకుతీసుకొస్తున్నది. నాలుగేళ్లక్రితం కట్టుబట్టలతో పెట్టేబేడా సర్దుకుని నిలువనీడలేని చోట రాజధానిని వెతుక్కుంటూ వచ్చిన ఆంధ్రప్రదేశ్‌ను గాడిన పెట్టాలంటే చంద్రబాబుకే సాధ్యమని నమ్మిన ప్రజానీకం కులమతాలకు అతీతంగా ఆలోచించి, ఎలాంటి ఆర్థిక ప్రలోభాలకు తలొగ్గకుండా అధికారాన్ని బాబుకు అప్పగించింది. అనాథగా మారిన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకుని, అభివృద్ధి చేయాల్సిన బాధ్యతను బాబుపై పెట్టింది. పాలన పగ్గాలు చేపట్టిన చంద్రబాబు ఎలాంటి భేషజాలకు పోకుండా, అహంకారానికి చిరునామాగా మారిన మోదీతో ఎప్పటికప్పుడు సర్దుకుపోతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వరంగం, ప్రయివేటురంగం రెండూ రెండు కళ్ళు లాంటివని భావించి ప్రభుత్వ రంగంలో నిధులకోసం కేంద్రం వెంటపడుతూ, ఇంకోవైపు ప్రయివేటు రంగంలో పలు సంస్థలు, కంపెనీలు ఆంధ్రలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచమంతా పర్యటించారు. పట్టువిడవని ప్రయత్నాలతో 16 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించగలిగారు. ఎడారిలాంటి అనంతపురం జిల్లాకు కియాలాంటి అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన కార్ల ఫ్యాక్టరీని రప్పించి వేలాది కుటుంబాలలో వెలుగులు నింపగలిగారు. ఆంధ్రప్రదేశ్‌కు గుండెకాయలాంటి పోలవరం ప్రాజెక్టుకు మోదీ ప్రభుత్వం ఎంతగా మోకాలడ్డుతున్నా విరామమెరుగక పరిశ్రమించి ఇప్పటికే దాదాపు 70 శాతం ప్రాజెక్టును పూర్తిచేయగలిగారు. ఒకవైపు, రాష్ట్ర ప్రయోజనాలకోసం చంద్రబాబు సహనంతో మోదీతో సర్దుకుపోతూంటే, మరోవైపు కేవలం తన వ్యక్తిగత అహాన్ని సంతృప్తి పరచుకునేందుకు ప్రధాన మంత్రి తన రాజధర్మానికి తిలోదకాలిచ్చి ఐదు కోట్ల ఆంధ్ర ప్రజలకు కీడు చేసేందుకు కంకణం కట్టుకున్నారు. నాడు మోదీ ముఖ్యమంత్రిగా ఉండగా గుజరాత్‌లో జరిగిన ముస్లింల ఊచకోత సందర్భంగా చంద్రబాబు తీవ్రంగా విమర్శించి, రాజీనామాకు డిమాండ్ చేయడమే మోదీ బాబుపై ద్వేషం పెంచుకునేందుకు అసలైన కారణం. అప్పటి ద్వేషాన్ని మనస్సులో పెట్టుకున్న మోదీ ఎలాగైనా చంద్రబాబును పలురకాల ఇబ్బందులకు గురిచేసేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. నోట్లరద్దు, జీఎస్టీ, ప్రతిపక్షాలపై సీబీఐదాడులు, గోరక్షణపేరుతో హత్యలు, మేధోజీవులను అంతమొందించడాలు, మైనారిటీలు, దళితులపై నిత్యం దాడులతో దేశం నిత్య అగ్ని గుండమై రగులుతోంది. పరిస్థితి రోజురోజుకూ విషమిస్తుండడం, ఆంధ్రప్రదేశ్ ప్రజలే కాకుండా యావత్ భారతీయులు మోదీ పాలనలో అష్టకష్టాలు పడుతుండడంతో ఆయన పాలనను అంతంచేయాల్సిన అవసరం ముంచుకొచ్చి అనివార్యపరిస్థితుల్లో ఎన్డీఏతో తెగతెంపులు చేసుకున్నారు. మోదీ మళ్లీ ప్రధాని అయితే ఆంధ్రుల భవిష్యత్ అగమ్యగోచరమవుతుంది



ఆంధ్రా ద్వేషులు, అనుభవరహితులు నవ్యాంధ్ర పాలకులయితే మన బిడ్డల బంగారు భవిష్యత్తుకు చేజేతులా సమాధి కట్టుకోవడమే అవుతుంది. ఆలోచనాపరులైన ఆంధ్ర ప్రజలు ఎన్నికలలో విలువైన, ప్రయోజనకరమైన నిర్ణయం తీసుకోవాలి. చంద్రన్నకు అధికారంతోనే స్వర్ణాంధ్ర సాకారమవుతుంది.

కావున ఆ దుస్థితి రాకుండా కాపాడుకునేందుకు, వ్యవస్థల విధ్వంసాన్ని అడుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు కాంగ్రెస్‌తో సహా దేశంలోని సెక్యులర్ పార్టీలను కూడగట్టేందుకు నడుంకట్టారు. దేశంలో సంకీర్ణరాజకీయాలు నడపడంలో చంద్రబాబుకు ఉన్న విశేష అనుభవాన్ని, చాకచక్యాన్ని, ఓపికను గౌరవించిన మమత, రాహుల్, దేవెగౌడ, స్టాలిన్, మాయావతి, కేజ్రీవాల్, అఖిలేశ్, తేజస్వీయాదవ్‌లతో సహా 22మంది ప్రతిపక్ష పార్టీల నేతలు ఇప్పుడు ఐక్యంగా మోడీని సాగనంపేందుకు ముందుకు సాగుతున్నారు. దీంతో, బెంబేలెత్తిన మోదీ బాబును ఎలాగైనా ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం చేసి చంద్రబాబుకు చెక్‌పెట్టేందుకు సర్వశక్తులూ వొడ్డుతున్నారు. ఎన్నికల వరకూ చంద్రబాబు దేశరాజకీయాలపై దృష్టిసారించకుండా ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం చేయడం, ఎన్నికలలో ఎలాగైనా ఓడించి ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టడమన్న రెండు ఎత్తుగడలతో రెచ్చిపోతున్నారు. మోదీ పార్టీ బీజేపీకి ఇక్కడ బాబును ఓడించే బలంలేదు. ఎన్నికల రణరంగంలో ప్రత్యక్షంగా మోడీ ముఖం కనిపిస్తే ఆయన నమ్మకద్రోహాన్ని అర్థం చేసుకున్న ఆంధ్రప్రజలు ఆయనపై కసితో సైకిల్‌పై ఓట్లవృష్టి కురిపించడం ఖాయం. ఈ వాస్తవం ఆయనకూ తెలుసు. కావునే తాను తెరవెనుకచేరి తన అంతర్గత మిత్రులతో కథ నడిపించేందుకు ఎత్తులేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీకి తోడుగా పిచ్చి ఆంధ్రవ్యతిరేకి అయిన టీఆర్‌ఎస్‌నూ రంగంలోకి దింపారు. జగన్ – కేసీఆర్ జట్టుతో ఆంధ్రను కబళించేందుకు మోదీ సిద్ధమయ్యారు. బాబు వ్యతిరేక పార్టీలకు నోట్ల కట్టలు అందించడంతోపాటు, సీబీఐ, ఈడీ, ఎలక్షన్‌కమిషన్‌లాంటి కేంద్ర సంస్థలను ప్రయోగించి బాబుకు ఊపిరాడకుండా చేయడం ద్వారా ప్రజల మూడ్ మార్చేందుకు పన్నాగం పన్నుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌కు ఇది అత్యంత కీలక సమయం. నాలుగు సంవత్సరాలకు పైబడిన చంద్రబాబు కృషితో ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు రోడ్డెక్కిందేగాని, ఇంకా నాలుగు రోడ్ల కూడలిలోనే ఉంది. ఆంధ్రా ద్వేషులు, అహంభావులు, అనుభవరహితులు నవ్యాంధ్ర పాలకులయితే చేజేతులా మన బిడ్డల బంగారు భవిష్యత్‌కు సమాధి కట్టుకోవడమే అవుతుంది. ఈ నేపథ్యంలో, విజ్ఞులు, ఆలోచనాపరులైన ఆంధ్ర ప్రజలు ఎన్నికలలో విలువైన, ప్రయోజనకరమైన నిర్ణయమే తీసుకుంటారని ఆశిద్దాం. చంద్రన్నకు అధికారం–స్వర్ణాంధ్ర సాకారం అన్న నినాదంతో ముందుకుపోదాం.

■ బంగి సుదర్శన్

అమెరికా పన్నెండు అంచెల కుట్ర

సెప్టెంబర్ 15, 1970 తేదీన అప్పటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్, జాతీయ భద్రతా సలహాదారు హెన్రీ కిస్సింగర్‌లు ఒక కుట్రకు శ్రీకారం చుట్టారు. చిలీలో సాల్వడార్ అలెండే ఆధ్వర్యంలో సోషలిస్టు ప్రభుత్వం గనుక ఏర్పాటైతే దాన్ని గద్దె దించేందుకు సర్వసన్నద్ధమయ్యారు. తర్వాతి కాలంలో వెల్లడైన రహస్య పత్రాల ప్రకారం "చిలీ ఆర్థిక వ్యవస్థను బెంబేలెత్తించాలి" అన్నాడు నిక్సన్. ఇందుకోసం అమెరికా 'ఫ్యూబెల్ట్' అనే గూఢచర్య ప్రణాళిక పేరిట భారీగా ఖర్చుపెట్టింది కూడా.

అలెండే అధికారంలోకి రాగానే చిలీలో రాగి ఉత్పత్తి రంగాన్ని జాతీయం చేసాడు. దీంతో అప్పటిదాకా ఆ రంగంలో గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తున్న అమెరికా సంస్థలు 'అనకొండ కాపర్, 'కెన్నెకాట్, ఇంకా టెలీకమ్యూనికేషన్స్ సంస్థ 'ఐటిటి', సాఫ్ట్ డ్రింక్ దిగ్గజం 'పెప్సీ'లు కలిసి అమెరికా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. ఫలితంగా అమెరికా గూఢచారి సంస్థ సిఐఎ చిలీ సైన్యంలో అలెండే వైరి వర్గాలను కనిపెట్టి రెచ్చగొట్టింది. మూడేళ్ళ తర్వాత సెప్టెంబర్ 11, 1973 తేదీన అలెండే ప్రభుత్వంపై సైనిక తిరుగుబాటు జరిగింది. ఈ పరిణామాల్లో అలెండే చనిపోయాడు. ఆ తర్వాత చిలీ సైనిక నియంతృత్వపు చీకటి రాత్రిలోకి మళ్ళిపోయింది. అమెరికా వ్యాపార సంస్థల గుత్తాధిపత్యానికి బానిసైపోయింది. అమెరికా అంతర్జాతీయస్థాయి దాదాగిరీ ఇలాగే ఉంటుంది మరి!

1973లో చిలీపై ప్రయోగించిన ఈ కుట్ర నమూనానే అమెరికా అనేక ప్రపంచ దక్షిణాది దేశాలపైనా ప్రయోగించింది. ఆ వరుసలో అమెరికా, దాని వ్యాపార సంస్థల తాజా లక్ష్యం వెనిజులా. అమెరికా నుంచి వెనిజులా ఎదుర్కొంటున్న ఒత్తిడి కొత్తదేం కాదు. ఇదే ఒత్తిడిని ఇటు ఇండోనేషియా నుంచి అటు కాంగో దాకా ఎన్నో దేశాలు ఎదుర్కొన్నాయి. ఒక దక్షిణ దేశాన్ని పశ్చిమ దేశాల ముందూ ఆ దేశాల వ్యాపార సంస్థల ముందూ సాష్టాంగ పడేలా చేయటానికీ, ఆ దేశంలో తిరుగుబాటు పరిస్థితుల్ని కల్పించటానికీ అమెరికా పన్నే కుట్ర నమూనా పన్నెండు అంచెల్లో అమలవుతుంది.

1) వలస పాలన విధించిన చట్రాలు. ప్రపంచానికి దక్షిణంవైపున్న దేశాలు చాలావరకూ వలస పాలన విధించిన చట్రంలో చిక్కుకుపోయి ఉన్నాయి. వలస పాలన వల్ల ఈ దేశాలు ఒకేవొక్క సరుకును ఉత్పత్తి చేసే దేశాలుగా మిగిలిపోయాయి. ఉదాహరణకు క్యూబా అంటే షుగర్, వెనిజులా అంటే ఆయిల్. తమ ఆర్థిక వ్యవస్థల్ని బహుముఖంగా విస్తరించుకోలేకపోవటం వల్ల ఈ దేశాల రాబడి అంతా ఆ ఒకేవొక్క సరుకుపై ఆధారపడింది (వెనిజులా ఎగుమతి రాబడిలో 98శాతం ఆయిల్ ద్వారానే వస్తుంది). ఆ ఒక్క సరుకు ధరలు బాగా వున్నంతకాలం దేశానికి రాబడి బానే ఉంటుంది, దాని ధర తగ్గితే రాబడి సన్నగిల్లిపోతుంది. జూన్ 2008 నాటికి 160.72 డాలర్లుగా ఉన్న ఆయిల్ బారెల్ ధర జనవరి 2019నాటికి 51.99 డాలర్లకు పడిపోయింది. వెనిజులా రాబడి కుప్పకూలిపోయింది.

2) NIEOను ఓడించటం. 1974లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తమకు అనుకూలంగా పునర్నిర్మించేందుకు దక్షిణ దేశాలన్నీ ఏకమై ఒక నూతన అంతర్జాతీయ ఆర్థిక శ్రేణి (న్యూ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఆర్డర్ – NIEO) ఏర్పాటుకు పిలుపునిచ్చాయి. దీని వల్ల ఒకేవొక్క సరుకు అనే చట్రం నుంచి తాము బయటపడి, తమ ఆర్థిక వ్యవస్థలను బహుముఖంగా విస్తరించుకోగలమని భావించాయి. ఆయిల్, బాక్సైట్ వంటి ముడి పదార్థాలకు ఉత్పత్తి కూటములు (కార్టెల్స్) ఏర్పడాలని, ఆ విధంగా చేస్తే ఒక్క సరుకునే ఎగుమతి చేసే దేశాలకు వాటి ధరలపై కొంత అదుపు వస్తుందనీ ఆశించాయి. 1960లో ఏర్పడిన 'ద ఆర్గనైజేషన్ ఆఫ్ పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్' (OPEC) ఈ ఉత్పత్తి కూటముల భావనకు శ్రీకారం చుట్టింది. అయితే తక్కిన ఉత్పత్తి కూటములను ఏర్పాటు కానివ్వకుండా అడ్డంకులు కల్పించారు. గత మూడు దశాబ్దాలుగా ఓపీఈసీ వైఫల్యం వల్లన దాని సభ్య దేశాలకు (వెనిజులా వంటివి) ఆయిల్ ధరలపై నియంత్రణ లేకపోయింది.

3) వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయటం. 2001లో ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) ఖతార్ రాజధాని దోహాలో సమావేశమై ఉత్తరాది దేశాల వ్యావసాయిక పరిశ్రమల ఉత్పత్తిని దక్షిణాది దేశాల్లోని కోట్లాదిమంది సన్నకారు రైతుల మీదకీ, కౌలు రైతుల మీదకీ ఎక్కుపెట్టింది. యంత్రీకరణ, పరిశ్రమస్థాయి భారీ వ్యవసాయ క్షేత్రాలు ఉత్తర అమెరికాలోనూ, యూరోపులోనూ వ్యవసాయ



1973లో చిలీపై ప్రయోగించిన కుట్ర నమూనానే అమెరికా అనేక ప్రపంచ దక్షిణాది దేశాలపైనా ప్రయోగించింది. ఆ వరుసలో అమెరికా, దాని వ్యాపార సంస్థల తాజా లక్ష్యం వెనిజులా. అమెరికా నుంచి వెనిజులా ఎదుర్కొంటున్న ఒత్తిడి కొత్తదేం కాదు. ఇదే ఒత్తిడిని ఇటు ఇండోనేషియా నుంచి అటు కాంగో దాకా ఎన్నో దేశాలు ఎదుర్కొన్నాయి. ఒక దక్షిణ దేశాన్ని పశ్చిమ దేశాల ముందూ ఆ దేశాల వ్యాపార సంస్థల ముందూ సాష్టాంగపడేలా చేయటానికీ, ఆ దేశంలో తిరుగుబాటు పరిస్థితుల్ని కల్పించటానికీ అమెరికా పన్నే కుట్ర పన్నెండు అంచెల్లో అమలవుతుంది.

ఉత్పత్తిని భారీగా పెంచాయి. ఈ దేశాల్లో ఒక రైతు 10–20లక్షల కిలోల వరకూ తృణధాన్యాన్ని ఉత్పత్తి చేయగలుగుతుంటే, తక్కిన ప్రపంచ దేశాల్లో ఒక రైతు కేవలం వెయ్యి కిలోల తృణ ధాన్యాన్ని ఉత్పత్తి చెయ్యటానికే చెమటోడుస్తున్నాడు. అలా దోహా సమావేశం దక్షిణ దేశాల వ్యవసాయ రంగానికి పెను దెబ్బగా పర్యవసించింది. వ్యవసాయంలో కార్పొరేట్లు ప్రవేశించి రైతులను భూమికి దూరం చేసాయి, ఆకలికి దగ్గర చేసాయి.

4) దోపిడీ సంస్కృతి. పెరిగే ఈ పాశ్చాత్య పెత్తనంతోపాటే ఆ దేశాల్లోని గుత్తాధిపత్య వ్యాపార సంస్థలకు కొమ్ములొచ్చి చట్ట విరుద్ధంగా వ్యవహరించటం మొదలుపెట్టాయి. ధరలను తప్పుగా నిర్ణయిచటం, పన్ను ఎగవేత పథకాలద్వారా పేద దేశాల నుంచి బిలియన్ల కొద్దీ డాలర్లను దొంగిలించాయి. డెమాక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో ఏడాది బడ్జెట్ ఆరు బిలియన్ డాలర్లలోనూ, దాదాపు 500 మిలియన్‌లను మైనింగ్ కంపెనీలు దోచుకుంటున్నాయి (ముఖ్యంగా ఇప్పుడు అమెరికా తరపున వెనిజులాపై కత్తిగట్టిన కెనడాకు చెందిన కంపెనీలు).

5) అప్పుల ఊబిలోకి. అటు తమకున్న ఒక్క సరుకునూ సవ్యంగా అమ్ముకోలేవు. మరో పక్క వ్యవసాయమూ కుదేలవుతుంది. దీంతో దక్షిణాది దేశాలు అప్పులపై ఆధారపడక తప్పదు. గత దశాబ్ద కాలంలో ఈ దక్షిణాది దేశాల అప్పు బాగా పెరిగిపోయింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF) తమ 67 పేద సభ్య దేశాల్లో 30 దేశాలు తీవ్రమైన అప్పుల్లో ఉన్నాయని తేల్చింది. ఉదాహరణకు అంగోలా ఎగుమతి రాబడిలో 55.4శాతం అప్పులు తీర్చటానికే వెళ్తుంది. ఘనా, చాడ్, గాబోన్, వెనిజులా కూడా ఇదే పరిస్థితిలో ఉన్నాయి.

6) ప్రభుత్వ ఆదాయాల్లో క్షీణత. ఎగుమతుల రాబడి, పన్నుల రాబడి తగ్గటంతో దక్షిణాది దేశాల ప్రభుత్వాదాయాలు క్షీణిస్తాయి. ఒక ఐక్యరాజ్య సమితి సమావేశం వెల్లడించినదాని ప్రకారం– ప్రస్తుతం ఈ దేశాలు ప్రభుత్వ కనీస నిర్వహణావసరాలకు కూడా నిధులు సమకూర్చుకోలేకపోతున్నాయి.

7) సామాజిక వ్యయాల్లో కొరత. నిధులు సమకూర్చుకోలేక, అంతర్జాతీయ ఋణ సంస్థల కోరల్లో చిక్కుకొని, ఈ ప్రభుత్వాలు తమ సామాజిక వ్యయాలను తగ్గించుకోవాల్సి వస్తుంది. విద్య, ఆరోగ్యం, ఆహార భద్రత, ఆర్థిక రంగ విస్తరణ... ఈ ప్రాధాన్యతలన్నీ పక్కకు వెళ్ళిపోతాయి. ఇదే దశలో అంతర్జాతీయ ద్రవ్యనిధి వంటి సంస్థలు ఈ దేశ ప్రభుత్వాలపై "సంస్కరణలు" అమల్లోకి తేవాలని ఒత్తిడి ప్రారంభిస్తాయి. ఈ "సంస్కరణ" అనే పదానికి అర్థం– దేశాలు తమ స్వాతంత్ర్యాన్ని కోల్పోవటమే.

8) సామాజిక వైఫల్యంతో వలసలు పెరుగుతాయి. ప్రస్తుతం ప్రపంచంలో ప్రవాసుల సంఖ్య కనీసం 68.5 మిలియన్లు. అంటే "ప్రవాసం" అనే పేరుతో ఒక దేశం ఉంటే అది జనాభా ప్రకారం ప్రపంచంలో 21వ స్థానంలో ఉంటుంది. ప్రస్తుతం వెనిజులా నుంచి పెరుగుతున్న వలసలు ఆ దేశానికే ప్రత్యేకం కాదు. ప్రపంచవ్యాప్త సంక్షోభానికి అది ఒక సూచన.

9) కథనాన్ని దారి మళ్ళించేది ఎవరు? కార్పొరేట్ మీడియా తన ఆదేశాల్ని పైస్థాయి నుంచి అందుకుంటుంది. ప్రపంచం ఏ సంక్షోభంలో ఉన్నా దానికి లెక్కలేదు. పాశ్చాత్య ఒత్తిడికి లొంగి "సంస్కరణలు" అనే మాటను వల్లె వేస్తే చాలు సదరు దేశాల నేతలు సురక్షితమైనట్టే. అలాగాక, ఈ "సంస్కరణల"కు వ్యతిరేకంగా గళం విప్పితే ఆ దేశాల నేతలపై "నియంతలు"గాను, ఆ దేశ ప్రజలపై "బాధితులు"గాను ముద్ర పడుతుంది. అప్పుడు ఆ దేశాల వ్యవహారాల్లో వేలుపెట్టి ఎన్నికలతో నిమిత్తం లేకుండా పాలకుల్ని మార్చవచ్చు. ఈ స్పెషల్ ట్రీట్మెంట్‌ను ప్రస్తుతం వెనిజులా ఎదుర్కొంటోంది.

10) ఎవరు అసలు అధ్యక్షుడు? ప్రస్తుతం వెనిజులాలో ప్రజలచేత ఎన్నికకాని ఒక వ్యక్తిపై అమెరికా తన ప్రయోజనాల బరువును మోపింది. అతడిని అధ్యక్షుడిగా గుర్తిస్తూ, నిజంగా ఎన్నికైన నాయకుడి అధికారాన్ని లక్ష్యపెట్టడం లేదు. ఒక శక్తిమంతమైన దేశం తనకు అనుకూలమైన వ్యక్తిని ఎన్నికలతో నిమిత్తంలేకుండా అధ్యక్ష పదవిలో కూర్చోబెట్టదలచినపుడు అందుకు వీలుగా ఆ దేశంలో సైనిక కుట్రో, తిరుగుబాటో జరుగుతుంది. ప్రస్తుతం వెనిజులాలో ఆ అనుకూలుడైన వ్యక్తి జువాన్ గ్యాయిడో. అతను వీలైనంత వేగంగా అమెరికాకు తన విధేయత చూపించుకోవాలి. అమెరికాతో సన్నిహిత సంబంధాలున్నవారితో కూడిన అతని మంత్రివర్గం వీలైనంత త్వరగా అన్నింటినీ ప్రైవేటీకరించటానికీ, వెనిజులా ప్రజలను అమ్మేయటానికీ సిద్ధంగా ఉన్నారు.

11) ఆర్థిక వ్యవస్థను బెంబేలెత్తించడం. వెనిజులా 2014 నుంచీ అమెరికా నుంచి ఆంక్షలను ఎదుర్కొంటోంది. ఆ మరుసటి ఏడాది అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా వెనిజులాను తమ "జాతి భద్రతకు విపత్తు"గా ప్రకటించారు. ఇక వెనిజులా ఆర్థిక వ్యవస్థ బెంబేలెత్తటం మొదలైంది. వెనిజులా రాబడికి ఒకేవొక్క దారైన ఆయిల్‌పై ఆంక్షలు విధించటం ద్వారా అమెరికా, బ్రిటన్‌లు కలిసి ఎన్నో బిలియన్ల డాలర్ల వెనిజులా డబ్బును కొల్లగొట్టాయి. ఆ దేశం బాధతో తన్నుకులాడుతుంటే ఎడంగా నిలబడి చోద్యం చూసాయి. అమెరికా ఇరాన్‌ను ఇలాగే చేసింది, క్యూబాను ఇలాగే చేసింది.

12) యుద్ధానికి వెళ్ళడం. ఇటీవల అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ చేతిలో పట్టుకున్న యెల్లో పాడ్‌పైన "కొలంబియాలో 5,000 సైనికులు" అని రాసివుండటం అంతా చూసారు. అంటే ఈ అమెరికా సైన్యం ప్రస్తుతం వెనిజులా పొరుగుదేశంలో అదనుకోసం పొంచి వుంది. మొత్తానికి ఒక ప్రభుత్వాన్ని కూలదోయటానికి తగిన వాతావరణం అంతా అమిరింది. ఇంక కొంచెం సాకు దొరకటమే తరువాయి, యుద్ధానికి వెళతారు.

ఇది ఇక ఆపమని చెప్పాల్సిన సమయం, స్వప్రయోజనార్థం వేరే దేశాల ప్రభుత్వాల్లో వేలుపెట్టడం ఆపమని గట్టిగా చెప్పాల్సిన సమయం.

■ విజయ్ ప్రసాద్

('ఆల్టర్‌నెట్' సౌజన్యం)

జనవాక్యం

న్యూఢిల్లీలో విద్యార్థుల ర్యాలీ

గడిచిన ఐదు సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని పట్టించుకోకపోగా కార్పొరేటీకరణ, కాషాయీకరణను ప్రోత్సహిస్తున్నది. దేశ వ్యాప్తంగా వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూసివేశారు. ప్రవేటు యూనివర్సిటీలను ఆహ్వానించి ప్రభుత్వరంగ యూనివర్సిటీలను విస్మరించారు. ప్రాథమిక విద్యతో మొదలుకొని ఉన్నత విద్య వరకు పేదవారికి విద్య అందుబాటులో లేకుండా చేసిన ఘనత బి.జె.పి ప్రభుత్వానికే దక్కింది. అనేక యూనివర్సిటీలలో వేలాదిగా ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులు ఇప్పటికీ భర్తీ చేయలేదు. నేను అధికారంలోకి వస్తే దేశంలో కోటి ఉద్యోగాలు భర్తీ చేస్తా అని ప్రకటించిన నరేంద్ర మోదీ లక్ష ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదు. 24 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా మిగిలిపోయాయి. పెట్టుబడిదారుల కోట్లాది రూపాయల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసినపుడు, విద్యార్థి ఎడ్యుకేషన్ లోన్‌లు ఎందుకు మాఫీ చేయరాదని అడుగుతున్నాం. గత పది సంవత్సరాలుగా కొన్ని యూనివర్సిటీలకే పరిమితం చేసిన ఎన్నికలను విద్యాసంస్థలన్నింటిలోను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయవలసిన అవసరం ఉన్నది. దేశ వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలపై నిర్బంధాన్ని నిలిపివేయాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసి మౌలిక వసతులు కల్పించాలని, విద్య కార్పొరేటికరణ, కాషాయికరణ నిలిపివేయాలని మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నేడు ఢిల్లీలో ఎర్రకోట నుండి పార్లమెంట్ స్ట్రీట్ వరకు దేశంలోని అన్ని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో 30 వేల మందితో జరగబోతున్న 'యంగ్ ఇండియా అధికార్ మార్చ్'' ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతున్నాం.

– మద్దిలేటి
రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ విద్యార్థి వేదిక

ఎటు పోతున్నాం మనం?

రాజ్యాంగ విలువలను పాటించవలసిన న్యాయవ్యవస్థ అమరావతిలో హైకోర్టు భవన శంకుస్థాపనలో చేసినదేమిటి? లౌకికదేశంలో అందునా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల సమక్షంలో శంకుస్థాపన పూజలు, పురోహితుల మంత్రాలు ఏమిటి? ఎటుపోతున్నాం మనం? తమ తమ స్వంత ఇళ్లకి వారు ఈ విధంగా చేసుకుంటే ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ, అమరావతిలో జరిగింది పూర్తిగా రాజ్యాంగవిరుద్ధం. న్యాయమూర్తుల సమక్షంలో లౌకికవాదం సమాధి అయింది. ఇక, తెలంగాణలో వ్యవహారం రాజులపాలనగా వుంది. ఎన్నికలు జరిగి నెలరోజులైనా మంచిరోజులేదని ఇంతవరకు మంత్రివర్గం ఏర్పడలేదు. కేసీఆర్ యజ్ఞాలు, యాగాలకు ఇచ్చిన ప్రాధాన్యం ప్రజాపాలనకి ఇవ్వటం లేదు. వందలకోట్లుపెట్టి యాదాద్రిని తిరుపతికంటె పెద్దగుడిగా తయారుచేస్తానని ఆయన అంటున్నారు. పాలనలో పోటీ ఉండాలి కానీ, గుళ్ళ నిర్మాణంలో కాదు. గుళ్లు కట్టిస్తే ప్రజలు భక్తులుగా తయారౌతారు. భక్తి ప్రజలను ఆలోచించనీయదు. అంతా పైవాడు చూసుకుంటాడనే పరాధీనతాభావం ప్రజల్లో ఏర్పడితే ప్రశ్నించే తత్వం నశిస్తుంది. ప్రశ్నించకుండా వుండేందుకే ప్రభుత్వాలు ప్రజలలో భక్తిని ఎక్కిస్తున్నాయి. ప్రశ్నించేతత్వం, శాస్త్రీయ ఆలోచన, మానవవాదాన్ని పెంచటం ప్రతిపౌరుని బాధ్యత. లౌకికవాదం ఖచ్చితంగా అమలు జరిగే విధంగా ప్రభుత్వాలపై వత్తిడి తేవలసింది ప్రజలే.

– నార్నె వెంకటసుబ్బయ్య
అధ్యక్షుడు, ఏపీ హేతువాదసంఘం

డిజిటైజేషన్‌తో స్వేచ్ఛ ఎవరికి?

డిజిటైజేషన్‌లో కేబుల్ టీవీ చందాదారుడికి స్వేచ్ఛ లభిస్తుందన్న ప్రభుత్వం మాటల్లో డొల్లతనం ఇప్పుడు బైటపడింది. ట్రాయ్ చెబుతున్న మాటలకూ, ఆచరణలో జరుగుతున్నదానికీ ఎంతమాత్రమూ పొంతనలేదు. కోరుకున్న చానల్స్ కే చెల్లించటం వలన కేబుల్ బిల్లు భారం తగ్గుతుందని నమ్మబలికిన ట్రాయ్, పే చానల్స్ కు గరిష్ఠంగా రూ.19 వరకూ వసూలు చేసుకోవటానికి అవకాశం కల్పించటం ద్వారా పెనుభారం మోపింది. బిల్లు కనీసం రెట్టింపైంది. క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేస్తే ఆ విషయం స్పష్టంగా తెలుస్తుంది.

ఎమ్మెస్వో / కేబుల్ ఆపరేటర్ లేదా డిటిహెచ్ ఆపరేటర్ తమ నెట్ వర్క్ కెపాసిటీ ఫీజు కింద రూ. 130 తీసుకున్నందుకు 100 ఉచిత చానల్స్ ఇస్తారని ట్రాయ్ చెప్పింది. కానీ అందులో 26 డిడి చానల్స్ తీసుకోవాలన్న విషయం పైకి చెప్పలేదు. అదే విధంగా పే చానల్స్ ఈ లెక్కలోకి కూడా వస్తాయని, చందా అదనమని సామాన్యుడికి అర్థమయ్యేలా చెప్పటంలోనూ ట్రాయ్ విఫలమైంది. మొత్తంగా చూస్తే చందాదారు స్వేచ్ఛ విషయంలో ట్రాయ్ తప్పుదారి పట్టించిందన్న నిజం ఇప్పుడిప్పుడే తెలుస్తోంది.

ఇంకోవైపు పంపిణీదారులు ఉచిత చానల్స్ జాబితా మరింత కుదించటం ద్వారా ఎంపిక స్వేచ్ఛకు పూర్తి విఘాతం కలిగిస్తున్నారు. ఇప్పటివరకూ వెలువడిన ఉచిత చానల్స్ జాబితాలు చూస్తుంటే కేవలం 100 నుంచి 150 మాత్రమే ఉంటున్నాయి. అంటే ఎంచుకునే అవకాశాన్ని బాగా కుదించినట్టయింది. పంపిణీదారుడు ఇచ్చిన వాటి నుంచి ఎంచుకోవాల్సిందే తప్ప చందాదారుడు తాను చూడాలనుకుంటున్న చానల్స్ కోరుకోవటానికి అవకాశం లేదు. అంటే ఆ ఎమ్మెస్వో ఇవ్వలేకపోతే ఇంకో ఎమ్మెస్వోను లేదా డిటిహెచ్ ఆపరేటర్ ను చూసుకోవాల్సిందే తప్ప కచ్చితంగా ఇవ్వాలని అడగటానికి వీల్లేదు. ఎమ్మెస్వోకు మాత్రం తాను ఇవ్వదలచుకున్న చానల్స్ ఇచ్చే స్వేచ్ఛ ఉంది. అందువలన ట్రాయ్ చెప్పే చందాదారు స్వేచ్ఛ వట్టిమాటే.

అనలాగ్ లో 100 చానల్స్ కంటే ఇవ్వలేని పరిస్థితి ఉందని, డిజిటైజేషన్ తరువాత కనీసం 500 చానల్స్ మించి ఇవ్వగలిగే అవకాశం ఉంటుందని ట్రాయ్ పదే పదే చెబుతూ వచ్చింది. కానీ హైదరాబాద్, విజయవాడ నగరాలలో 80% ఇళ్లకు కేబుల్ ప్రసారాలు అందించే ఎమ్మెస్వోలకు కూడా అలాంటి సామర్థ్యం లేదు... ఇక గ్రామీణ ప్రాంతాల పంపిణీదారుల సంగతి సరే సరి. నెట్ వర్క్ సామర్థ్యం లేకపోవటంతో ఎంచుకునే అవకాశం చందాదారుకు ఇవ్వకుండా వాళ్ళే తమకు ఇష్టమొచ్చిన చానల్స్ ఇస్తున్నారు. ఒక వైపు పే చానల్ వాళ్ళు ధరల భారం మోపితే, ఇంకోవైపు ఎమ్మెస్వోలు ఉచిత చానల్స్ ఎంచుకునే స్వేచ్ఛ హరిస్తున్నారు.

ఉన్న సామర్థ్యాన్ని ముందుగా పే చానల్స్ కోసం కేటాయించటం, ఉచిత చానల్స్ పట్ల చిన్న చూపు చూడటం కూడా కనిపిస్తుంది. స్టార్, జీ, సోనీ, వయాకామ్ 18 లాంటి సంస్థలు తమ చానల్స్ తో రకరకాల బొకేలు తయారు చేశాయి. చందాదారు ఒక బొకే కోరుకుంటే కచ్చితంగా ఆ బొకేలోని అన్ని చానల్స్ ఇచ్చి తీరాలి. అందుకే పే చానల్స్ కోసం 200 నుంచి 300 దాకా రిజర్వ్ చేసుకొని ఆ తరువాతనే ఉచిత చానల్స్ గురించి ఆలోచించటం ఈ పరిస్థితికి దారితీసింది. చందాదారులు తాము చానల్స్ ఎంచుకునే అవకాశం గురించి అడుగుదామంటే ఆపరేటర్ తన సమస్యే ఇంకా తేలక సతమతమవుతున్నాడు. ఎమ్మెస్వో, ఆపరేటర్ మధ్య నెట్ వర్క్ కెపాసిటీ ఫీజు (రూ.130) ఏ నిష్పత్తిలో పంచుకోవాలన్న వ్యవహారం ఒక కొలిక్కి రాలేదు. ట్రాయ్ ఎమ్మెస్వోకు 55%, ఆపరేటర్ కు 45% సూచించింది. ఇరుపక్షాలూ చర్చల ద్వారా ఒక అవగాహనకు వస్తే ఈ నిష్పత్తి మార్చుకోవచ్చునని సూచించింది. దీంతో తమ ఎమ్మెస్వో నిర్ణయం కోసం ఆపరేటర్లు ఎదురుచూస్తున్నారు. అది తేలిన తరువాతనే చందాదారు ప్యాకేజీల గురించి ఆలోచించాలనుకుంటున్నారు.

ఈ లోపు గడువు దగ్గర పడటంతో హడావిడి మరింత ఎక్కువైంది. ఈ హడావిడిలో ఆపరేటర్ తన పరిధిలో ప్రజల అభిరుచికి అనుగుణంగా ఉచిత



ఇప్పుడు చందాదారు స్వేచ్ఛ విషయంలో పట్టుబట్టగలిగింది ఒక్క కేబుల్ ఆపరేటర్ మాత్రమే. ఉచిత చానల్స్ జాబితా చందాదారుకు సంతృప్తికరంగా ఉండేలా ఎమ్మెస్వో మీద వత్తిడి తీసుకురాగలిగితే తప్ప ప్రయోజనం ఉండదు. అలా ఇవ్వకపోతే ఎక్కువ చానల్స్ ఇవ్వగలిగే వేదిక వైపు వెళతామనే హెచ్చరిక మాత్రమే చందాదారుకు మేలు చేయగలుగుతుంది. ఎక్కువ ఉచిత చానల్స్ ఇవ్వగలిగే ఎమ్మెస్వోకు ఆపరేటర్ ప్రాధాన్యం ఇస్తేనే చందాదారుడికి న్యాయం జరుగుతుంది. ప్రాంతీయ చానల్స్‌కు కారేజ్ ఫీజు భారం నుంచి విముక్తి కలుగుతుంది.

చానల్స్ ఉండాలని కోరినా ఎమ్మెస్వో పట్టించుకుంటాడా? పట్టించుకున్నా, ఇవ్వగలిగే అవకాశం ఉంటుందా? తన కారేజ్ ఫీజు ఆదాయాన్ని పక్కనబెట్టి మరీ చానల్స్ ఇస్తాడా? ఇవ్వడు గాక ఇవ్వడు. మరి చందాదారు ఊరుకుంటాడా? ఊరుకోకపోతే ఇంకో సెట్ టాప్ బాక్స్ కొనుక్కోవటానికి సిద్ధమై డిటిహెచ్ కి వెళ్ళాలి. అలా చేయడని ఎమ్మెస్వో నమ్మకం. అలా వెళ్ళనివ్వడని ఆపరేటర్ మీద నమ్మకం. ఎందుకంటే, ఆపరేటర్ తన వ్యాపారం కోసం ఏదో విధంగా చందాదారుకు నచ్చజెబుతాడనే ధైర్యం.

రాష్ట్రంలో 80 శాతం ఎమ్మెస్వోల పరిస్థితి ఇలాగే ఉంది. ఇచ్చే కొద్దిపాటి ఉచిత చానల్స్ లోనూ సొంత ప్రయోజనాలకే పెద్దపీట వేస్తారు. ఇక్కడా వాళ్ళకు వెసులుబాటు కలిగేలా ట్రాయ్ చెప్పిందేంటంటే 26 డిడి చానల్స్ తో బాటు ఒక్కో విభాగానికి చెందిన ఉచిత చానల్స్ ఐదేసి ఇస్తే చాలని. అంటే ఏవైనా ఐదు జనరల్ ఎంటర్టైన్మెంట్ చానల్స్, ఐదు ఉచిత న్యూస్ చానల్స్, ఐదు మూవీ చానల్స్, ఐదు మ్యూజిక్ చానల్స్, ఐదు కిడ్స్ చానల్స్, ఐదు స్పోర్ట్స్ చానల్స్, ఐదు ఇన్ఫొటైన్మెంట్ చానల్స్ ఇస్తే చాలని. ఇక మిగిలిన వన్నీ వాళ్ళ ఇష్టం. కారేజ్ ఫీజు లేదా ప్లేస్ మెంట్ ఫీజు చెల్లించి కచ్చితంగా తమ చానల్ వచ్చేలా చూసుకునే చానల్స్ కే అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఎంత పిండుకోగలిగితే అంత వాళ్ళదే!

డిజిటైజేషన్ తరువాత చానల్ యజమానులు కారేజ్ ఫీజు ఇవ్వాల్సిన అవసరం పెద్దగా ఉండదని ట్రాయ్ నమ్మబలికింది. ఉచిత చానల్స్ చాలా సంతోషించాయి. కానీ, ట్రాయ్ అదే సమయంలో ప్లేస్ మెంట్ ఫీజు పేరుతో ప్రత్యేకంగా వసూలు చేసుకునే వెసులుబాటు ఎమ్మెస్వోలకు కల్పించింది. ఇప్పుడు ఎమ్మెస్వోలు అటు కారేజ్ ఫీజు, ఇటు ప్లేస్ మెంట్ ఫీజు వసూలు చేసుకోవటానికి సిద్ధమయ్యారు. చందాలు పెంచిన పే చానల్ యజమానులు తాత్కాలికంగా సంతోషంగా ఉండవచ్చునేమోగాని ముందు ముందు వాళ్ళకు కూడా ఎమ్మెస్వోలు ప్లేస్ మెంట్ పేరుతో చుక్కలు చూపించటం ఖాయం.

ఒక నెట్ వర్క్ లో కనీసం 20 శాతం మంది కోరుకుంటే ఆ చానల్ నుంచి కారేజ్ ఫీజు వసూలు చేయకుండా ఉచితంగా ఇవ్వాలి. అంటే, ఒక ఎమ్మెస్వో పరిధిలో ఉన్న చందాదారులు తాము ఎంచుకోవటానికి అవకాశమున్న ఉచిత చానల్స్ నుంచి ఎంచుకునేటప్పుడు ఒక చానల్ ను కనీసం 20% మంది కోరుకోవాలి. మామూలుగా అయితే తెలుగు చానల్స్ అన్నీ ఎంచుకునే అవకాశముంటుంది. కానీ ఎంచుకోవాలంటే ముందు ఆ జాబితాలో ఉండాలి కదా! ఇక్కడే ఉంది అసలు మెలిక. 20% మంది వినియోగదారులు ఎంచుకుంటే ఇవ్వాలని ట్రాయ్ చెబుతుంది. జాబితాలో ఇచ్చే స్వేచ్ఛ ఎమ్మెస్వోకే ఇస్తుంది.

ఇప్పుడు చందాదారు స్వేచ్ఛ విషయంలో పట్టుబట్టగలిగింది ఒక్క కేబుల్ ఆపరేటర్ మాత్రమే. ఉచిత చానల్స్ జాబితా చందాదారుకు సంతృప్తికరంగా ఉండేలా ఎమ్మెస్వో మీద వత్తిడి తీసుకురాగలిగితే తప్ప ప్రయోజనం ఉండదు. అలా ఇవ్వకపోతే ఎక్కువ చానల్స్ ఇవ్వగలిగే వేదిక వైపు వెళతామనే హెచ్చరిక మాత్రమే చందాదారుకు మేలు చేయగలుగుతుంది. చందాదారుల ప్రయోజనాలకు, తద్వారా తన వ్యాపారానికి మేలు చేసే విధానం గురించి ఆలోచిస్తేనే స్థానిక ఉచిత చానల్స్ అన్నీ చందాదారులకు అందుతాయి. నిజానికి అప్పుడే ఆపరేటర్ కూడా వ్యాపారంలో నిలదొక్కుకుంటాడు. ఎక్కువ ఉచిత చానల్స్ ఇవ్వగలిగే ఎమ్మెస్వోకు ఆపరేటర్ ప్రాధాన్యం ఇస్తేనే చందాదారుడికి న్యాయం జరుగుతుంది. ప్రాంతీయ చానల్స్ కు కారేజ్ ఫీజు నుంచి భారం నుంచి విముక్తి కలుగుతుంది.

■ తోట భావనారాయణ



కథ కోసం కాలినడక

- విజయనగరంలో
- రచయితల పాదయాత్ర ప్రారంభం

గంట్యాడ(విజయనగరం) ఫిబ్రవరి 6: కథ రచన ప్రాముఖ్యాన్ని, కథ విశిష్టతను భావితరాలకు తెలియజేయాలన్న సంకల్పంతో శ్రీకాకుళం జిల్లాకు చెందిన రచయితలు 'కథ కోసం కాలినడక' పేరుతో విజయనగరంలోని గురజాడ నివాసం నుంచి బుధ వారం పాదయాత్ర ప్రారంభించారు. శ్రీకాకుళంలో కథానిలయం ఏర్పాటు చేసి 22 ఏళ్ల పూర్తయిన సందర్భంగా రచయితలు చీకటి దివాకర్, దాసరి అమరేంద్ర ఢిల్లీ, రామచంద్రరావు, అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు తదితరుల ఆధ్వర్యంలో ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 9 వరకు నాలుగు రోజుల పాటు వివిధ ప్రాంతాలను సందర్శిస్తూ విద్యార్థులు, యువతకు కథలపై చైతన్యం తేవాలని నిర్ణయించారు. తొలిరోజు విజయ నగరం పట్టణం, అయ్యకోనేరు గట్టు, నెల్లిమర్ల మీదుగా నడక సాగించారు. ముందుగా గురజాడకు నివాళి అర్పించి పట్టణంలో ర్యాలీ చేపట్టారు.

తితలీ బాధితులకు 18వేల ఇళ్లు

- ఇంటికి రూ.2.5లక్షల రాయితీ

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తితలీ తుపానుతో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం 18,152 ఇళ్లు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. శ్రీకాకుళం జిల్లాకు 18వేలు, విజయనగరం జిల్లాకు 152 ఇళ్లు కేటాయించింది. లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకునే విధానంలో ఈ ఇళ్లు మంజూరు చేసింది. యూనిట్ కాస్ట్‌ను రూ.2.5లక్షలుగా నిర్ణయించగా... మొత్తం ప్రభుత్వమే రాయితీగా ఇస్తుందని తెలిపింది. ఇందుకోసం రూ.453కోట్లు అవుతున్నాయని పేర్కొంది.

5వేల కోట్లతో పాఠశాలల్లో సదుపాయాలు

తణుకు, ఫిబ్రవరి 6 : రాష్ట్రంలోని 45 వేల ప్రభుత్వ పాఠశాలలల్లో ఐదు వేల కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు బాలుర ఉన్నత పాఠశాలలో.. గోదావరి స్కూల్స్ ఇన్‌ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా హామ్ హైబ్రిడ్ యాన్యుటీమోడ్ పథకం కింద మంజూరైన నిధులకు పైలాన్‌ను ఆవిష్కరించారు.

భాషా చట్టాన్ని ఉల్లంఘించిన ప్రభుత్వం: యార్లగడ్డ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు భవనాల ప్రారంభోత్సవంలో ఇంగ్లీషులో శిలాఫలకాలు వేసి రాష్ట్ర ప్రభుత్వం అధికార భాషా చట్టాన్ని ఉల్లంఘించిందని, దీనికి సీఎం చంద్రబాబు బాధ్యత వహించాలని మాజీ ఎంపీ, కేంద్రీయ హిందీ సమితి సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టం ప్రకారం శిలాఫలకాలు, ఆహ్వాన పత్రాలు ఇంగ్లీషుతో పాటు తెలుగులో కూడా ఉండాలన్నారు. కానీ దురదృష్టవశాత్తు ఇంత వరకు శిలాఫలాలను ఇంగ్లీషులోనే ముద్రించారని అన్నారు. ఇకపై తెలుగులోనే శిలాఫలకాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినా అమలు కాకపోవడం దారుణమన్నారు.

నదుల ప్రక్షాళన



- గోదావరి, నాగావళి శుద్ధికి కార్యాచరణ
- రాజమండ్రి, శ్రీకాకుళంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లు
- వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి అమలు

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

పరిశ్రమలు, నగరాలు, పట్టణాలు విడిచిపెట్టే కాలుష్యం నుంచి నదులను రక్షించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తాజాగా ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో... రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా నదుల ప్రక్షాళనకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాచరణ అమలుకు నిర్ణయించింది. దీని లో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి విశాఖ జోనల్ కార్యాలయం దీనిలో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి విశాఖ జోనల్ కార్యాలయం గోదావరి, నాగావళి నదుల ప్రక్షాళనకు వేర్వేరుగా ప్రణాళికలు రూపొందించింది. నదుల్లో కలిసే మురుగునీటితోపాటు ఇతరత్రా కాలుష్యాన్ని శుద్ధి చేయాలని ప్రతిపాదించిం ది. గోదావరి, నాగావళి నదుల్లో నీటి కాలుష్యం తగ్గించడానికి రాజమండ్రి, శ్రీకాకుళంలలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటుచేయాలని ఆయా నగర పాలక సంస్థలకు సూచించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరికల్లా కార్యాచరణ అమలు చేయాలని స్పష్టంచేసింది. వంశధార నది లో కాలుష్య కారకాలు అదుపులో ఉన్నందున ప్రస్తుతానికి శుద్ధి చేసే ప్రణాళిక అమలు చేయడం లేదు.

నదుల్లో కాలుష్యాలు గుర్తింపు ఇలా

కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రతి నెలా నదుల్లో నమూనాలను సేకరించి ప్రయోగశాలలో విశ్లేషణ చేస్తారు. నదుల్లో కోలీఫాం (నీటిలో బ్యాక్టీరియా కౌంట్), బీవోడీ (బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్)ను విశ్లేషిస్తుంటారు. ఒక లీటరు నీటిలో కోలీఫాం 500 కౌంట్, బీవోడీ మూడు మిల్లీ గ్రాములు దాటకూడదు. ఒకవేళ ఈ పరిమాణాలకు మించి కోలీఫాం, బీవోడీ ఉంటే కాలుష్యం తీవ్రంగా ఉన్నట్టు పరిగణిస్తారు. గోదావరికి రాజమండ్రి, నాగావళికి తోటపల్లి వద్ద ప్రతి నెలా శాంపిల్స్ తీస్తుంటారు. ఈ రెండు నదుల్లో అప్పుడప్పుడు పరిమితికి మించి కాలుష్య కారకాలు వస్తున్నట్టు నిర్ధారణ కావడంతో తగిన చర్యలు చేపట్టాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాజమండ్రి, శ్రీకాకుళంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్‌లు ఏర్పాటుచేయాలని కాలుష్య నియంత్రణ మండలి ప్రతిపాదించింది. వీటికి సంబంధించిన ప్రణాళికలను జిల్లా కలెక్టర్లు, ఆయా నగర పాలక సంస్థలకు పంపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరికల్లా మురుగునీటి శుద్ధిప్లాంట్లు ఏర్పాటుచేయాల్సి ఉంది.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం

నదుల్లో నీటి స్వచ్ఛత ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. నదులకు ఆనుకుని నగరాలు, పట్టణాలు, గ్రామాల నుంచి రోజువారీ సేకరించే చెత్త వేయకుండా నియంత్రించాలి. నదుల్లో పారవేసే చెత్తను శాస్త్రీయ విధానంలో శుద్ధి చేయాలి. రాష్ట్రస్థాయిలో నదుల పునరుజ్జీవన కమిటీ ఇప్పటికే సమావేశమై నదుల ప్రక్షాళనపై చర్చించింది. ఈ మేరకు గోదావరి, నాగావళి నదులకు కార్యాచరణ రూపొందించాం. త్వరలో సంబంధిత విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటుచేస్తాం. ఇంకా తణుకు, భీమవరం మునిసిపాలిటీలలో ఎస్టీపీల నిర్మాణానికి కాలుష్య నియంత్రణ మండలి నిధులు సమకూర్చింది. జాతీయస్థాయిలో పేర్కొన్న కేటగిరీలలో ఆంధ్రప్రదేశ్ చివరిలో ఉన్నది. అయితే నగరాల నుంచి వచ్చే మురుగునీటిని శుద్ధిచేసి విడిచిపెట్టడం ద్వారా నదుల స్వచ్ఛత కాపాడేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నాం.

- ఎన్వీ భాస్కరరావు, జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్

రాజమండ్రిలో 30 ఎంఎల్‌డీ ప్లాంటు

గోదావరి నదికి ఆనుకుని రాజమండ్రి ఉంది. ఈ నగరం నుంచి ప్రతిరోజు 60 ఎంఎల్‌డీ మురుగునీరు ఉత్పత్తి అవుతుంది. అయితే ప్రస్తుతం 30 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధి ప్లాంట్ ఉండగా మరో 30 ఎంఎల్‌డీ శుద్ధి ప్లాంట్ ఏర్పాటుచేయాల్సి ఉంది. సాధారణంగా ఒక ఎంఎల్‌డీ ప్లాంట్ ఏర్పాటుకు కోటి రూపాయలు ఖర్చవుతుంది. ఈ లెక్కన 30 ఎంఎల్‌డీ ప్లాంట్ ఏర్పాటుకు రూ.30 కోట్లు అవసరం. ప్లాంట్ నిర్మాణం తరువాత నిర్వహణ బాధ్యత నగర పాలక సంస్థ చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి ప్రతిపాదించింది.

శ్రీకాకుళంలో 6 ఎంఎల్‌డీ ప్లాంట్లు

నాగావళి నదికి సంబంధించి తోటపల్లి రిజర్వాయర్ దిగువన నీటి కాలుష్య నిర్ధారణకు శాంపిల్స్ సేకరిస్తారు. అయితే శ్రీకాకుళం నగర పాలక సంస్థ నుంచి రోజు ఉత్పత్తి అయిన ఆరు ఎంఎల్‌డీ మురుగునీరు శుద్ధి చేయకుండానే నాగావళిలో విడిచిపెడుతుంటారు. దీంతో సముద్రంలో మురుగునీరు కలుస్తుందని కాలుష్య నియంత్రణ మండలి గుర్తించింది.

చంపాలని చూస్తున్నారు

- దాడి చేయబోతే తప్పించుకున్నా
- కేపీ పాల్ ఆరోపణ



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 6: ప్రజా శాంతి పార్టీ అధికారంలోకి వచ్చేస్తుందన్న భయంతో తనను చంపేందుకు కుట్ర పన్నుతున్నారని ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ ఆరోపించారు. బుధవారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. 'కడప జిల్లా పులివెందులలో మంగళవారం సమావేశం నిర్వహించి తిరుపతికి వస్తుండగా తెల్లటి స్కార్పియోలో కొందరు నన్ను వెంబడించారు. ఆ విషయాన్ని పసిగట్టి.. మా కారును వేగంగా పోనిచ్చి, తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సుకు అడ్డంగా పెట్టాం. నాతోపాటు మరో ఇద్దరు కారు దిగి బస్సులో తిరుపతి వచ్చాం. వాళ్లను తప్పించుకుని మా కారు వేగంగా వచ్చేసింది. బస్సులో నుంచే తెలంగాణ ఏడీజీపీ అంజన్‌కుమార్‌కు ఫోన్ చేసి జరిగింది చెప్పాను. ఆయన వెంటనే స్పందించి సెక్యూరిటీని పంపారు. నాకు రక్షణ కల్పించాలని సీఎం చంద్రబాబును ఎన్నిసార్లు అడిగినా ప్రయోజనం లేదు. ఈ ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలి' అని పాల్ డిమాండ్ చేశారు. అంతకుముందు ప్రజాశాంతి పార్టీలో సభ్యులుగా చేరాలన్న పిలుపుతో అలిపిరి నుంచి ఆయన ర్యాలీ నిర్వహించారు.

తాయత్తు కడితే ఇంటర్ పాస్

- ఓ విద్యార్థినికి జ్యోతిష్కుడి బురిడీ
- 40వేలకు బేరం,అడ్వాన్స్ 10వేలు
- చైన్ అమ్మి కొంత కట్టిన విద్యార్థిని
- డబ్బులిప్పించిన అనంత పోలీసులు


జ్యోతిష్కుడిని ప్రశ్నిస్తున్న పోలీసులు

అనంతపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చిలక జోస్యం చెప్పుకునే వ్యక్తి తన మాయమాటలతో ఓ విద్యార్థినిని బురిడీ కొట్టించాడు. 'నిన్ను చూస్తుంటే. కష్టాలు తప్పేటట్లు లేవు. ఈ తాయత్తు కట్టుకుంటే ఇంటర్ పాసైపోతావ్' అంటూ నమ్మించాడు. తాయత్తు కట్టినందుకు రూ.40 వేలు అడిగాడు. ఎలాగైనా ఇంటర్ పాస్ కావాలన్న ఆశతో ఆమె.. కొంత డబ్బు కట్టింది. మిగతా నగదును ఇంట్లోంచి తీసుకెళ్లే క్రమంలో తల్లిదండ్రులకు దొరికిపోవడంతో, ఈ బురిడీ కథ బయటపడిపోయింది. పోలీసులు ఆ జ్యోతిష్కుడిని విచారించారు. పోలీసుల కథనం ప్రకారం, అనంతపురం నగరంలోని ఓ కళాశాలలో బాధితురాలు ఇంటర్ చదువుతోంది. ఫుట్‌పాత్‌పై చిలక జోతిష్యం చెప్పుకుంటున్నవారిలో ఒక జ్యోతిష్కుడు నాలుగు రోజుల క్రితం రోడ్డు వెంట పోతున్న ఆమెను దగ్గరకు పిలిచాడు. జ్యోతిష్యం చెబుతానని కూర్చోబెట్టి, కొద్దిసేపు ఆ మాట ఈ మాట మాట్లాడాడు. ఈ క్రమంలో ఆ విద్యార్థిని ఇంటర్ చదువుతున్నదని తెలుసుకొని, చిన్నగా పావులు కదిపాడు. 'నేను ఇచ్చిన తాయత్తు కట్టుకుంటే ఎలాంటి కష్టాలు లేకుండా ఇంటర్ పాసైపోతావు' అని నమ్మకంగా చెప్పాడు. జ్యోతిష్కుడి మాటలను నమ్మేసిన ఆమె, తాయత్తు కోసం రూ. 40 వేలు కట్టేందుకు సిద్ధమైంది. తన వద్ద ఉన్న బంగారు గొలుసును అమ్మి అడ్వాన్సుగా రూ.10 వేలు మరుసటిరోజు అందించింది. రూ.5 వేలు చెల్లించేందుకు తల్లిదండ్రులకు తెలియకుండా మరుసటిరోజు ఇంట్లో డబ్బులు తీయబోయింది. అది గమనించిన తల్లిదండ్రులు, అంత డబ్బు ఎందుకంటూ తమ కుమార్తెను ఆరా తీశారు. దీంతో అసలు విషయం వెలుగు చూసింది. విద్యార్థిని ఇచ్చిన వివరాలతో బుధవారం తల్లిదండ్రులు, వారి బంధువులు ఆ జ్యోతిష్కుడిని పట్టుకున్నారు. ఇంతలో అక్కడకు పోలీసులు చేరుకొన్నారు. తమకు కేసు వద్దని, జ్యోతిష్కుడి నుంచి డబ్బులు ఇప్పించాలని తల్లిదండ్రులు పోలీసులను కోరారు. పోలీసులు స్వరం పెంచడంతో విద్యార్థిని నుంచి తీసుకొన్న డబ్బులను అతడు ఇచ్చేశాడు.

బ్రాహ్మణుల హక్కుల సాధనకు

రాష్ట్రీయ బ్రాహ్మణ ఫ్రంట్

- చట్టసభల్లో ప్రాధాన్యమివ్వాలి: సాయినాథ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సామాజికవర్గ హక్కుల సాధనే లక్ష్యంగా "రాష్ట్రీయ బ్రాహ్మణ ఫ్రంట్" పేరిట రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ దీనికి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో రాష్ట్రీయ బ్రాహ్మణ ఫ్రంట్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథ్ శర్మ మాట్లాడుతూ.. చట్టసభల్లో బ్రాహ్మణులకూ సముచిత ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో విద్య, ఉద్యోగం, ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు.

బ్రాహ్మణ గురుకుల్ పేరిట రెండు జిల్లాలకో రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటుచేసి వేద విద్య బోధించాలన్నారు. జాతీయ స్థాయిలో బ్రాహ్మణ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. బ్రాహ్మణులపై దాడుల నియంత్రణకు అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావాలని సాయినాథ్ శర్మ డిమాండ్ చేశారు. ఇంకా పలు డిమాండ్లతో కూడిన వినతిని రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, పీఎంవోలకు అందిస్తామన్నారు.


ధర్నా చేస్తున్న రాష్ట్రీయ బ్రాహ్మణ ఫ్రంట్ నేతలు





అంతా రామమయం..

రామయణ ఘట్టాలకు చిత్రరూపం.. విజయనగరానికి సమీపాన ఎక్కు పెట్టిన విల్లులా రామనారాయణ క్షేత్రం



ఎక్కు పెట్టిన విల్లు ఆకారంలో రామనారాయణ క్షేత్రం

శ్రీమద్రామాయణ మహాకావ్యంలోని కీలకమైన ఘట్టాలు ఒకదాని తర్వాత మరొకటిగా కళ్లముందు ఆవిష్కృతమయ్యే అద్భుత క్షేత్రమది! ఎక్కు పెట్టిన రామబాణం ఆకారంలో ఉండే కమనీయ తీర్థం!! పేరు.. రామనారాయణం. విజయనగరం జిల్లా కేంద్రానికి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రామక్షేత్రాన్ని తిలకించేందుకు దేశం నలుమూలల నుంచీ పర్యాటకులు తరలివస్తుంటారు.

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల జననం.. శివ ధనుర్భంగం.. సీతారామ కల్యాణం.. అరణ్యవాసం.. సీతాపహరణం.. శ్రీరామపట్టాభిషేకం.. ఇలా రామాయణంలో అత్యంత కీలకమైన 72 ఘట్టాలు అద్భుతమైన శిల్పాల రూపంలో కళ్ల ముందు ఆవిష్కృతమయ్యే చోటు రామనారాయణం. రామాయణం బోధించే విలువలను తర్వాతి తరాలకు అందించాలన్న లక్ష్యంతో.. నారాయణం నరసింహమూర్తి ఈ క్షేత్రానికి రూపకల్పన చేశారు. మొత్తం 15 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ క్షేత్ర నిర్మాణాన్ని 2006లో మొదలుపెట్టారు. 2014 మార్చి 22న వేదమంత్రాల నడుమ ప్రారంభించి ప్రజల సందర్శనార్థం తెరిచారు.

ఎన్నెన్నో ప్రత్యేకతలు

హిందూ పురాణాల్లో పేర్కొన్న పురాతన నిర్మాణాల ఆధారంగా ఈ ప్రాంగణం రూపుదిద్దుకుంది. పైనుంచి చూస్తే ఈ క్షేత్రం విల్లు నుంచి ఎక్కుపెట్టిన బాణం ఆకారంలో కన్పిస్తుంది. ప్రాంగణంలో 60 అడుగుల ఎత్తున హనుమంతుని విగ్రహం ఉంది. శేషపాన్పుపై పవళించే అనంతపద్మనాభ స్వామి విగ్రహం, వినాయకుడి గుడి, రామాలయం ఉన్నాయి. భక్తులకు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. హిందూ సంప్రదాయానికి సూచికగా గోశాలను కూడా ఇక్కడ కొనసాగిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారికి విలువిద్య, టీటీడీ ఆధ్వర్యంలో వేదవిద్య కూడా నేర్పిస్తున్నారు.



ఇది మా నాన్న ఆశయం..

మా నాన్నగారు నారాయణం నరసింహమూర్తి ఆశయం మేరకు రామానారాయణం ప్రాజెక్టును కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహిస్తున్నాం. ఆయన భౌతికంగా లేకపోయినా, ఆయన ఆశయం మా మధ్యనే ఉంది. ఇప్పటిదాకా 50 లక్షల మందికి పైగా.. రామానారాయణం ప్రాజెక్టును సందర్శించారు.

-నారాయణం శ్రీనివాస్, ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు

వందేళ్లుంటేనే సిగరెట్‌కు అనుమతి



చట్టరీత్యా సిగరెట్ తాగడానికి మన దేశంలో కనీస వయసు 18 ఏళ్లు. చాలావరకు దేశాల్లోనూ ఇదే నిబంధన అమల్లో ఉంది. కానీ అమెరికాలోని హవాయి రాష్ట్రంలో సిగరెట్ తాగాలంటే కనీస వయసు 21 ఏళ్లుండాలి. ఇప్పుడా నిబంధనను మార్చి కనీస వయసు వందేళ్లకు తీసుకొచ్చేలా కొత్త చట్టాన్ని తీసుకురాబోతున్నారు. వినడానికి విచిత్రంగా అనిపించినా.. ధూమపానాన్ని నిషేధించే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ఈ ప్రతిపాదన తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించిన బిల్లును అక్కడి చట్ట సభ సభ్యుడు రిచర్డ్ క్రీగన్ ప్రవేశపెట్టారు. సిగరెట్ తాగడానికి కనీస వయసు ఒకేసారి వందేళ్లకు పెంచకుండా.. వచ్చే ఏడాది 30 ఏళ్లు.. 2021లో 40 ఏళ్లు, 2024లో వందేళ్లు ఉండాలని బిల్లులో పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతోనే ఈ బిల్లును ప్రవేశపెట్టినట్లు క్రీగన్ తెలిపారు.

నా అనుమతి లేకుండా
నన్నెందుకు కన్నారు?

తల్లిదండ్రులపై దావాకు సిద్ధమైన ముంబై వ్యక్తి



"ఈ పుణ్యభూమిలో పుట్టడం మన తప్పా.. ఆవేశం ఆపుకోని అమ్మానాన్నదే తప్పా" ..అంటూ 'ఆకలి రాజ్యం' సినిమాలో కమల్‌హాసన్‌తో ఆనాడే బాలచందర్ అడిగించారు! ముంబైకి చెందిన రాఫెల్ శామ్యూల్ (27) అనే వ్యక్తి అలా అనుకొని సరిపెట్టుకోవట్లేదు. 'నా అనుమతి లేకుండా నన్నెందుకు కన్నారు?' అంటూ తల్లిదండ్రుల పైనే దావా వేయడానికి సిద్ధమయ్యాడు. ఎందుకంటే అతగాడో యాంటీ నేటలిస్టు. అనగా.. 'మానవాళి పిల్లల్ని కనడం ఆపేయాలి' అనే వాదాన్ని విశ్వసించేవాడన్న మాట. సంతానోత్పత్తి నైతికంగా తప్పన్నది యాంటీ నేటలిస్టుల వాదన. అసలు సంతానోత్పత్తే లేకుంటే ఏ గోలా ఉండదు కదా అన్నది వారి సిద్ధాంతం. ఈ కోవలోనే.. రాఫెల్‌శామ్యూల్ ఆలోచనలు సాగుతున్నాయి. కాగా, శామ్యూల్ తల్లిదండ్రులిద్దరూ న్యాయవాదులు. తమ కుమారుడి ఆలోచనల గురించి తెలుసుకున్న శామ్యూల్ తల్లి కవితా కర్నాడ్ అతడికి తగ్గట్టుగా స్పందించారు. అతణ్ని కనడానికి అతడి అనుమతి ఎలా తీసుకోవాలో చెబితే.. మా తప్పు మేం ఒప్పుకొంటాం అని ఆమె వ్యాఖ్యానించారు.




ఏడుపుగొట్టు క్లబ్!

ఒత్తిడి నుంచి ఉపశమనం కోసమే

సంతోషాన్ని పంచుకుంటే పెరుగుతుంది. బాధను మరొకరితో పంచుకుంటే తగ్గుతుంది. మనసు కుదుటపడి ఒత్తిడి దూరమవుతుంది. అందుకే.. సూరత్‌లో కొందరు ఔత్సాహికులు 'క్రయింగ్ క్లబ్'ను ఏర్పాటు చేశారు. అంటే.. ఏడ్చి భారం దించుకునే క్లబ్ అన్నమాట. సమస్యేమిటంటే.. పరిచయం లేని వారి దగ్గర సహజసిద్ధంగా ఏడుపు రాదు. అందుకే.. ఏడుపు రావడం కోసం ఒకరికొకరు తమ బాధలను పంచుకునేలా నిర్వహకులు ప్రోత్సహిస్తున్నారు. అందుకు అనుగుణంగా భావోద్వేగపూరిత సంగీతాన్ని వినిపించి మరీ ఏడిపిస్తున్నారు. రోజురోజుకూ ఈ క్రయింగ్ క్లబ్‌కు ఆదరణ పెరుగుతోంది. ప్రతినెలా చివరి ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ ఈ హెల్తీ క్రయింగ్ క్లబ్ తెరిచి ఉంటుంది. ఆ సమయంలో ఎవరైనా ఈ క్లబ్‌కు వచ్చి తమ బాధను ఇతరులతో పంచుకుని మనసారా ఏడ్వొచ్చు. కుటుంబసభ్యులు.. స్నేహితులతో చెప్పుకోలేని బాధలను ఇక్కడి సభ్యులతో చెప్పుకోవచ్చు. భారం దించుకోవచ్చు.

మాట్లాడే హక్కు మంచిదే కానీ..!



లా-లోచనం
Law lochanam



పుకార్లు షికార్లు చేయడం, గోబెల్స్ ప్రచారానికి జనం ఆకర్షితులవటం సాధారణమైపోయింది. 'వ్యక్తిగతం' అంతా పరగతమైపోయిన ఈ రోజుల్లో, రాజ్యాంగం హామీ ఇచ్చిన 'భావ ప్రకటనా స్వేచ్ఛ' దారి తప్పిందనేది చేదు నిజం. ఊహాగానాలు, వక్రీకరించిన వ్యాఖ్యానాలు ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నాయి. సమాచార సాంకేతిక విప్లవం కొని తెచ్చిన దుష్ప్రభావాల్లో సామాజిక వేదికలు గోబెల్ ప్రచార మాధ్యమాలుగా రూపుదిద్దుకోవటం విచారకరం. ఈ పర్యవసానాలపై తీవ్రంగా స్పందించిన హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు (ప్రకాష్‌చంద్ కేసు-2017) వివిధ సామాజిక మాధ్యమాలు అసత్యప్రచార వేదికలుగా మారి ప్రజల్లో అశాంతినీ, అభద్రతాభావాన్నీ కల్పించటం సహించరాదనీ, ప్రజోపయోగం పేరిట జరిగే ఇలాంటి చర్యలకు జర్నలిస్టులు పాల్పడరాదని సూచిస్తూనే.. ఆర్టికల్ 19 పరిధిలో అసత్య వార్తాప్రచారాన్ని అడ్డుకోవటం దుస్సాధ్యమవుతుందని కూడా అభిప్రాయపడింది. ఈ అధికరణం హామీ ఇచ్చిన 'భావప్రకటన' స్వేచ్ఛను ప్రజలకున్న తిరుగులేని శక్తిగా సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో అభివర్ణించింది. దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు, రక్షణకు భంగం కలిగించే అభిప్రాయాలను మాత్రమే ఈ స్వేచ్ఛ పరిధి నుండి వేరుచేయాలని కోర్టులు స్పష్టం చేశాయి. కరెన్సీ నోట్లలో జిపియస్ ట్రాకర్ ప్రభుత్వం పెట్టిందనో, వినాయకుడి విగ్రహం పాలు తాగిందనో, రాత్రుళ్లు దెయ్యం తిరుగుతోందనో జరిగే కల్పనా కథనాలను ఈ మినహాయింపుల క్రిందకు తేవటం జరగదు. అలాగే రాజకీయ లబ్ధి కోసం జరిగే ఎన్నికల్లో ఓటింగ్ యంత్రాల టాంపరింగూ, రాఫెల్ వ్యవహారంలో చీకటి కోణాలూ వంటి అభిప్రాయాలను మీడియా ముందు వెల్లడించడం కూడా భావప్రకటనా స్వేచ్ఛ నుండి వేరుచేయలేము. వీటిని రాజకీయ సున్నితత్వం కారణంగా నిషేధించటం కుదరని పని. నీలి వార్తలు సామాజిక మాధ్యమాల్లో మెరుపు వేగంతో విస్తరించి- బిడ్డల్ని అపహరించే ముఠా సభ్యుడని అనుమానంతో రాళ్ళతో యువకుడిని కొట్టి చంపిన బెంగళూరు ఉదంతం, గోవధపై వెల్లువెత్తిన వార్తలతో జరిగిన గుంపు దాడుల్లో కొందర్ని సజీవదహనం చేయడం వంటి ఘటనలపై స్పందించిన సుప్రీంకోర్టు తహసీన్ పూనావాలా కేసు (2018 జూలై)లో వ్యక్తుల్లో గుంపు మనస్తత్వాన్నీ, హింసా దృక్పథాన్నీ ప్రేరేపించే దిశలో వెలువడే అసత్య కథనాలూ, వాట్సాప్ సందేశాలపై నిరంతర నిఘా ఉండాలనీ, ఇలాంటి శక్తుల్ని ఎదుర్కోవటానికి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలనీ సూచించింది. ప్రస్తుత చట్టాలతో ఈ సూచనలను అమలు చేయటం సాధ్యం కాదు. 2017లో వాట్సాప్ సందేశాలను ఎదుర్కొనే దిశలో త్రిపుర సర్కారు కొన్ని రోజులు ఏకంగా ఇంటర్నెట్ సేవలనే నిలిపేసినా, కేంద్రం వాట్సాప్, ఫేస్‌బుక్ నిర్వాహకులకు తీవ్ర హెచ్చరికలు జారీచేసినా ఫలితాలైతే శూన్యం.

మార్చి, 2017 జెనివా సదస్సులో ఐరాస వెలువరించిన సంయుక్త ప్రకటన సమాచారం కల్పితమనో, వార్త అసత్యమనో నెపంమీద సమాచార వ్యాప్తిని అడ్డుకోవటం ప్రభుత్వాలకు తగదని, అలాంటి చర్యలు మానవహక్కుగా గుర్తింపు పొందిన భావప్రకటనా స్వేచ్ఛను హరించడమేననీ వ్యాఖ్యానించింది. రెండేళ్ల క్రితం అప్పటి దేశాధినేతపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న నీలివార్తల ప్రచారాన్ని అడ్డుకునేందుకు మారిషస్ ప్రభుత్వం చేసిన చట్టం మానవ హక్కుల అణచివేతగా అభాసుపాలైంది. అసత్య వార్తా ప్రచారాన్ని నేరంగా ప్రకటించిన ఈ చట్టం అమలు కాలేదు. వార్తల్లోని నిజానిజాలను నిగ్గుతేల్చి కాచి వడపోసేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు అధికారం కట్టబెట్టటం అభిప్రాయ వ్యక్తీకరణ స్వేచ్ఛపై సర్కారు మోపిన ఉక్కుపాదంగా హ్యూమన్ రైట్స్ వాచ్ వ్యాఖ్యానించింది. ఈ ఉదంతాల నేపథ్యంలో - పార్లమెంటు పూనుకుని భారత్‌లో మత విశ్వాసాలనూ, భద్రతాభావాల్నీ దెబ్బతీసే వార్తాప్రసారాలకు సామాజిక మాధ్యమాలు వేదికలు కాకుండా నిరోధించే సమగ్ర చట్టం వెంటనే తేవాలి. ఇలాంటి తరహా అంశాలను, వార్తలను ఆర్టికల్ 19 నిర్దేశించిన స్వేచ్ఛ నుండి మినహాయించి, అణచివేసేందుకు స్వతంత్ర యంత్రాంగాన్ని ఏర్పర్చాలి. మాట్లాడే హక్కుకు, సమాజ శ్రేయస్సుకు మధ్య స్పష్టమైన విభజన జరగాలి.



- వేదాంతం సీతారామావధాని,
భారత సుప్రీంకోర్టు మాజీ సెక్రటరీ జనరల్,
ఈ మెయిల్ : sitharam.avadhani@gmail.com

వాలంటైన్స్ కోసం..



ఈ వారం ప్రేమవారం!

'ప్రేమికుల రోజు సంగతి తెలుసు! ఈ ప్రేమికుల వారం గొడవేంటి?' అనుకుంటున్నారా? ప్రతి సంవత్సరం ఫిబ్రవరి ఏడో తేదీన మొదలై పద్నాలుగో తేదీ- అంటే వాలంటైన్స్ డే వరకూ- వాలంటైన్స్ వీక్‌గా పాటిస్తారు! ఆఖరి రోజైన వాలెంటైన్స్ డేని ప్రత్యేకంగా పరిచయం చెయ్యక్కర్లేదు. అంతకుముందు ఏడు రోజూలూ- ప్రతిపాదన మొదలుకొని చుంబనాల వరకూ... ప్రేమికులనూ, ఇష్టపడేవారినీ రోజుకో కొత్త కాన్సెప్ట్ తో దగ్గర చేసే వారం... దీని గురించి మరి కాస్త తెలుసుకుందామా!


1



రోజ్ డే

వాలంటైన్ వారంలో తొలి రోజు 'రోజ్ డే'. ఫిబ్రవరి ఏడో తేదీన దీన్ని జరుపుకొంటారు. ఇది కేవలం ప్రేమికులకు ఉద్దేశించిన రోజు కాదు. తమకు ఇష్టమైన వారికి ఈ రోజున గులాబీలు ఇస్తారు. ప్రేమికులకు ఎర్ర గులాబీలు, స్నేహితులకు పసుపు పచ్చటి గులాబీలు ఇలా... ఎర్ర గులాబీలు రొమాన్స్‌కి ప్రతీక. ఈ రోజు ఇష్టమైన వాళ్ళకు అందించే ఒక్కొక్క రంగు గులాబీ ఒక్కో భావాన్ని వ్యక్తీకరిస్తుంది.

2



ప్రపోజ్ డే

ప్రేమిస్తున్న వారికి ఆ విషయాన్ని చెప్పి, ప్రతిపాదించే రోజు. ఫిబ్రవరి ఎనిమిదో తేదీన దీన్ని పాటిస్తారు. మోకాళ్ళ మీద నిలబడి, ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రేమికులు ప్రపోజ్ చేస్తారు. ఫలితం ఎలా ఉన్నా ప్రయత్నం చెయ్యాలిగా? అలాంటి ప్రయత్నానికి ప్రత్యేకించిన రోజు ఇది.

3



చాక్లెట్ డే

పుట్టినరోజులూ, డేటింగ్ తొలినాళ్ళూ, వార్షికోత్సవాలు... ఇలా ఏ సందర్భం వచ్చినా చాక్లెట్లు ఇవ్వడం చాలా పాత ఆనవాయితీ. వాటిని ఇష్టపడనివాళ్ళు దాదాపు ఉండరు. అందుకే మూడోరోజున, అంటే ఫిబ్రవరి తొమ్మిదిన ప్రియమైన వారికి చాక్లెట్లు అందిస్తారు. ఎన్నో ఆకారాల్లో, రకరకాల రుచులతో నోరూరించే చాక్లెట్ల కన్నా మంచి బహుమతి ఏముంటుంది? 'ప్రపోజ్ డే' నాడు గుర్తుకురాని, చెప్పడానికి వీలుకాని భావాల్ని వెల్లడించడానికి ఇది మరో ఛాన్స్!

4



టెడ్డీ డే

నాలుగో రోజు (పదవ తేదీ) 'టెడ్డీ డే'. ముందురోజు చాక్లెట్స్ ఇచ్చేశాక, అంతకన్నా ఆకర్షించేది క్యూట్‌గా ఉండే 'టెడ్డీ బేర్' కదా! అవతలివాళ్ళ పట్ల మన ఇష్టాన్ని స్పష్టంగా వ్యక్తపరిచే గిఫ్టుల్లో టెడ్డీబేర్ కూడా ఒకటి. 'టెడ్డీ బేర్ ఇచ్చి చూడండి! మీరు అభిమానించే వాళ్ళ ముఖం ఆనందంతో వెలిగిపోవడం ఖాయం!' అంటున్నారు అనుభవజ్ఞులు.

5



ప్రామిస్ డే

మీరు ఇష్టపడే వారికి అర్థవంతమైన ప్రామిస్‌లు చెయ్యండి. పరస్పర ప్రమాణాలు చేసుకొని, వాటి మీద నిలబడండి. కష్టమైనా ఫరవాలేదు, ఇష్టంగా మార్చుకోండి. ఒక అనుబంధంలో ప్రామిస్ అనేది అత్యుత్తమైన, అతి మధురమైన భావం. నమ్మకాన్ని పెంచేదీ, వ్యక్తిత్వం గురించి చెప్పేదీ అదే. అవతలి వ్యక్తులు తమకు ఉన్నారన్న ధీమాను ఇది కలిగిస్తుంది. అయిదోరోజైన పదకొండో తేదీ 'ప్రామిస్ డే' ఉద్దేశం అదే.

6



హగ్ డే

బంధం ఏదైనా కొన్ని సందర్భాల్లో మాటల కన్నా కౌగిలింత ఎక్కువ భావాన్ని వ్యక్తం చెయ్యగలదు. సాన్నిహిత్యాన్ని వెల్లడించగలదు. తల్లితండ్రులు, స్నేహితులు, సోదరులు, పిల్లలు, మీకు ప్రియమైన వ్యక్తులు... ఇలా ఎవరైనా సరే... అక్కున చేర్చుకున్నప్పుడు ఎలాంటి పరిస్థితి ఎదురైనా తమకు వాళ్ళున్నారనే భరోసా ఏర్పడుతుంది. వాలంటైన్ వారంలోని ఆరో రోజైన పన్నెండో తేదీని 'హగ్ డే'గా జరుపుకొంటారు.

7



కిస్ డే

ప్రేమ వారంలో ఏడో రోజు, వాలెంటైన్ డే ముందు రోజు అయిన ఫిబ్రవరి పదమూడు 'కిస్ డే'. ముద్దు ప్రేమకి, ఆప్యాయతకు, గౌరవానికి చిహ్నం. ఈ రోజున జంటలు పరస్పరం చుంబించుకొని తమ ప్రేమను వ్యక్తీకరించుకుంటాయి. ప్రేమకి తియ్యటి వ్యక్తీకరణ ముద్దే మరి! అదే ఈ రోజును కలకాలం గుర్తుండిపోయేలా చేస్తుంది. మర్నాడు 'వాలెంటైన్స్ డే'తో బంధం మరింత గట్టిపడడానికి దోహదపడుతుంది.



చిత్తశుద్ధితో శ్రమించా...!

స్నేహితురాలిచ్చిన ఒక ఆలోచన నిర్మల్ దివాకర్ దశ తిప్పింది. బిజినెస్ బాట పట్టేలా ఆమెని పురిగొల్పింది. సాంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిన నిర్మల్ భర్త ప్రోత్సాహంతో సాధికార మహిళగా నిలిచింది. ఇంకా ఆసక్తికర విషయం ఏమిటంటే చేతిలో నయాపైసా లేకుండా కేవలం కేటలాగు చూపించి ఆర్డర్లు సంపాదించి బట్టల వ్యాపారానికి తెరతీసింది. 'హారిక కలెక్షన్స్' ప్రారంభించి తన కాళ్ల మీద తాను నిలబడింది. నిర్మల్ సక్సెస్‌స్టోరీ ఆమె మాటల్లోనే...

మాది మహారాష్ట్రలోని ఔరంగాబాద్. నాన్న, అమ్మ ఊరిలో చాట్ వ్యాపారం చేస్తారు. మేము ముగ్గురం ఆడపిల్లలం. మాది మార్వాడీ కుటుంబం. మా కుటుంబాల్లో ఆడవాళ్లు ఇంటి బయటకు వెళ్లి పనిచేయడాన్ని అంగీకరించరు. పదవతరగతితో చదువు ఆపేశా. ఆ తర్వాత నాకు పెళ్లిచేశారు. పెళ్లి తర్వాత 2001లో హైదరాబాద్‌కు వచ్చాం. నా భర్త రూపేష్ దివాకర్ అప్పట్లో ఫార్మా కంపెనీలో పనిచేసేవారు. మొదట నా జీవితం గృహిణిగానే మొదలైంది.

మార్కెట్లో... స్నేహితురాలి మాటలతో...

ఒకరోజు ఇంటికి దగ్గరలో ఉన్న ఒక మార్కెట్‌కి వెళ్లాను. అక్కడ దుర్గ అనే మహిళతో పరిచయమైంది. ఆ తర్వాత ఇద్దరం స్నేహితులమైపోయాం. ఆమే మొట్టమొదటసారిగా నాలో బిజినెస్ చేయాలనే ఆలోచనను రేకెత్తించింది. చిన్నతనం నుంచీ నాకు వ్యాపారం చేయాలన్న ఉద్దేశం ఏమీ ఉండేది కాదు. కానీ ఎందుకో తెలియదు దుర్గ మాటలు నాపై ప్రభావాన్ని చూపాయి. తర్వాత 'ఒరీఫ్లేమ్'లో పనిచేశా. మొదట్లో నేను ఇలా బయటకు వెళ్లి పనిచేస్తున్నానన్న విషయం మా అత్తగారు, అమ్మవాళ్లకు తెలియదు. ఇంటి బాధ్యతలు పూర్తిగా మావారు చూసుకునేవారు. వ్యాపారం చేయాలన్న నా కోరికను ఆయన గుర్తించారు. ఈ విషయంలో నా భర్త నన్నెంతగానో ప్రోత్సాహించారు.

చేతిలో పైసా లేకుండా...

'ఒరీఫ్లేమ్'లో పనిచేసేటప్పుడే నాకు ఒక ఆలోచన వచ్చింది. చేతిలో చిల్లిగవ్వ లేకుండా కేవలం కేటలాగ్ పెట్టుకుని బిజినెస్ చేయొచ్చు కదా అనిపించింది. అలా ఇండోర్ (మధ్యప్రదేశ్)లోని 'శృతి సెల్వార్స్, షరోన్ దుస్తుల' కేటలాగ్‌ను పట్టుకుని ఇంటింటికీ తిరిగి బట్టల బిజినెస్ చేయాలనుకున్నా. ఆర్డర్లు బుక్ చేసి, వాటిని తెప్పించుకుని కస్టమర్లకు అందించేదాన్ని. కేటలాగ్‌లోని వెరైటీ దుస్తులు కస్టమర్లకు చూపించి ఆర్డర్లు సంపాదించడం, వారి నమ్మకాన్ని చూరగొనడంలో సక్సెస్ అయ్యాను. అలా వ్యాపారం మెల్లగా పట్టాలెక్కింది. వ్యాపారంలో భాగంగా బాగా తిరగాల్సి వచ్చేది. అప్పట్లోనే నాకు బండి నడపడం వచ్చినా దానికి పెట్రోల్ ఖర్చులు భరించే స్థోమత మాకు లేదు. అందుకే జంటనగరాల్లోని ముఖ్య ప్రాంతాలకు నడుచుకుంటూ వెళ్లి కేటలాగ్‌లోని డ్రస్‌లు, దుస్తుల డిజైన్లు, ఫ్యాబ్రిక్‌ను చాలామందికి చూపించి ఆర్డర్లను సంపాదించేదాన్ని. అప్పట్లో నా పిల్లలు చాలా చిన్నవాళ్లు. వాళ్ల ఆలనాపాలనా చూసుకునే వాళ్లెవ్వరూ లేరు. ఒకవైపు వారిని చూసుకుంటూనే మరోవైపు బట్టల బిజినెస్ చేసేదాన్ని. వ్యాపార లావాదేవీలన్నీ ఫోను (అప్పట్లో ల్యాండ్ ఫోనే) మీదే చేసేదాన్ని. బ్యాంకు ద్వారా ఉత్పత్తిదారులకు చెల్లింపులు చేసేదాన్ని.

> **చేతిలో చిల్లిగవ్వ లేకుండా కేవలం కేటలాగ్ పెట్టుకుని బిజినెస్ చేయొచ్చు కదా అనిపించింది. కేటలాగ్‌ను పట్టుకుని ఇంటింటికీ తిరిగి ఆర్డర్లు బుక్ చేసి, వాటిని తెప్పించుకుని కస్టమర్లకు అందించే దాన్ని. కేటలాగ్‌లోని వెరైటీ దుస్తులు కస్టమర్లకు చూపించి ఆర్డర్లు సంపాదించడం, వారి నమ్మకాన్ని చూరగొనడంలో సక్సెస్ అయ్యాను.**



అంతా కొత్తే అయినా...

తొలుత నా వ్యాపార కార్యకలాపాలన్నీ ఇంటి నుంచే నిర్వహించేదాన్ని. తర్వాత చిన్న షెడ్ లాంటిది వేసి, సెకండ్ హాండ్ ఫర్నీచర్ తెచ్చి షాప్‌లా తయారుచేశాను. ఆ విధంగా బట్టల వ్యాపారాన్ని 2008 సంవత్సరంలో ప్రారంభించి మెల్లగా ఒక్కొక్క మెట్టు ఎక్కాను. కేటలాగ్ చూపిస్తూ సంపాదించిన దుస్తుల ఆర్డర్లను ఇండోర్‌లో ఉన్న శృతి సెల్వార్స్ బ్రాండ్‌కు పంపేదాన్ని. ఈ వ్యాపారంలో నా తొలి పెట్టుబడి 700 రూపాయలు. బిజినెస్ సులభంగా చేసుకోవడానికి ఇప్పటిలా అప్పుడు కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ సౌకర్యాలు, మొబైల్స్ ఉండేవి కావు. దీనికి తోడు 'ఆడవాళ్లు వ్యాపారం చేయడం ఏమిటి' అనే బంధుగణమే ఎక్కువ ఉండేది. అలాంటి అడ్డంకులన్నీ దాటుకుని నాలాంటి మహిళలు బిజినెస్‌లో సక్సెస్ కావడం అంటే మాటలుకాదు.

బట్టల వ్యాపారం కోసం డబ్బు సహాయం చేయమని అమ్మానాన్నలను అడగడం ఇష్టముండేది కాదు. 'ఒరీఫ్లేమ్'లో (టప్పర్‌వేర్ నెట్‌వర్క్) పని చేసేటప్పుడు నెలకు నాలుగైదు వేల రూపాయలు సంపాదించేదాన్ని. వాటిని దాచుకుని, మావారు చేసిన కొంత ఆర్థిక సాయం మొత్తం కలిపి 50 వేల రూపాయలు బిజినెస్‌లో పెట్టుబడిగా పెట్టా. అయితే నేను దుస్తుల వ్యాపారం చేస్తున్న విషయం మొదట్లో మా అమ్మకుగాని, అత్తగారికిగాని చెప్పలేదు. తర్వాత అమ్మానాన్నలకు మెల్లగా విషయం చెప్పా. దాంతో వారు భయపడ్డారు. నాకు వ్యాపారం గురించి తెలియదు. 'నష్టపోతే కష్టం కదా' అని ఆందోళన చెందారు. అయినా వెరవకుండా నేను పట్టుదలతో ముందుకు సాగాను.

డిజైనర్ కావాలని ఉన్నా...

మా దగ్గర రకరకాల ఫ్యాబ్రిక్స్, డ్రెస్సులు, పార్టీవేర్, లెగ్గింగ్స్, లినెన్, రెడీమేడ్ కుర్తీలు, లోదుస్తులు, చున్నీలు అన్నీ దొరుకుతాయి. అలాగే బయటనుంచి కస్టమర్ల కోసం మేం తెప్పించే శృతి బ్రాండ్ దుస్తులకు అవసరమైన ఆల్టర్నేషన్లను సైతం చేసి ఇస్తాం. ప్రధానంగా రాజస్తాన్, ముంబయి, సూరత్, అహ్మదాబాద్‌ల నుంచి మన్నికైన మెటీరియల్‌ను, దుస్తులను తెప్పిస్తాం. కలంకారీ, చెందేరి, కాటన్, సిల్కు, జూట్, రియాండ్ వంటి ఫ్యాబ్రిక్‌లూ మా దగ్గర ఉన్నాయి. ఆ ఫ్యాబ్రిక్‌ను కూడా వాటికి బాగా పేరున్న ప్రాంతాల నుంచి మాత్రమే తెప్పిస్తాం. షాపు పూర్తిగా ఆడవాళ్లకు ఉద్దేశించింది. మారుతున్న ఫ్యాషన్స్, ట్రెండ్స్ వంటి విషయాలను గమనించుకుంటూ దుస్తులు, డ్రస్సులు, ఫ్యాబ్రిక్‌ని అందుబాటులోకి తెస్తాం.

నాకు కుట్టడం కూడా వచ్చు. కానీ, పూర్తిగా ఫ్యాషన్ ట్రెండ్స్‌తో కూడిన దుస్తులను బిజినెస్‌లో ప్రవేశపెట్టాలంటే అది చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఎందుకంటే ఫ్యాషన్స్‌లో వాడే ఫ్యాబ్రిక్, పేట్రన్స్, డిజైనింగ్‌లు, దానికి కావాల్సిన మౌలికవసతులు అన్నీ ఖర్చుతో కూడుకున్నవి. అయితే, కొందరు కస్టమర్లు ఖరీదైన ఫ్యాబ్రిక్ తెచ్చుకుని తమకు కావాల్సిన రీతిలో డిజైనింగ్ వేర్ కుట్టమని మమ్మల్ని అడుగుతుంటారు. 50 వేల రూపాయలతో ప్రారంభించి ఈ బిజినెస్‌ను ప్రస్తుతం ఆరు లక్షల రూపాయలకు మించి టర్నోవర్‌కి తీసుకువచ్చా. వచ్చిన ఆదాయాన్నే రొటేట్ చేస్తూ దశల వారీగా వ్యాపారాన్ని పెంచుకుంటూ పోతున్నా. భవిష్యత్తులో లెగ్గింగ్స్‌పై ఎక్స్‌క్లూజివ్‌గా దృష్టి పెట్టాలనుకుంటున్నా. పూర్తిస్థాయిలో లెగ్గింగ్స్ స్పెషాలిటీ షాపును భవిష్యత్తులో వృద్ధి చేయాలనేది నా ప్రణాళిక.

స్నేహితుల అండదండలు..

ఇప్పుడు నేనిలా అభివృద్ధి చెందానంటే నా స్నేహితులు అందించిన తోడ్పాటు, సలహాలు ప్రధాన కారణం. వారు నాకు ఆర్డర్స్ వచ్చేలా సహాయపడ్డారు. దాంతోపాటు మౌత్ పబ్లిసిటీ కూడా నా బిజినెస్ వృద్ధి చెందడానికి మరో కారణం. కస్టమర్లకు మా మీద, మా సేవల మీద విశ్వాసం, నమ్మకం పెరిగి చక్కటి సంబంధాలు కొనసాగుతున్నాయి. ఇపుడు నా ముందు రెండే లక్ష్యాలున్నాయి. ఒకటి నేను స్వంత ఇల్లు కట్టుకోవడం...రెండోది నా ఇద్దరు ఆడపిల్లల్ని బాగా చదివించుకోవాలి.

• **నాగసుందరి**

ఫోటోలు: **అశోకుడు**

న్యూస్‌మేకర్

అప్పట్లో మహాత్ముడిపై నాథూరామ్ గాడ్సే తూటా పేల్చితే... గాడ్సే అభిమాని అయిన 38 ఏళ్ల పూజా షకున్ పాండే మళ్లీ ఆ సీన్‌ను పునఃసృష్టించారు. అంతా ఉత్తిదే కావచ్చు. కానీ దేశాన్ని కుదిపేసింది. కాంట్రవర్సీగా మారిన ఆ వ్యక్తి ఓ మహిళ కావడం ఈ ఘటనపై మరింత ఆసక్తి రేకెత్తించింది. ఇంతకీ ఎవరీ పూజా షకున్ పాండే?

వివాదం.. ఆమె ఇంటి పేరు!



పుట్టింది ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లో. తల్లితండ్రుల గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. అయితే అలీఘడ్ హిందూ మహాసభ జాతీయ సెక్రటరీగా ప్రపంచానికి పరిచయమయ్యారు పూజా. ముఖ్యంగా అక్కడి హిందూ మహాసభ నెలకొల్పిన మహిళా జడ్జిగా ఒక్కసారిగా వార్తల్లోకి ఎక్కారు. మీరట్‌లోని సీసీఎస్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ పూర్తి చేశారు షకున్. కొంతకాలం పాటు లెక్కల ప్రొఫెసర్‌గా పనిచేసిన షకున్ అనంతరం పీహెచ్‌డీ పట్టా పొందారు. భర్త పేరు అశోక్. ఆరెస్సెస్ నాయకులైన నాథూరామ్ గాడ్సే (మహాత్మాగాంధీ హంతకుడు), వీరసావర్కర్‌లకు వీర భక్తురాలు. నాథూరామ్ లానే హిందూ మహాసభలో సభ్యురాలిగా చేరిన ఆమె, కొంతకాలానికి ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఇద్దరు పిల్లలున్న షకున్ 2012లో సన్యాసం పుచ్చుకున్నారు. అలా పూర్తిస్థాయిలో తన జీవితాన్ని హిందూ మహాసభకే అంకితం చేశారు. భర్త అశోక్‌తో కలిసి హిందూ మహాసభ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు.


నాథూరామ్ ఆమె హీరో!

గాంధీ అంటే ఎందుకంత కోపం అని ప్రశ్నిస్తే, "ఆయన వల్లే ఆనాడు దేశ విభజన జరిగింది. ఆ సమయంలో జరిగిన మారణకాండలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. నాథూరామ్ గాడ్సే కన్నా ముందే పుట్టి ఉంటే గాంధీని నేనే చంపేదాన్ని. ఇక నుంచి ప్రతి ఏటా గాంధీ వర్ధంతి రోజున ఇలాగే చేస్తాను. గాడ్సే నా దృష్టిలో హీరో" అంటారు పూజ. వీలు చిక్కినప్పుడల్లా గాడ్సే గొప్పదనాన్ని చాటింపు వేస్తూ సభలు కూడా నిర్వహించడం ఆమెకు అలవాటే. కరెన్సీ నోట్లపై గాంధీ ఫొటోలు ఎందుకంటూ ప్రశ్నిస్తారు. అసలు స్వాతంత్రోద్యమంలో గాంధీ పాత్ర ఎంతుందో బయటపెట్టడానికి ఆర్టీఐ దరఖాస్తు కూడా చేశానన్నారామె.

తాజ్‌మహల్, కుతుబ్‌మినార్ లాంటి చారిత్రక కట్టడాలను హిందూ ఆలయాలుగా మార్చాలన్న డిమాండ్‌ను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ముందుంచారు. ఇవన్నీ చాలదన్నట్లు ఈ తాజా వివాదం అక్కడి హిందూ మహాసభ వారికి తలనొప్పిగా మారింది. దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఆమె మీద వీళ్లే పోలీసు ఫిర్యాదు ఇచ్చారు. ఎట్టకేలకు పూజాను, ఆమె భర్త అశోక్‌ను అరెస్ట్ చేశారు పోలీసులు.

ఫ్యామిలీ కౌన్సెలింగ్

ఏం చేయాలో తెలియడం లేదు...



నేను తొమ్మిదేళ్లుగా మా బంధువుల అబ్బాయిని ప్రేమిస్తున్నాను. కానీ అతను ఉద్యోగం కోసం ఇంకో ఊరు వెళ్లి వేరే అమ్మాయితో సంబంధం పెట్టుకున్నాడు. అప్పుడు చాలా ఏడ్చాను. మళ్లీ కొన్నాళ్లకు వచ్చాడు. అప్పుడు ఎవరికీ తెలియకుండా ఇద్దరం గుళ్లో పెళ్లి చేసుకున్నాం. తిరిగి అతను ఉద్యోగానికి వెళ్లిపోయాడు. మళ్లీ ఆ అమ్మాయి అతడితో సంబంధం కొనసాగిస్తుంది. దాంతో నేను మా వాళ్లు చెప్పిన మరో అబ్బాయిని పెళ్లి చేసుకున్నా. కానీ అతను మంచివాడు కాదు. దాంతో విడాకులు తీసుకుని ఇంట్లోనే ఉన్నా. ఈ మధ్య నా పాత ప్రేమికుడు మళ్లీ మాట్లాడుతున్నాడు. తనకు నేనంటేనే ఇష్టమని, ఆ అమ్మాయి బెదిరింపుల వల్ల కలిసి ఉన్నానని అంటున్నాడు. వాళ్లిద్దరికీ పెళ్లి కాలేదు. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియడం లేదు.


- స్వాతి

బంధువుల అబ్బాయే అంటున్నారు. అలాంటప్పుడు ముందే ఇంట్లో చెప్తే వాళ్లే పెళ్లి చేసేవారుగా. పోనీ గుళ్లో పెళ్లి చేసుకున్నప్పుడైనా చెప్పలేదు. మాటిమాటికీ మోసపోవడం, అతను కనిపించగానే కరిగిపోవడం... అతనికీ ఇదే బాగున్నట్టుంది. అక్కడ ఆమెతో, ఇక్కడ మీతో సంబంధం సాగిస్తున్నాడు. అతను చెప్పిన ప్రతిమాటా నమ్మడం మీ తప్పు. నిజంగా మీ ప్రేమపైన నమ్మకం ఉంటే ఇప్పటికైనా పెద్దవాళ్లకి చెప్పండి. వాళ్లే మిగిలిన విషయాలు చూసుకుంటారు. మీరు ప్రేమించిన అతను ఇందుకు సిద్ధమో కాదో తెలుసుకోండి మరి. అయితే ఒక మాట. అతను కాదన్నా జీవితం ఆగిపోదు. అది గుర్తుంచుకుని ముందుకు అడుగేయండి.

- కె.శోభ
ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com

అబ్బురపరిచే శిల్ప సౌందర్యం ఒక వైపు....
సంభ్రమంలో ముంచే నృత్య విన్యాసాలు మరో వైపు...
సమ్మోహనపరిచే సంగీత సౌరభాలు ఇంకో వైపు...
ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా సైతం గుర్తింపు పొందిన ఈ ప్రదేశాలు...
మన కళా వైభవాన్ని... ఈనెలలో... మరోసారి చాటి చెప్పేందుకు సిద్ధమవుతున్నాయి...







హెరిటేజ్ టూరిజం

కళలు కదం తొక్కే చోట!

కోణార్క్ సంగీత, నృత్యోత్సవం

కళింగ శిల్ప శైలికి నిలువెత్తు నిదర్శనం కోణార్క్ సూర్య దేవాలయం. పేరుకు ఆలయమే అయినా ఇక్కడ నిత్య పూజలేవీ జరగవు. ఆలయంలో మూల విరాట్ ఎవరూ ఉండరు. ఏటా రథసప్తమి రోజున మాత్రం ఉత్సవాలు జరుగుతాయి. నెలల సంఖ్యను గుర్తు చేస్తూ పన్నెండు జతల చక్రాలతో ఉండే సూర్య రథాన్ని... వారంలో రోజుల సంఖ్యకు ప్రతీకగా ఏడు గుర్రాలు లాగుతూ ఉంటాయి. రథ చక్రాలమీద పడే సూర్య కిరణాల ఆధారంగా సమయాన్ని తెలుసుకోవచ్చు. ఏటా ఇక్కడ నిర్వహించే కోణార్క్ సంగీత, నృత్యోత్సవం లలిత కళలకు సమున్నత నీరాజనం.

ఎప్పుడు?: ఫిబ్రవరి 19 నుంచి 21 వరకూ

ఎక్కడ?: ఒడిశాలోని కోణార్క్‌లో

ఎలా వెళ్ళాలి?: తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాంతాల నుంచి ఒడిశాలోని భువనేశ్వర్, పూరి నగరాలకు నేరుగా రైలు సౌకర్యం ఉంది. పూరీకి సుమారు 36 కి.మీ., భువనేశ్వర్‌కు 62 కి.మీ. దూరంలో ఉన్న కోణార్క్‌కు రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు. సమీప విమానాశ్రయం భువనేశ్వర్‌లో ఉంది.

ఇవీ విశేషాలు: సంగీత, నృత్య కళాకారులు వారి ప్రతిభను ప్రదర్శించడానికి ఒక సమున్నతమైన వేదికను అందించాలనే తపనతో కోణార్క్ నాట్య మండపానికి ఒడిస్సీ నర్తకుడు, బోధకుడు పద్మశ్రీ డాక్టర్ గురు గంగాధర్ ప్రధాన్ 1986లో అంకురార్పణ చేశారు. కోణార్క్ సంగీత, నృత్యోత్సవాలకు శ్రీకారం చుట్టారు. విశ్వవిఖ్యాతులైన ఎందరో నాట్య, సంగీత దిగ్గజాలు ఇక్కడ తమ వైదుష్యాన్ని ప్రదర్శించి, మన్ననలు అందుకున్నారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి విదేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో కళాభిమానులు తరలివస్తారు. కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఒడిస్సీ, మోహినీఆట్టం, మణిపురి లాంటి శాస్త్రీయ నృత్యాలతోపాటు జానపద, గిరిజన నృత్య సంగీత ప్రదర్శనలు దీనిలో చోటు చేసుకుంటాయి. సముద్రతీరంలో, జీడి, సరుగుడు తోటల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమాలను తిలకించడం ఒక గొప్ప అనుభవం.



తాజ్ మహోత్సవ్


అపురూపమైన ప్రేమకు చిహ్నంగా నిలిచిన తాజ్‌మహల్ అత్యద్భుతమైన కట్టడం. ప్రధానంగా పర్షియన్, మొఘల్ నిర్మాణ శైలులతో నిర్మితమైన కళాఖండం. అందుకే ప్రపంచంలోని ఏడు వింతల్లో ఇది స్థానం సంపాదించుకుంది. తాజ్‌మహల్ ముంగిట ప్రతి సంవత్సరం నిర్వహించే తాజ్ మహోత్సవ్ వివిధ కళా రీతుల సమాహారమే కాదు, మంచి వినోదానికీ, చక్కటి రుచులకూ చిరునామా కూడా!

ఎప్పుడు?: ఫిబ్రవరి 18 నుంచి 27 వరకూ

ఎక్కడ?: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాలోని శిల్పగ్రామ్‌లో

ఎలా వెళ్ళాలి?: తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన ప్రాంతాల నుంచి ఆగ్రాకు నేరుగా రైళ్ళు ఉన్నాయి. ఆగ్రాలో విమానాశ్రయం ఉంది. ఢిల్లీ (233 కి.మీ.), జైపూర్ (238 కి.మీ.) నగరాల వరకూ విమానాల్లో వెళ్ళి, అక్కడి నుంచి రోడ్డు, రైలు మార్గాల్లో కూడా ఆగ్రా చేరుకోవచ్చు.

ఇవీ విశేషాలు: దేశ, విదేశీ పర్యాటకులు ఎంతగానో ఎదురుచూసే ఉత్సవాల్లో తాజ్ మహోత్సవ్ మొదటి స్థానంలో ఉంటుంది. 1982లో ఇవి ప్రారంభమయ్యాయి. సంగీత, నృత్య కార్యక్రమాలు ఒక ఎత్తయితే, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వస్తువుల ప్రదర్శన మరో ఎత్తు. ఈశాన్య రాష్ట్రాల నుంచి వెదురు ఉత్పత్తులూ, దక్షిణ భారతం, కశ్మీర్‌ల నుంచి కాగితపు గుజ్జు కళాకృతులు, ఆగ్రాకు చెందిన పాలరాయి, జర్దోజీ ఎంబ్రాయిడరీ ఉత్పత్తులు, బనారస్ సిల్క్, జరీ వస్త్రాలు, కాశ్మీర్, గుజరాత్ శాలువలూ, కార్పెట్లూ... ఒకటే మిటి... భారతీయ హస్త కళా వైభవం ఇక్కడ కళ్ళకు కడుతుంది. విఖ్యాత కళాకారుల జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలూ, సంగీత కార్యక్రమాలూ ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి. పిల్లలను ఆకర్షించే వినోద కార్యక్రమాలూ, నోరూరించే వివిధ రుచులతో ఆహ్వానించే స్టాల్స్ సరే సరి!



ఖజురహో నృత్యోత్సవం


శృంగార శిల్పాలకు కేరాఫ్ అడ్రస్ ఏదంటే 'ఖజురహో' అనే సమాధానం ఠక్కున వచ్చేస్తుంది. సుమారు వెయ్యేళ్ళ క్రితం చెక్కిన ఈ శిల్పాలు ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి చెందడానికి కారణం కేవలం శృంగారం మాత్రమే కాదు, వాటిని చెక్కిన శిల్పుల నైపుణ్యం కూడా. పేరు తెలియని ఆ శిల్పుల పనితనానికీ, సరిసాటిలేని శిల్ప వైభవానికీ జోహారులు అర్పించడానికి రూపుదిద్దుకున్న వేడుక ఖజురహో నృత్యోత్సవం.

ఎప్పుడు?: ఫిబ్రవరి 20 నుంచి 26 వరకూ

ఎక్కడ?: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఖజురహోలో

ఎలా వెళ్ళాలి?: తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాంతాల నుంచి సత్నా, ఝాన్సీ జంక్షన్లకు నేరుగా రైళ్ళు ఉన్నాయి. అక్కడి సత్నాకు 113 కి.మీ., ఝాన్సీకి 175 కి.మీ. దూరంలో ఖజురహో ఉంది. ఆ నగరాల నుంచి రోడ్డు, రైలు మార్గాల్లో చేరుకోవచ్చు. ఖజురహోలో విమానాశ్రయం ఉంది. అన్నట్టు ఆగ్రా నుంచి 420 కి.మీ. దూరంలో ఖజురహో ఉంది. వీలుంటే ఒకే ట్రిప్పులో రెండూ చూడవచ్చు.

ఇవీ విశేషాలు: భారత సంప్రదాయ నృత్య, సంగీతాల ఘనతను ప్రపంచానికి చాటి చెప్పడం ప్రధాన ధ్యేయంగా మధ్యప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని కళా పరిషత్ సంస్థ ఈ ఉత్సవాలకు 45 ఏళ్ళ కిందట శ్రీకారం చుట్టింది. ఖజురహోలో ప్రసిద్ధి చెందిన చిత్రగుప్త, విశ్వనాథ ఆలయాల ముందు- ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలు వీటికి వేదికలు. దేశంలోని అత్యుత్తమ నృత్యరీతులన్నీ ఈ వేదికల మీద ప్రదర్శితమవుతాయి. సుప్రసిద్ధ, వర్ధమాన నర్తకులు ఉత్సాహంగా వీటిలో పాల్గొంటారు. విదేశాల నుంచి కూడా నృత్య కళాకారులు తరలి వస్తారు. తమ నాట్య విన్యాసాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తారు. ఇక స్థానిక హస్త కళాకారులు రూపొందించిన వస్తువులతో ప్రదర్శనలు కూడా ఉంటాయి.



స్టార్ వెకేషన్

ఆ కోరిక తీరుతుందో లేదో?

హన్సిక వయసు 27 ఏళ్లు... సినిమాలకు వచ్చి 19 ఏళ్లు పూర్తయింది. బాలనటిగా వెండితెరపై అడుగుపెట్టిన ఈ బాలీవుడ్ బ్యూటీ బికినీ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయడంతో షాక్ అయ్యారు. అంతే కాదు తన తాజా చిత్రం 'మహా'కు సంబంధించిన వివాదాస్పద పోస్టర్లతో తమిళనాట బోల్డంత చర్చను రేపారు. హన్సికకు టూర్లకు వెళ్లడమంటే చాలా ఇష్టం. తనకు మనసైన గమ్యాలేంటో ఆమె మాటల్లోనే!

నాకు ప్రయాణలంటే చాలా ఇష్టం. ప్రపంచాన్నంతా చూసేయాలన్నది నా కోరిక. తీరుతుందో లేదో! అందుకే షూటింగ్స్‌కు బ్రేక్ వచ్చినప్పుడల్లా నాకు ఇష్టమైన ప్రదేశాలను చుట్టేస్తాను. ఇప్పటికే చిత్రీకరణ కోసం చాలా దేశాలకు వెళ్లాను. ఆ ప్రాంతాల వ్యక్తులతో మమేకం కావడాన్ని ఎంతో ఇష్టపడతాను. అంతేకాదు ఫోటోలూ తప్పనిసరి. నా జ్ఞాపకాలను ఎప్పటికీ పదిలంగా ఉంచుకోవాలనుకుంటాను. నా అదృష్టం ఏమిటంటే, చాలా తక్కువ సమయంలో అమెరికాతో పాటు పలు ఐరోపా దేశాలను చూశాను. ఈ ప్రయాణ అనుభవాలు నన్ను మరింత రాటుదేల్చాయని చెప్పవచ్చు.

మర్చిపోలేని ట్రిప్ అది!

కొన్నేళ్ల క్రితం నా పుట్టినరోజు వస్తుందనగా నా ఫ్రెండ్స్‌తో కలిసి పెద్ద ట్రిప్ వేశాను. దాన్ని నా జీవితంలో మర్చిపోలేను. బార్సిలోనా, స్పెయిన్, మ్యాడ్రిడ్ నగరాలను చూశాను. మొదటి ఆగింది నెదర్‌ల్యాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డ్యామ్‌లో! ఆ తర్వాత బార్సిలోనా, స్పెయిన్‌లకు వెళ్లాను. స్పెయిన్‌లో నాకు బాగా నచ్చిన ప్రాంతం ఇబిజా. పార్టీలకు కేరాఫ్ అడ్రస్! ఇక చివర్లో ప్యారిస్ చూశాను. ఆ నగరం అందాల గురించి కొత్తగా చెప్పడానికేముంటుంది! మనలోని నిజమైన వ్యక్తిని మేలుకొలిపేవి ఇలాంటి పర్యటనలే. చాలా సార్లు కొన్ని విషయాలను ఊహాతీతంగా ఆలోచిస్తాం. కానీ వాస్తవంలోకి వెళితే, అసలు మనవి ఒట్టి భ్రమలని తేలిపోతాయి. అందుకు కొన్ని సార్లు ఇలాంటి ప్రయాణాలు మన ఆలోచనలను సరైన దారిలో నడిపిస్తాయని నా అభిప్రాయం. ప్రపంచంలో చూడాల్సినవి ఎన్నో ఉన్నాయి. వాటిని చూసే అవకాశం కలుగుతుందో లేదో!?





ఈ-జీ ట్రావెల్

'క్లూ' ఇచ్చేస్తుంది!

మీరు ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్లినప్పుడు అక్కడ ఉన్న వింతలూ, విశేషాలు ఏమిటో తెలుసుకోవాలనుకుంటారు. టూర్‌కు బయలుదేరే సమయానికి ఏది అందుబాటులో ఉందో తెలిస్తే... మీ సమయం, డబ్బు రెండూ వృథా కావు. దీని కోసం మీ ఫోన్‌లో 'క్లూక్' యాప్ ఉండాల్సిందే. ఉదాహరణకు మీరు హైదరాబాద్‌లోని రామోజీఫిలింసిటీ, సాలార్‌జంగ్ మ్యూజియంలను చూడాలనుకుంటే ఈ యాప్‌నుంచే నేరుగా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. 'పర్యాటక స్థలాలు, ప్రత్యేక షోలు, బెస్ట్ ఫుడ్స్ అండ్ మస్ట్ ఈట్స్'... ఇలా విభాగాల వారీగా ప్రాంతాలను ఈ యాప్‌లో విభజించారు. అంతేకాదు, అసలు మీరు టూర్‌కు వెళ్లే సమయానికి ఫలానా ప్రదేశంలో ప్రవేశం ఉంటుందో లేదో కూడా ఇది చెప్పేస్తుంది. విదేశాలకు వెళ్లినప్పుడు కూడా అక్కడి టికెట్లను మన కరెన్సీలోనే బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తుంది. సరసమైన ధరలకు హోటల్ గదులను కూడా పొందవచ్చు. గూగుల్, ఐఓఎస్ వినియోగదారులకు ఈ యాప్ అందుబాటులో ఉంది.



డైలీ సుడోకు - 445

	6	2	3		7			
3		5		9				
			6					
	7	9					3	5
	2		7		4		9	
5	4					2	8	
					3			
				6		7		1
			5		9	8	6	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 444 సమాధానం

3	8	1	7	2	5	4	9	6
7	9	5	4	1	6	2	3	8
2	6	4	9	3	8	1	7	5
4	2	8	3	5	9	7	6	1
5	7	3	2	6	1	8	4	9
6	1	9	8	4	7	5	2	3
1	3	2	6	8	4	9	5	7
9	5	6	1	7	2	3	8	4
8	4	7	5	9	3	6	1	2

చూసొద్దాం

భవిష్యత్తు చెబుతాయి!

గడ్డకట్టే చలి...
సరిహద్దుల్లో శత్రుసైన్యాల ముప్పు...
ఇలా నిత్యం అలజడితో ఉండే జమ్మూ-కశ్మీర్ ఎప్పుడూ హాట్‌టాపిక్‌గా ఉంటుంది
ఇప్పుడు ఆ రాష్ట్రంలోని లడక్‌కు పండగ సందడి వచ్చింది.
స్థానికుల భవిష్యత్తు చెప్పడానికి ఓ పండగ ప్రారంభం అవుతోంది
అవే మాథో నగ్‌రంగ్ ఉత్సవం!

జమ్ము-కశ్మీర్ రాష్ట్రంలోని లడక్ ఎప్పుడూ పర్యాటకులతో కిటకిటలాడుతూ ఉంటుంది. ముఖ్యంగా ఆ నగరానికి ప్రతి ఏటా ఫిబ్రవరి నెల పండగ కళ తెస్తుంది. ప్రాచీన బౌద్ధారామాలకు ఆ నగరం ఎంతో ప్రసిద్ధి. టిబెటియన్ కేలండర్‌లో ఫిబ్రవరిని మొదటి నెలగా పరిగణిస్తారు. బౌద్ధులకు ఇది ఎంతో పవిత్రమైన నెల. రెండు రోజుల పాటు మాథో నగ్‌రంగ్ బౌద్ధారామంలో ఈ ఉత్సవాలు ఎంతో ఘనంగా జరుగుతాయి.

ధ్యానం- ఉపవాసం

1410లో లామా దుగ్పా అనే వ్యక్తి ఈ బౌద్ధారామాన్ని ఏర్పాటు చేశాడు. అయితే ఇప్పుడు ఆ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. 2005లో సమావేశ ప్రాంగణాన్ని కొత్తగా నిర్మించి, ఆ బౌద్ధారామాన్ని తీర్చిదిద్దింది ప్రభుత్వం. 15వ దశాబ్దం నాటి బౌద్ధ చిత్రపటాలు ఉన్న మ్యూజియం చూడవచ్చు. మాస్కులు ధరించిన బౌద్ధభిక్షువుల నృత్యాలు ఈ ఉత్సవాలకు ప్రధాన ఆకర్షణ. స్థానికులు ఈ ఉత్సవాలకు తండోపతండాలుగా వెళ్తారు. కేవలం చూడటానికే కాదు... తమ భవిష్యత్తు గురించి కూడా! రోంగ్‌స్టన్ మాస్కులు ధరించి భిక్షువులకు తమ కష్టాలు విన్నవించుకుంటారు. ఏడాది పాటు కఠిన ఉపవాసాన్నీ, ధ్యానాన్నీ పాటించిన ఈ భిక్షువుల్లో మానవాతీత శక్తులు ఆవహిస్తాయని స్థానికుల విశ్వాసం. వీళ్లే ఈ రోంగ్‌స్టన్ ముసుగులు ధరించడానికి అర్హత సాధిస్తారు. నృత్యాలే కాదు.... ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలూ చేస్తారు. పదునైన కత్తులతో శరీరం మీద గాయాలు చేసుకుంటారు ఒక్క రోజులోనే ఆ గాయాలు మానిపోతాయని భక్తులు ఆశ్చర్యంగా చెబుతారు.

ఎప్పుడు: ఫిబ్రవరి 18 నుంచి 19వ తేదీ వరకు

ఎక్కడ: లడక్ నుంచి 26 కి.మీ దూరంలో మాథో బౌద్ధారామం ఉంది.

ఎలా వెళ్లాలి: హైదరాబాద్ నుంచి లడక్‌కు నేరుగా విమానం లేదా రైలు సర్వీసులు అందుబాటులో లేవు. ముందుగా హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీ వెళ్లి, అక్కడి నుంచి లె ప్రాంతంలోని కుషోక్ బకులా రింపోచి విమానాశ్రయానికి చేరుకోవాలి. లె నుంచి దాదాపు 25 కి.మీ దూరంలో ఉండే లడక్‌కు రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు.





దయచేసి అగౌరవపరచవద్దు


మహి, దిల్‌రాజు, విజయ్ చిల్లా

- మహి.వి.రాఘవ్

“మనకు వ్యక్తిగత ఇష్టాలు ఉండొచ్చు. విభేదాలు, అభిప్రాయభేదాలు ఉండవచ్చు. అంత మాత్రాన మనం ఒకరిని అగౌరవపరచకూడదు. ఒకరంటే ఇష్టం ఉన్నంత మాత్రాన, ఇంకొకరిని ద్వేషించకూడదు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే నేను దివంగత ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్‌రెడ్డిగారి సినిమా చేస్తున్నా. అది ఇష్టం ఉన్నా లేకపోయినా కాస్త సంయమనం పాటించండి. దయచేసి ఆయన్ని అగౌరవపరచవద్దు” అని మహి.వి.రాఘవ్ అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన ‘యాత్ర’ శుక్రవారం విడుదల కానుంది. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలు. వైయస్సార్ పాత్రలో మమ్ముట్టి నటించారు. 70 ఎం.ఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందించారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ‘దిల్’ రాజు మాట్లాడుతూ “వై.యస్.రాజశేఖర్‌రెడ్డిగారి పాదయాత్ర అంశాలను ప్రధానంగా తీసుకుని ‘యాత్ర’ను తెరకెక్కించారు. టీజర్, పాటలు విడుదలైనప్పుడు సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ చిత్రాన్ని నైజామ్, వైజాగ్‌లో మా సంస్థ తరపున విడుదల చేస్తున్నాం. ఆన్‌లైన్ ఓపెనింగ్స్ బావుండటం శుభసూచకం” అని అన్నారు.

మహేశ్‌తో మహేశ్‌ని చూసే రోజు వస్తుంది!



మహేశ్‌బాబు పక్కన మహేశ్‌బాబు నిలబడితే ఎలా ఉంటుంది? ఒక్కసారి ఊహించుకోండి... ఫిబ్రవరి నెలాఖరున హైదరాబాద్‌లో ఈ దృశ్యం ఆవిష్కృతం కానుంది. ప్రఖ్యాత మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియమ్, సింగపూర్‌లో మహేశ్ మైనపు ప్రతిమ నెలకొల్పనున్న సంగతి తెలిసిందే. కొన్ని నెలల క్రితం మ్యూజియమ్ ప్రతినిధులు మహేశ్ కొలతలు తీసుకువెళ్లారు. ఇప్పుడా మైనపు ప్రతిమను హైదరాబాద్ తీసుకు రానున్నారు. మహేశ్ ఏ రోజు అందుబాటులో ఉంటాడో చూసుకుని... ఆ రోజు గచ్చిబౌలిలోని ఎఎంబి మల్టీప్లెక్స్‌లో మహేశ్ ప్రతిమను ఆవిష్కరించనున్నారు. తర్వాత సింగపూర్‌కి, అక్కణ్ణుంచి లండన్‌లో టూస్సాడ్స్ మ్యూజియమ్ హెడ్ క్వార్టర్స్‌కి తరలిస్తారట!

వీఎఫ్‌ఎక్స్ వర్క్ బావుంది!


పూర్ణ, సాక్షీ చౌదరి

- బి. గోపాల్

“ట్రైలర్ చాలా బావుంది. ముఖ్యంగా వీఎఫ్‌ఎక్స్ వర్క్ బావుంది. సీజీ షాట్స్ అన్నీ బాగా తీశారు. సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నా” అని బి. గోపాల్ అన్నారు. జయప్రద, సాక్షీ చౌదరి, పూర్ణ ప్రధాన పాత్రధారులుగా ఎంఎస్ఎన్ సూర్య దర్శకత్వంలో ఎంఎల్ లక్ష్మి నిర్మించిన చిత్రం ‘సువర్ణ సుందరి’. ఈ సినిమా ట్రైలర్‌ను మంగళవారం బి. గోపాల్ విడుదల చేశారు. “ఇటువంటి చిత్రాలు రావడం చిత్రసీమకు చాలా అవసరం. కొత్త టెక్నీషియన్స్ పరిచయం అవుతారు” అని తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. “సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్ ఎక్కువ ఉంటడం, వాటిపై ఏడాదికి పైగా వర్క్ చేయడం వల్ల సినిమా ఆలస్యమైంది. అయితే... అవుట్‌పుట్ బాగా రావడంతో మేమంతా హ్యాపీ. త్వరలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం” అని చిత్రదర్శకుడు సూర్య అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు సాగర్, విజయేంద్ర ప్రసాద్, నటీనటులు పూర్ణ, రామ్, ఇంద్ర, రచయిత ప్రదీప్, స్టంట్ మాస్టర్ రామ్ పాల్గొన్నారు.



ఉద్యోగాన్ని వదిలి..
కలను నిజం చేసుకొని

చక్కగా బ్యాంక్‌లో ఉద్యోగం.. అదీ అసిస్టెంట్ మేనేజర్ కేడర్‌లో... అయినా తన చిన్ననాటి కలను నిజం చేసుకోవడానికి ఉద్యోగానికి రాజీనామా చేసి లక్ష్యం ఛేధించారు పసుపులేటి మోనిక కిషోర్. నిన్న యూపీఎస్సీ విడుదల చేసిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) ఫలితాల్లో జాతీయ స్థాయిలో 41వ ర్యాంకు సాధించిన మోనిక కిషోర్ సక్సెస్ స్టోరీ తన మాటల్లోనే..

టాపర్స్ వాయిస్

ఐఎఫ్ఎస్‌లో జాతీయ స్థాయిలో 41వ ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉంది. ఎన్ని మార్కులు వచ్చాయో ఇంకా తెలియదు. మరో 15 రోజుల తరవాత మార్కులను ప్రకటిస్తారు.

చిన్ననాటి కల

ఐఏఎస్ ఆఫీసర్ లేదా అటువంటి ఛాలెంజింగ్‌గా ఉండే వృత్తిలో స్థిరపడాలనేది నా చిన్ననాటి కల. అందుకే ఇంజనీరింగ్ పూర్తి చేశాక సివిల్ సర్వీసెస్ కోసం ప్రిపరేషన్ ప్రారంభించాను. ఇందుకోసం కోచింగ్ కూడా తీసుకున్నాను. అయితే అందులో తగిన మార్కులు రాలేదు. ఇదే సమయంలో ఆంధ్రా బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం వచ్చింది. అందులో చేరా. కానీ నా చిన్ననాటి కల అలాగా ఉండిపోయింది.

రాజీనామా చేసి

నా కలను నిజం చేసుకోవడానికి చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి మరోసారి సివిల్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టారు. ఇదే క్రమంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 కూడా రాశాను. ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. 7 మార్కులతో ఆ అవకాశం పోయింది. అటుపై సివిల్స్‌తోపాటు ఐఎఫ్ఎస్‌కు కూడా దరఖాస్తు చేశాను. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించాను. అదే సమయంలో ఐఎఫ్ఎస్ మెయిన్స్‌కు ప్రిపరేషన్ సాగించాను.

8 - 10 గంటలు

ఐఎఫ్ఎస్ మెయిన్స్‌లో నా ఆప్షనల్స్ ఫారెస్ట్రీ, జియాలజీ. ఇంజనీరింగ్ నేపథ్యం కావడం, సబ్జెక్ట్‌లు కొత్త కావడంతో ఎక్కువగా కష్టపడ్డాను. అయినప్పటికీ నిరుత్సాహపడలేదు. మెయిన్స్‌కు దాదాపుగా రెండు నెలల సమయం లభించింది. రోజుకు 8-10 గంటలు సీరియస్‌గా ప్రిపరేషన్ సాగించాను. జియాలజీ కోసం పీకే ముఖర్జీ, ఫారెస్ట్రీ కోసం మణికందన్ ప్రభు (ఈ పుస్తకాన్ని ఫారెస్ట్రీలో బైబిల్‌గా పేర్కొంటారు) పుస్తకాలను చదివాను.

ఇంటర్వ్యూ ఇలా

పీకే జోషి బోర్డు ఇంటర్వ్యూ చేసింది. ఇంటర్వ్యూ దాదాపు 20-25 నిమిషాలపాటు సాగింది. స్వస్థలం కర్నూలు కావడంతో దాని గురించి ప్రశ్నలు వేశారు. తరవాత ఫారెస్ట్రీకి సంబంధించి పర్యావరణం, వాతావరణ మార్పులు, వన్యప్రాణులు వంటి అంశాల నుంచి కూడా ప్రశ్నలు అడిగారు. దాదాపుగా 25-30 ప్రశ్నలు వేసి ఉంటారు. అన్నిటికీ సమాధానాలు ఇచ్చా. డాక్టర్ పీవీ లక్ష్మయ్య సార్ దగ్గర గ్రూప్-1, ఐఎఫ్ఎస్ ఇంటర్వ్యూకు కోసం కోచింగ్ తీసుకున్నాను. దాంతో ఆత్మవిశ్వాసంతో సమాధానాలు చెప్పాను.

మరోసారి

ఐఎఫ్ఎస్ కూడా ఆల్ ఇండియా సర్వీసే. ఈ సర్వీస్ కూడా ఛాలెంజింగ్‌గా ఉంటుంది. ఈ వృత్తి ద్వారా కూడా సమాజానికి కొంత మేలు చేసే అవకాశం లభిస్తుంది. కాకపోతే మరోసారి సివిల్స్ రాస్తాను. సివిల్స్, ఐఎఫ్ఎస్ వంటి పరీక్షలకు ప్రిపేరయ్యే వారికి కష్టపడే తత్వం, ఓపిక, సాధించగలను అనే నమ్మకం ఉండాలి. అప్పుడే విజయం సాధించవచ్చు.

కుటుంబ నేపథ్యం

మా స్వస్థలం కర్నూలు. నాన్న వెంకట కిషోర్ లాయర్. అమ్మ అనురాధ. విశ్వభారతి స్కూల్‌లో చదివాను. 10వ తరగతిలో 94.66 శాతం మార్కులు వచ్చాయి. ఫిట్జి జూనియర్ కాలేజీ నుంచి 2009లో 93.7 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ (ఎంపీసీ గ్రూపుతో) పూర్తి చేశాను. 2013లో జేబీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌తో బీటెక్ పూర్తి చేశాను. బీటెక్‌లో 79.24 శాతం మార్కులను సాధించాను. 2015 ఏప్రిల్ నుంచి 2017 ఏప్రిల్ వరకు వరంగల్ ఆంధ్రా బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులను నిర్వహించాను. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ నుంచి మెరిట్ స్కాలర్‌షిప్ కూడా లభించింది.

ఇంటర్మీడియెట్‌లో ప్రత్యేకమైన గ్రూపు ఎంఈసీ. మ్యాథమెటిక్స్ పై ఆసక్తి ఉన్నవారు ఎంపీసీ తీసుకుంటారు. కామర్స్ చదవాలనుకునేవారు సీఈసీ ఎంచుకుంటారు. అయితే మ్యాథమెటిక్స్‌తోపాటు కామర్స్‌ను ఇష్టపడే వారు ఎంఈసీని ఎంచుకుంటారు. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల్లో నాలుగు నుంచి ఐదువేల మంది విద్యార్థులు మాత్రమే ఈ గ్రూపును చదివేవారు. ప్రస్తుతం లక్ష మందికి పైగా విద్యార్థులు ఇంటర్‌లో ఎంఈసీ గ్రూపును ఎంచుకుంటున్నారు. త్వరలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎంఈసీలో మంచి మార్కుల సాధనకు అనుసరించాల్సిన వ్యూహంపై విశ్లేషణ..



పాయింట్ల రూపంలో రాస్తే
వస్తాయ్ మార్కులు

మ్యాథమెటిక్స్

మొదటి సంవత్సరం

పేపర్ - 1ఎ

- ఇందులో Functions, Vector Algebra, Matrics, Trigonometric ratios వంటి చాప్టర్ల నుంచి రెండు మార్కుల ప్రశ్నలు వస్తాయి.
- Mathematical Induction Chapterలో nth term of A.P., G.P, $\sum n$, $\sum n^2$, $\sum n^3$ ఫార్ములాలపై పట్టు సాధించాలి. ఈ ప్రశ్న కంక్లూజన్ స్టెప్స్‌పై దృష్టి సారించాలి.
- Functions Theorems బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇది థియరీటికల్ ప్రశ్న కాబట్టి ఎటువంటి తప్పులు లేకుండా రాయాలి.
- Matricesలో Definitions, Determinant Problems, Consistant, Inconsistant Problems, CRAMER'S Rule, Matrix Inversion Method, Gouss Jordan Problems బాగా ప్రాక్టీస్ చేయాలి.
- Addition of Vectorsలో Collinear, Coplanarకి సంబంధించిన ప్రశ్నలపై పట్టు సాధించాలి. అదే సమయంలో Product of Vectorsలో Distance b/w Skew Lines Problems, Vector Triple Product Theorem బాగా ప్రాక్టీస్ చేయాలి.
- Trigonometry Formulasపై అవగాహన ఉండాలి.
- Properties of Triangles లో Sides ఇస్తే In Radius, Ex Radius, Circum Radiusలు కనుక్కునే విధానాలను (Vice Versa) సాధన చేయాలి.



పేపర్ - 1బి

- ఈపేపర్‌లో 2 మార్కుల ప్రశ్నల్లో ఎక్కువ మార్కులు రావాలంటే Stright lines, Limits and Continuity, Derivatives, Application of Derivatives చాప్టర్లను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- Locus, Transformation of Axes, Limits & Continuity, Derivative of The Funtion using first Priniciple Problemsపై దృష్టి సారిస్తే 4 మార్కుల విభాగంలో గరిష్ఠ మార్కులు సాధించవచ్చు.
- Straight Linesలో Circum Center, Ortho Centre Problems, Foot of the Perpendicular, Image Theorems బాగా ప్రాక్టీస్ చేయాలి.
- Pair of Straight Linesలో Theorems, Homogenising Concepts సంబంధించిన ప్రాబ్లమ్స్ బాగా ప్రాక్టీస్ చేయాలి.
- Angle b/w Two Lines by Using DR's & DC's పై దృష్టి సారించాలి.
- Application of Derivativesలో Tangent and Normal Conceptలో Angle b/w Two Curves తోపాటు Maxima & Minima
- Conceptకి సంబంధించిన Cone, Cylinder, Sphere related problems బాగా ప్రాక్టీస్ చేయాలి. ఈ చాప్టర్‌లోని సమాధానాలకు అవసరమైన చోట యూనిట్లు (ప్రమాణాలు) తప్పకుండా రాయాలి.
- Calculusలోని ప్రశ్నలను సాధించాలంటే Trigonometry, Derivatives formulas పై పట్టు ఉండాలి.

రెండో సంవత్సరం

పేపర్ - 2ఎ

- ఇందులో Complex Numbers, Permutations and Combinations మొదలైన చాప్టర్ల నుంచి 2 మార్కుల ప్రశ్నలు ఎక్కువగా వస్తాయి.
- Quadratic Equations, Complex Numbers, Partial Fractionsను ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తే 4 మార్కుల విభాగంలో గరిష్ఠ మార్కులు సాధించవచ్చు.
- Permutations & Combinationsలో Sum of the digits, Rank of the given word problemsపై దృష్టి సారించాలి. Combinations conceptకి సంబంధించి team selection problems పై పట్టు సాధించాలి. ఈ చాప్టర్‌లోని ప్రశ్నలకు డైరెక్ట్‌గా కాకుండా స్టెప్ వైజ్‌గా సమాధానాలు ఇవ్వాలి. Palindrome తదితర కాన్సెప్ట్ మీద లెక్కలను తప్పనిసరిగా ప్రాక్టీస్ చేయాలి.
- Theory of Equationsలో relation between the roots and coefficients, multiple roots, Reciprocal Equation conceptకి సంబంధించిన ప్రశ్నలపై దృష్టి సారించాలి.
- Binomial Theoremలో Rational index problems, number of terms in a Binominal and Trinomial expansions, General term, Indipendent term, Middle term, Binomial Coefficentsకి సంబంధించిన ప్రాబ్లమ్స్‌పై పట్టు సాధించాలి.
- Probability Chapterలో Addition Theorem, Multiplication Theorem, Bay's Theorem సంబంధిత అప్లికేషన్స్‌పై దృష్టి సారించాలి.
- De-moivre's Theorem, Random Variables Chaptersల నుంచి సులభమైన ప్రశ్నలు రావొచ్చు.

పేపర్ - 2బి

- ఇందులో ఎక్కువ మార్కుల కోసం Circles, Conic Section, Integrations చాప్టర్లను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- Circles, Integrations, Definite Integrations Chapters నుంచి 55 మార్కుల వరకు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.
- Circles, System of Circles, Conic Sectionను ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తే సెక్షన్-బిలో గరిష్ఠ మార్కులు సాధించవచ్చు.
- Circlesలో Concyclic Points, Direct Common Tangents, Transverse Common Tangents of given Two Circles, Relative Positions of Two Circles పై దృష్టి సారించాలి.
- Conic Sectionలో Parabola Standard Form, Properties of Ellipse, Hyperbolaపై పట్టు సాధించాలి.
- Integrationsలోని సమస్యలు, Reduction Formulas పై ప్రత్యేక శ్రద్ధ అవసరం.
- Differential Equations Chapterలోని నాలుగు మెథడ్స్ (Variable - Separable, Homogeneous, Non-Homogeneous, Linear Differential Equations), Order & Degree of Differential Equations పై దృష్టి సారించాలి.
- Calculus ప్రశ్నలకు సమాధానాలు రాయాలంటే Trigonometry, Derivatives, Integrations formulas పై పట్టు ఉండాలి.

ఎకనామిక్స్

మొదటి / రెండో సంవత్సరంలో 100 మార్కులకు ఎకనామిక్స్ పరీక్ష ఉంటుంది.

మొదటి సంవత్సరం

- మొదటి సంవత్సరంలో 10 యూనిట్లు ఉన్నాయి. అవి ఉపోద్ఘాతం, వినియోగ సిద్ధాంతం, ఉత్పత్తి సిద్ధాంతం, విలువ సిద్ధాంతం, పంపిణీ సిద్ధాంతం, జాతీయ ఆదాయం, స్థూల ఆర్థిక అంశాలు, ద్రవ్యం - బ్యాంకింగ్ - ద్రవ్యోల్బణం, ఆర్థికశాస్త్రం - గణాంకశాస్త్రం.
- ఇందులో అధిక మార్కులు సాధించాలంటే వినియోగ సిద్ధాంతాలు, డిమాండ్, ఉత్పత్తి, విలువ సిద్ధాంతం, జాతీయ ఆదాయం, స్థూల ఆర్థిక అంశాలు వంటి చాప్టర్ల మీద పట్టు ఉండాలి.
- ఎస్సేలు రాసేటప్పుడు ఇంట్రడక్షన్, డెఫినిషన్స్, టేబుల్స్ - డయాగ్రమ్స్ తప్పులు లేకుండా జాగ్రత్త పడాలి.
- ముందుగా ఎస్సే (10 మార్కులు) ప్రశ్నలు, తరవాత వెరీ షార్ట్ ఆన్సర్ ప్రశ్నలు (2 మార్కులు) చివరగా షార్ట్ ఆన్సర్ ప్రశ్నలు (5 మార్కులు) రాస్తే సమయం సరిపోతుంది.
- ప్రశ్న సంఖ్యను స్పష్టంగా కనబడేటట్లు వేయాలి. డయాగ్రామ్స్ ఉన్న ప్రశ్నలు ఎంచుకుంటే ఎక్కువ మార్కులు రావడానికి అవకాశం ఉంది.

రెండో సంవత్సరం

- రెండో సంవత్సరంలో ఆర్థికవృద్ధి, ఆర్థికాభివృద్ధి, జనాభా, మానవ వనరుల అభివృద్ధి, జాతీయ ఆదాయం, వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, తృతీయ రంగం, సేవల రంగం, ప్రణాళిక - ఆర్థిక సంస్కరణలు, పర్యావరణం - సుస్థిర ఆర్థికాభివృద్ధి, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, లక్షణాలు వంటి అంశాలు ఉన్నాయి.
- ఇందులో అధిక మార్కులు సాధించాలంటే ఆర్థిక వృద్ధి - ఆర్థికాభివృద్ధి, జనాభా మానవ వనరుల అభివృద్ధి, జాతీయ ఆదాయం, వ్యవసాయం, పారిశ్రామికాభివృద్ధి, ప్రణాళికలు చాప్టర్ల మీద పట్టు ఉండాలి.
- ముందుగా ఎస్సే (10 మార్కులు) ప్రశ్నలు, తరవాత వెరీ షార్ట్ ఆన్సర్ ప్రశ్నలు (2 మార్కులు) చివరగా షార్ట్ ఆన్సర్ ప్రశ్నలు (5 మార్కులు) రాస్తే సమయం సరిపోతుంది.

- పుస్తకాల్లో ఉన్న సైడ్ హెడ్డింగ్స్ రాసి అండర్‌లైన్ చేయాలి. టేబుల్స్, డేటా తప్పులు లేకుండా రాయాలి.
- ఆర్థికవృద్ధి - ఆర్థికాభివృద్ధి, జనాభా మానవ వనరుల అభివృద్ధి, వ్యవసాయరంగం. పారిశ్రామికరంగం, జాతీయ ఆదాయం చాప్టర్ల నుంచి ఎస్సే ప్రశ్నలు రావచ్చు. మిగిలిన చాప్టర్ల నుంచి 5 మార్కుల ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.
- వెయిటేజ్ కచ్చితంగా ఫాలో అవుతారు అని చెప్పలేం. కాబట్టి ఏ చాప్టర్ నుంచైనా ప్రశ్నలు అడగటానికి అవకాశం ఉంటుందనే విషయాన్ని గమనించాలి.






సి.ఎ. రాధ
అకడమిక్ అడ్వయిజర్,
మాస్టర్ మైండ్స్

కామర్స్

- మొదటి సంవత్సరంలో వ్యాపార భావనలు, వివిధ రకాల వ్యాపార సంస్థలు, కంపెనీ నిర్మాణం, వ్యాపార ఆర్థిక వనరులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు, వ్యాపారంలో ఉద్భవిస్తున్న ధోరణులు, బహుళ జాతీయ సంస్థలు వంటి అంశాలు ఉంటాయి.



- అకౌంటింగ్‌లో మొదటి సంవత్సరంలో అకౌంటింగ్ భావనలు, ఖాతాల నిర్వాహణ, జంటపద్దు విధానంలో ఖాతాల నిర్వాహణ, చిట్టాలు, బ్యాంకు నిల్వల సమన్వయ పట్టీ ముగింపు లెక్కలు ఉంటాయి.
- రెండో సంవత్సరంలో వ్యవస్థాపకుడు, వ్యవస్థాపకత, స్వదేశీ, విదేశీ వర్తకం, వ్యాపార సేవలు, ఫైనాన్షియల్ మార్కెట్లు, వినియోగదారుల రక్షణ వంటి అంశాలు ఉంటాయి.
- అకౌంటింగ్‌లో రెండో సంవత్సరంలో కన్‌సైన్‌మెంట్ ఖాతాలు, భాగస్వామ్య ఖాతాలు, కంపెనీ ఖాతాలు వంటివి ప్రధానం. అకౌంటింగ్‌లో అధ్యాయాల మధ్య సంబంధం ఉండదు. అందువల్ల జాగ్రత్తగా ప్రిపేర్ కావాలి.
- కామర్స్ సబ్జెక్ట్‌లో థియరీకి 50 మార్కులు (పార్ట్-ఎ), మరో 50 మార్కులు అకౌంట్స్‌కు (పార్ట్-బి) ఉంటాయి. వీటిని ఒకే పేపర్‌లో ఇస్తారు.
- పార్ట్-ఎ సెక్షన్-1లో మూడు 10 మార్కుల ప్రశ్నలు ఇస్తారు (ప్రశ్నల సంఖ్య 1, 2, 3). వాటిలో రెండు ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- సెక్షన్-2లో ఆరు 5 మార్కుల ప్రశ్నలు ఇస్తారు. వాటిలో నాలుగు ప్రశ్నలకు సమాధానాలు రాయాలి (ప్రశ్నల సంఖ్య 4, 5, 6, 7, 8, 9).
- సెక్షన్-3లో ఎనిమిది 2 మార్కుల ప్రశ్నలు ఇస్తారు. వాటిలో ఆరు ప్రశ్నలకు సమాధానాలు రాయాలి (ప్రశ్నల సంఖ్య 10, 11, 12, 13, 14, 15, 16, 17).
- ముందుగా సెక్షన్-3లోని 2 మార్కుల ప్రశ్నలు తరవాత సెక్షన్-1లో 10 మార్కుల ప్రశ్నలు, చివరగా సెక్షన్-2లోని 5 మార్కుల ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- 5, 10 మార్కుల ప్రశ్నలు పాయింట్ల రూపంలో రాయడం ప్రయోజనకరం. అదేవిధంగా సైడ్ హెడ్డింగ్స్, ముఖ్యమైన పాయింట్లను అండర్‌లైన్ చేయాలి. వీటికి ఇంట్రడక్షన్ రాయాలి.
- కామర్స్ మధ్యలో అకౌంట్స్, అదేవిధంగా అకౌంట్స్ మధ్యలో కామర్స్ ప్రశ్నలు రాయకూడదు.
- ముందుగా అకౌంట్స్ పార్ట్, తరవాత కామర్స్ పార్ట్‌కు సమాధానాలు రాస్తే చివర్లో ఒత్తిడికి లోను కాకుండా ఉండొచ్చు. కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి.
- ప్రశ్నపత్రంలో అకౌంట్స్ ప్రశ్నలు 18 నుంచి ప్రారంభమవుతాయి.
- అకౌంట్స్‌లోని సమస్యలను సాధించే క్రమంలో అమౌంట్స్‌ని జాగ్రత్తగా రాసుకోవాలి. ప్రాబ్లమ్ సొల్యూషన్ చేయటానికి బ్లూ పెన్ వాడాలి. చివరి 10 నిమిషాల్లో అన్ని సమాధానాలు అలాగే కాలిక్యులేషన్స్‌ని ఒకసారి చెక్ చేసుకోవాలి.
- అకౌంట్స్ విభాగంలో పర్‌ఫెక్ట్‌గా ఉన్న ప్రాబ్లమ్‌తో ప్రారంభించాలి. 5 మార్కుల సమస్యను ప్రయత్నించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. 2 మార్కుల ప్రాబ్లమ్స్ అటెంప్ట్ చేసి థీయరి ప్రశ్నలకు సమాధానాలు రాయటం మంచిది.
- 20 మార్కుల ప్రశ్నలకు (జూనియర్ ఇంటర్ - ఫైనల్ అకౌంట్స్, సీనియర్ ఇంటర్ - పార్టనర్‌షిప్ అకౌంట్స్) సమాధానాలు ఒక పేజీలో రావు. కాబట్టి రెండు పేజీల్లో చేయాలి. అందుకు ముందు, వెనుక కాకుండా పక్కపక్క పేజీలను ఎంచుకోవాలి.
- ప్రాబ్లమ్ ప్రెజెంటేషన్ నీట్‌గా ఉండేలా చూసుకోవాలి. ప్రతి ప్రాబ్లమ్‌కి పెన్సిల్‌తో నీట్‌గా ఫ్రాఫార్మాస్ గీసి, హెడ్డింగ్స్ రాయటానికి బ్లాక్ పెన్ ఉపయోగించాలి.
- ఏ ప్రశ్నను వదలకుండా మొత్తం 50 మార్కులను ప్రయత్నించాలి.
- ప్రాబ్లమ్‌లో వేసే మొత్తాలను ఒక దాని కింద ఒకటి రాస్తే టోటల్, బ్యాలెన్స్ చేయడం సులభమవుతుంది.
- సమయం మిగిలి ఉంటే చాయిస్ కింద వదిలిన ప్రశ్నలను ప్రయత్నించాలి.

మొదటి సంవత్సరం

- ఇందులో ఫైనల్ అకౌంట్స్ ఛాప్టర్‌లో రాని బాకీలు, రాని బాకీల నిధి, స్థిరాస్తులపై తరుగుదల లాంటి సర్దుబాట్ల విషయంలో జాగ్రత్త వహించాలి.
- మూడు వరుసల నగదు చిట్టా చేసేటప్పుడు ఎదురు పద్దుల విషయంలో జాగ్రత్త తప్పనిసరి.
- బ్యాంకు నిల్వల సమన్వయ పట్టీలో నగదు పుస్తకంలోని తప్పులను, అలాగే పాస్‌పుస్తకంలోని తప్పులను లెక్కలో తీసుకునేటప్పుడు జాగ్రత్తగా పరిశీలించాలి.
- సహాయక చిట్టాల తయారీ విషయంలో వర్తకపు డిస్కౌంట్‌ని లెక్కించే విషయంలో జాగ్రత్తగా ఉండాలి.
- వ్యక్తిగత ఖాతాను తయారు చేసేటప్పుడు ప్రారంభ నిల్వ విషయంలో అలాగే ఖాతా ముగింపు విషయంలో లెక్కలో ఇచ్చిన సమాచారాన్ని జాగ్రత్తగా గమనించాలి.

రెండో సంవత్సరం

- ఇందులో భాగస్వామ్య ఖాతాలు తయారు చేసేటప్పుడు గుడ్‌విల్ ఖాతా, మూలధన ఖాతాలు, పునర్మూల్యాంకన ఖాతా విషయంలో, కన్‌సైన్‌మెంట్ ఖాతాలు తయారీలో, ముగింపు సరుకు లెక్కింపు విషయంలో జాగ్రత్త ఉండాలి.
- వ్యాపారేతర సంస్థల ఖాతాల విషయంలో ఆదాయ వ్యయాల ఖాతా తయారు చేసేటప్పుడు రాబడి అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. మూలధన అంశాలను వదిలివేయాలి.
- తరుగుదల ఖాతాలలో ఆస్థి ఖాతా తయారు చేసేటప్పుడు తరుగుదల లెక్కింపు, వర్తకపు బిల్లులకు సంబంధించి డిస్కౌంట్‌ను జాగ్రత్తగా పరిశీలించాలి.
- ఒంటిపద్దు విధానంలో లాభనష్టాల నివేదిక తయారీలో ముగింపు మూలధనంతో ప్రారంభించాలి.



వయసు మళ్లింది..



10 శాతం పొదుపు పథకాల్లో పెడతా

స్వల్పకాలిక పెట్టుబడి ప్రియురాలు.. దీర్ఘకాలిక పెట్టుబడి ఇల్లాలు
మార్కెట్ తెలియని వారికి మ్యూచువల్ ఫండ్‌లు మేలు
టైకాన్ సదస్సులో రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా

రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా.. భారత బఫెట్! స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి లాభాలు గడించాలనుకునే లక్షలాది మందికి ఆయనే స్ఫూర్తి. అలాంటిది ఆయన మనసు క్రమంగా షేర్ల నుంచి పొదుపు పథకాల వైపు మళ్లుతోంది. బుధవారం టైకాన్ సదస్సులో ఝున్‌ఝున్‌వాలా తన మనసులో మాట బయటపెట్టారు. 'నాకు వయసు మీద పడుతోంది. ఇకపై పెట్టుబడుల్లో నష్ట భయాల్ని తగ్గించుకోవాలి. అందుకోసం తప్పనిసరిగా 5-10 శాతం పెట్టుబడులను పొదుపు పథకాల్లోకి మళ్లించాలనుకుంటున్నాను' అని అన్నారు. మార్కెట్ బిగ్ బుల్‌గా పిలుచుకునే ఝున్‌ఝున్‌వాలాకు ప్రస్తుతం రూ.50 వేల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్ మాత్రమే ఉన్నాయి. మరో రూ.కోటి పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఖాతాలో ఉంది.

ఆస్తిలో 5 శాతం ఫిక్స్‌డ్ డిపాజిట్

ప్రస్తుతం ఝున్‌ఝున్‌వాలా సంపద 270 కోట్ల డాలర్లు (దాదాపు రూ.19,000 కోట్లు) ఉంటుందని అంచనా. తన ఇద్దరి పిల్లల కోసం ఆస్తిలో 5 శాతాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని ఆయన అన్నారు. ఎందుకంటే, తాను మిగతా ఆస్తిని జూదంలో పోగొట్టుకున్నా.. ఎఫ్‌డీ సొమ్ముతోనైనా తన పిల్లల జీవితం సాఫీగా సాగిపోతుందన్నారు.

మందు తాగడం తగ్గించేశా..

కొన్నేళ్ల క్రితం వరకు వారానికి ఏడు రోజులు తాగేవాడిని.. ప్రస్తుతం రెండు రోజులకు పరిమితం చేశానని ఝున్‌ఝున్‌వాలా అన్నారు. అప్పుడప్పుడు యోగా కూడా చేస్తున్నా.

ఇంకే పనీ తెలియదు

ఇష్టంగా పెట్టుబడులు పెట్టడంతోపాటు తనకన్నీ స్టాక్ మార్కెట్టేనని ఝున్‌ఝున్‌వాలా అన్నారు. తన విజయాలు, లాభార్జన రహస్యమదేనన్నారు. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడం తప్ప తనకింకే పనీ తెలియదని తెలిపారు. స్వల్పకాలిక పెట్టుబడులే తననింత వాడిని చేశాయని బిగ్ బుల్ అన్నారు. అయితే, స్వల్పకాలిక పెట్టుబడి ప్రియురాలు వంటిదని, దీర్ఘకాలిక పెట్టుబడి శ్రీమతి లాంటివన్నారు. ఇద్దరినీ సంతోషపర్చాలని ఆయన ఇన్వెస్టర్లకు సూచించారు.

ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభానికి కారణాలనేకం

ఈమధ్య స్టాక్ మార్కెట్‌ను కుదిపేసిన ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభానికి సరైన నియంత్రణ లేకపోవడంతోపాటు పలు కారణాలున్నాయని ఝున్‌ఝున్‌వాలా అన్నారు. అయితే, పాత రోజులతో పోలిస్తే ప్రస్తుతం కంపెనీల్లో కార్పొరేట్ పాలన ప్రమాణాలు 5000 రెట్లు మెరుగ్గా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

జూదంపై మోజు

రాకేశ్ ఝున్‌ఝున్‌వాలాకు జూదంపై అమితమైన మోజు. తరచుగా ఆయన జూదం ఆడతాడని, భారీగా పందెం కాస్తారని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతుంటారు. గోవా మాదిరిగా దేశంలోని మిగతా రాష్ట్రాలన్నీ జూదాన్ని త్వరలోనే చట్టబద్ధం చేయవచ్చని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అదృష్టం పరీక్షించుకోవాలంటే..

స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడం చాలా నిబద్ధతతో కూడిన వ్యాపారమని, ఇందులో నైపుణ్యం లేని వారు మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టడం మేలని ఆయన సూచించారు. ఒకవేళ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలన్న ఉత్సాహం ఉంటే సొంతంగా పెట్టుబడులు మీ వద్దనున్న నిధుల్లో 10 శాతానికి మించకపోవడం మేలన్నారు.

స్టార్టప్‌ల్లో పెట్టుబడులపై పెదవి విరుపు

స్టార్టప్‌లలో పెట్టుబడులపై ఝున్‌ఝున్‌వాలా అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో 2000, 2007 సంవత్సరాల్లో ఆయన స్టార్టప్ పెట్టుబడులపై భారీగా నష్టపోయారు. తాను స్టార్టప్ పెట్టుబడులకు దూరంగా ఉంటున్నానని, చాలా అంకుర సంస్థల వ్యాపారం అర్థం కాకుండా ఉందని అన్నారు. చాలావరకు స్టార్టప్‌ల వ్యాపారంలో వినూత్నత లోపిస్తోందన్నారు.

మోదీకే నా మద్దతు

కేంద్రంలో మరోసారి బీజేపీనే అధికారంలోకి రావాలని కోరుకుంటున్నట్లు స్టాక్ మార్కెట్ మాంత్రికుడు తన మనసులో మాట బయటపెట్టారు. ప్రధాని మోదీ ప్రజల వైఖరిలో ఎంతో మార్పు తీసుకొచ్చారని ఆయన పేర్కొన్నారు.

పసిడికి కళ

మళ్లీ మదుపర్లను ఆకర్షిస్తున్న బంగారం

అంతర్జాతీయ పరిణామాలే కారణం

హైదరాబాద్, ఆంధ్రజ్యోతి బిజినెస్

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు మందగించడంతో మదుపరుల దృష్టి మరోసారి బంగారంపై పడింది. ప్రపంచవ్యాప్తంగా ఇదే ధోరణి నెలకొంది. జనవరిలో లాభాల బాటలో పయనించిన ఔన్సు ధర 1,321.21 డాలర్ల వద్ద ముగిసింది. బంగారం ధర పెరగడం వరుసగా ఇది నాలుగో నెల.

ప్రపంచ దేశాల ఆర్థికాభివృద్ధిరేటు మందగించింది. ఈక్విటీ మార్కెట్లు గత ఏడాది కాలంగా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతున్నాయి. దీనికి తోడు వడ్డీరేట్ల పెంపునకు అమెరికన్ ఫెడరల్ విరామం ఇవ్వడం, డాలర్ బలహీనత, అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ అస్థిరతలు... ఇవన్నీ బంగారం ధరల పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం తగ్గుముఖం పట్టే సూచనలేవీ లేకపోవడం, అమెరికాలో ఏర్పడిన షట్‌డౌన్ డాలర్ రేటును ప్రభావితం చేశాయి.



అమెరికన్ ఫెడరల్ దూకుడు తగ్గించడం తప్పనిసరి అని మార్కెట్ వర్గాలు ఒక నిశ్చయానికిరావడంతో సెంటిమెంట్ బలహీనపడింది. 2018 సంవత్సరం అంతా అమెరికన్ ఫెడరల్ వడ్డీరేట్లు పెంచుతూనే వచ్చింది. వరుసగా తొమ్మిది సార్లు వడ్డీ రేట్లు పెంచుకుంటూ పోవడం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ రికవరీకి అవరోధం ఏర్పడింది. 2019 సంవత్సరంలో ఇదే ధోరణి అనుసరిస్తే మరింత రిస్క్ తప్పదన్న సంకేతాలు కూడా అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పోవెల్ వడ్డీరేట్ల పెంపు క్రమానికి విరామం ఇవ్వడానికి కారణం. ఈ స్థూల ఆర్థిక పరిస్థితులన్నీ భవిష్యత్తులో బంగారం ధరలు మరింతగా పెరుగుతాయనేందుకు సంకేతాలని మార్కెట్ విశ్లేషకులంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా అస్థిరతలు పెరిగిపోయిన వాతావరణంలో పెట్టుబడుల్లో సమతూకం తెచ్చి పోర్ట్‌ఫోలియోలో రిస్క్‌ను తగ్గించే సాధనం బంగారం ఒక్కటేనని వారు చెబుతున్నారు.

2019.. బులియన్ ఏడాది : కార్వీ

2019 సంవత్సరాన్ని బులియన్ ఏడాదిగా పరిగణించవచ్చని హైదరాబాద్‌కు చెందిన కార్వీ కన్సల్టెంట్స్ తెలిపింది. కార్వీ సంస్థ కరెన్సీ, కమోడిటీ మార్కెట్లపై నివేదికను వెలువరించింది. ప్రస్తుత పరిస్థితుల్లో బంగారం, వెండి ఇతర పెట్టుబడి సాధనాల కన్నా మెరుగైన రాబడులు అందించే ఆస్కారం ఉన్నదని కార్వీ సీఈఓ (కమోడిటీస్, కరెన్సీస్) రమేశ్ వరఖేడ్కర్ తెలిపారు. కమోడిటీ, కరెన్సీ మార్కెట్లు రెండింటికీ 2018 అత్యంత చేటు కలిగించిన సంవత్సరం అని కార్వీ ఆ నివేదికలో పేర్కొన్నారు. 2017 సంవత్సరంలో ఈ రెండు మార్కెట్లు చూపిన అద్భుతమైన పురోగతిని 2018లో కొనసాగించలేకపోయాయని వివరించింది.

బ్యాంకులు రూ.20 లక్షల కోట్ల డిపాజిట్లు సమీకరించాలి

» అప్పుడే రుణ వితరణ వృద్ధి : క్రిసిల్

ముంబై: బ్యాంకులు తమ రుణ వితరణలో వృద్ధి సాధించేందుకుగాను 2020 మార్చి నాటికి రూ.20 లక్షల కోట్లకు పైగా డిపాజిట్లను బ్యాంకులు సమీకరించాల్సి ఉంటుందని దేశీయ రేటింగ్స్ ఏజెన్సీ క్రిసిల్ అంచనా వేస్తోంది. బ్యాంకులు ఈ స్థాయిలో డిపాజిట్లను సేకరించడానికి ప్రయత్నం చేస్తే వడ్డీ రేట్లు పెరిగే అవకాశం ఉందని తన నివేదికలో క్రిసిల్ తెలిపింది. మొత్తం డిపాజిట్ల సమీకరణలో ప్రైవేటు రంగంలోని బ్యాంకుల వాటాయే 60 శాతం వరకు ఉండవచ్చని పేర్కొంది. గత కొన్నాళ్లుగా బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆఫర్ చేస్తున్న వడ్డీ రేట్లు అంత ఆకర్షణీయంగా లేవు. ఈ నేపథ్యంలో ఎక్కువ వడ్డీ వచ్చే ఇతర ఆర్థిక సాధనాలపై ప్రజలు దృష్టిసారిస్తున్నారు. ఫలితంగా బ్యాంకుల వద్ద డిపాజిట్లు తగ్గిపోతున్నాయి. బ్యాంకింగ్ రంగంలో 2018-19, 2019-20 సంవత్సరాల్లో రుణ వితరణలో వృద్ధి 13-14 శాతం ఉండవచ్చని క్రిసిల్ అంచనావేస్తోంది.

పోంజీ స్కీమ్‌ల నుంచి డిపాజిటర్లకు రక్షణ


న్యూఢిల్లీ: పోంజీ స్కీమ్‌ల నుంచి అమాయక డిపాజిటర్లకు రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో చర్య చేపట్టింది. 'అనియంత్రిత డిపాజిట్ పథకాల నిషేధం బిల్లు 2018' సవరణలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. తద్వారా పోంజీ స్కీమ్‌లో పొదుపు చేసుకొని నష్టపోయిన డిపాజిటర్లకు పరిహారం చెల్లించేలా ఈ బిల్లులో సవరణలను ప్రతిపాదించారు. ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షక పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫారసుల ఆధారంగా ఈ బిల్లులో సవరణలు ప్రతిపాదించారు. తద్వారా ఈ బిల్లు మరింత బలోపేతమవుతుందని, అమాయక, పేద ప్రజలను మోసగించే అక్రమ పథకాలకు అడ్డుకట్ట పడుతుందని కేబినెట్ సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ఆదాయ పన్నుతోపాటు పరోక్ష పన్నులకు అంబుడ్స్‌మెన్ వ్యవస్థలను రద్దు చేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. చాలా మంది ఆన్‌లైన్ ద్వారా ఇబ్బందుల పరిష్కారానికి మొగ్గు చూపుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దేశం నుంచి పని చేసే అంతర్జాతీయ ఆర్థిక సేవా కేంద్రా(ఐఎఫ్ఎస్‌సీ)ల నియంత్రణ కోసం ఏకీకృత నియంత్రణ (రెగ్యులేటరీ) సంస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం కేంద్ర కేబినెట్ సమావేశంలో ఇందుకు సంబంధించిన 'ఇంటర్నేషనల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ బిల్, 2019కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

డాక్టర్ రెడ్డీస్ కంపెనీపై అమెరికాలో ఫిర్యాదు

న్యూఢిల్లీ: అమెరికాలోని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ అనుబంధ సంస్థపై, అమెరికా బీమా కంపెనీ 'యునైటెడ్ హెల్త్‌కేర్ సర్వీసెస్' (యుహెచ్ఎస్) ఫిర్యాదు చేసింది. 30 రకాల జనరిక్ ఔషధాల ధరల నిర్ణయం కోసం డాక్టర్ రెడ్డీస్ అనుబంధ కంపెనీ, మరో 42 కంపెనీలతో కలిసి కుట్రపూరితంగా బిడ్లను రిగ్ చేస్తోందని ఆరోపించింది. ఇందుకు ఈ కంపెనీల నుంచి నష్ట పరిహారం వసూలు చేయాలని కోరింది. డాక్టర్ రెడ్డీస్ మాత్రం ఈ ఆరోపణలను తోసిపుచ్చింది.

శక్తికాంత దాస్ ఏం చేస్తారో?

వృద్ధికి ప్రాధాన్యమిస్తే కీలక రేట్లు తగ్గొచ్చు.. నేడు పరపతి విధాన సమీక్ష



ఆంధ్రజ్యోతి బిజినెస్ డెస్క్

కీలకమైన రెపో రేటుపై భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) గురువారం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న దానిపై పరిశ్రమ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత పరిణామాలను పరిగణనలోకి తీసుకుని ఆర్థికవేత్తలు రెపో, రివర్స్ రెపో రేట్లపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. రేటింగ్ ఏజెన్సీలు సైతం.. రేట్లను తగ్గించడానికి, తగ్గించకుండా ఉండటానికి గల కారణాలను విశ్లేషిస్తున్నాయి. రుణాల లభ్యత కష్టంగా మారిన నేపథ్యంలో నేడు ప్రకటించనున్న పరపతి విధాన సమీక్షలో కీలక రేట్లను తగ్గించాలని పారిశ్రామిక రంగం కోరుకుంటోంది. ఆర్థిక వ్యవస్థ వృద్ధిని దృష్టిలో ఉంచుకుని రెపో రేటును తగ్గించాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం ద్రవ్యోల్బణం ఆమోదయోగ్యమైన స్థాయిలోనే ఉంది. కాబట్టి రిజర్వు బ్యాంకు గవర్నర్ శక్తికాంత దాస్ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమిచ్చే నిర్ణయం తీసుకోవచ్చని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మధ్యంతర బడ్జెట్‌లో ప్రభుత్వం ఓటర్లను ఆకర్షించే విధంగా పలు ప్రకటనలు చేసింది. ప్రధాని మోదీ రుణ వితరణ పెరగడానికి, వృద్ధిరేటు పుంజుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. శక్తికాంత దాస్ వృద్ధికి ఊతమిచ్చేలా వడ్డీ రేట్ల తగ్గింపునకు ప్రాధాన్యం ఇవ్వవచ్చు. పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ తటస్థంగా వ్యవహరించే అవకాశమూ లేకపోలేదని మరికొంత మంది ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. రెపో రేటును ప్రస్తుత స్థాయి వద్దనే ఉంచే అవకాశం ఉందంటున్నారు. శక్తికాంత దాస్‌కు గురువారం నాటి పరపతి విధాన ప్రకటన కత్తి మీద సాము లాంటిదేనని అంటున్నారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధికి మద్దతు ఇస్తూనే ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసే విధంగా నిర్ణయం తీసుకోవడం అంత ఆషామాషీ కాదంటున్నారు.

- ద్రవ్యోల్బణం, చమురు ధరల్లో తగ్గుదల సానుకూలంగా ఉంటే కన్స్యూమర్ డ్యూరబుల్స్, నాన్ డ్యూరబుల్స్ డిమాండ్‌లో మందగమనం, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధి నెమ్మదించడం వంటివి ప్రతికూలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కీలక రేట్ల తగ్గింపునకు అవకాశాలు కనిపిస్తున్నాయని ఎల్ అండ్ టీ ఫైనాన్స్ హోల్డింగ్స్ గ్రూప్ చీఫ్ ఎకనామిస్ట్ రూపా రేగే నిత్సూర్ పేర్కొన్నారు.
- బడ్జెట్, భావి ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుంటే ఈ ఏడాదిలో రేట్ల తగ్గింపు ఉండకపోవచ్చని డీబీఎస్ ఆర్థికవేత్త రాధికా రావు అంటున్నారు. వినియోగానికి ఊతం, ఉద్దీపన వంటివి వృద్ధికి సానుకూలమైనవే కానీ ఇలాంటివి వడ్డీ రేట్ల తగ్గింపునకు అవకాశాలను పరిమితం చేస్తుంటాయని చెప్పారు.
- మక్వేరీ, నోమురా వంటి బ్రోకరేజ్ సంస్థలు సిటీ గ్రూప్, డీబీఎస్ బ్యాంక్‌ల్లోని ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ బృందాలు వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి.
- అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధ వాతావరణం వల్ల చైనాలో, బ్రెగ్జిట్ వల్ల యూరప్‌లో మందగమనం నెలకొంది. వ్యాపారం, వాణిజ్యం పట్ల ఆందోళనలు కొనసాగుతున్నాయి. భారత్‌లో ప్రైవేటు పెట్టుబడులు తగ్గుతున్నందు వల్ల ఆర్థిక వ్యవస్థలో వృద్ధికి కొంత ఊతం అవసరం. శక్తికాంత దాస్ రెపో రేటు తగ్గింపునకు ప్రాధాన్యం ఇవ్వవచ్చని ఎస్‌బీఐ గ్రూప్ ముఖ్య ఆర్థిక సలహాదారు సౌమ్య కాంతి ఘోష్ చెబుతున్నారు.

కేర్ రేటింగ్స్ ఏమంటోందంటే..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో ప్రకటిస్తున్న చివరి ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష ఇది. అందులోనూ ఆర్‌బీఐ పగ్గాలు చేపట్టిన శక్తికాంత దాస్‌కు మొదటిది. ఈ నేపథ్యంలో ఆయన మార్క్ నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. ఆర్‌బీఐ తన విధానాన్ని తటస్థానికి మార్చుకోవచ్చు. వరుసగా ఐదు నెలల కాలంలో ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్ష్యానికి దిగువనే ఉంది. అయితే ప్రధాన ద్రవ్యోల్బణం మాత్రం ఇంకా ఐదు శాతం స్థాయిలో ఉంది. అందుకే రేపో రేటు విషయంలో ప్రస్తుత స్థాయినే కొనసాగించవచ్చు. రానున్నకాలంలో ద్రవ్యోల్బణం పెరిగే సంకేతాలు కనిపిస్తున్నాయి. రైతులకు ఆదాయ మద్దతుతోపాటు వడ్డీ రాయితీ, పన్ను మినహాయింపులను బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ద్రవ్యోల్బణం పెరుగుదలకు అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒపెక్ సభ్య దేశాలు ముడిచమురు సరఫరాను తగ్గించే అవకాశం ఉన్నందు వల్ల చమురు ధరలు మళ్లీ పెరగవచ్చు. వచ్చే ఎన్నికల సందర్భంగా వ్యయాలు పెరిగితే ద్రవ్యోల్బణం పెరిగేందుకు దండిగా అవకాశాలున్నాయి. ఇలాంటి అంశాలు ఆర్‌బీఐ విధాన నిర్ణయాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది.

'జీ'లో సగం వాటా విక్రయం!


మదుపర్లతో ప్రమోటర్ల చర్చలు

» ఏప్రిల్‌లోగా ఉపసంహరించే అవకాశం

» 6% పెరిగిన షేరు

న్యూఢిల్లీ: ఎస్సెల్ గ్రూపు ప్రధాన కంపెనీ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజ్ (జెడ్ఈఈఎల్)లో సగానికి పైగా వాటా విక్రయించేందుకు ప్రమోటర్లు సిద్ధమయ్యారు. ఇందు కోసం పలువురు మదుపర్లతో చర్చలు జరుపుతున్నారని కంపెనీ సీనియర్ అధికారి తెలిపారు. తద్వారా సమకూరే నిధులతో ప్రమోటర్లు రుణ భారాన్ని తగ్గించుకునే యోచనలో ఉన్నారు. ఎస్సెల్ గ్రూపు ప్రధాన ప్రమోటరైన సుభాష్ చంద్రతోపాటు ఇతరులు కంపెనీలో సగానికి పైగా వాటా విక్రయించాలనుకుంటున్నట్లు గత నవంబరులోనూ వార్తలు వచ్చాయి. 'వాటా విక్రయంపై మా వైఖరిలో మార్పులేదు. కాకపోతే సగానికి పైగా వాటా కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చే వారి ఆఫర్‌నే పరిశీలిస్తాం" అని ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా మార్కెట్ విశ్లేషకులతో జరిగిన కాల్ కాన్ఫరెన్స్‌లో జెడ్ఈఈఎల్ ఎండీ, సీఈఓ పునీత్ గోయెంకా స్పష్టం చేశారు. డిసెంబరు 31 నాటికి కంపెనీలో ప్రమోటర్ల వాటా 41.62 శాతం ఉంది. వాటా విక్రయం విషయంలో ప్రమోటర్ల వైఖరిలో మార్పులేదన్న వార్తల నేపథ్యంలో జెడ్ఈఈఎల్ షేర్లు భారీగా పుంజుకున్నాయి. బుధవారం బీఎస్ఈలో ట్రేడింగ్ ముగిసేసరికి కంపెనీ షేర్ల ధర 6.20 శాతం బలపడి రూ.387.95కు చేరుకుంది. ఇంట్రాడేలోనైతే షేర్లు 8.50 శాతం వరకు లాభపడ్డాయి.

రుణ భారం తగ్గించుకునేందుకు వెసులుబాటు



ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ఎస్సెల్ గ్రూపునకు రుణదాతలు కొంత ఊరట కల్పించారు. సెప్టెంబరు కల్లా రుణ భారాన్ని తగ్గించుకునేందుకు సమయం కల్పించారు. షేర్లు తనఖా పెట్టి తీసుకున్న రుణాలను అప్పటివరకు డిఫాల్ట్‌గా ప్రకటించకుండా ఉండేలా గత నెల 27న సుభాష్ చంద్ర రుణదాతల నుంచి హామీ పొందారు. రుణాల కోసం ఎస్సెల్ గ్రూపు తన కంపెనీలకు చెందిన రూ.13,500 కోట్ల ఈక్విటీ షేర్లను తనఖా పెట్టింది. రుణ భారాన్ని తగ్గించుకునేందుకు పలు వ్యూహాలపై కసరత్తు చేస్తున్న ప్రమోటర్లు.. ఏప్రిల్‌లోగా ప్రధాన కంపెనీలో మెజారిటీ వాటాను ఉపసంహరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

గత వారం రూ.1,050 కోట్ల షేర్ల విక్రయం

జనవరి 25 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు ఎస్సెల్ గ్రూప్‌నకు చెందిన కంపెనీలు ఆరు లిస్టెడ్ కంపెనీలకు చెందిన రూ.1,050 కోట్ల విలువైన షేర్లను బహిరంగ మార్కెట్లో విక్రయించాయి.. రుణాల డిఫాల్ట్‌ను వాయిదా వేసేందుకు కొందరు రుణదాతలు అంగీకరించకపోవడంతో.. వారికి బకాయిలు చెల్లించేందుకే ఎస్సెల్ గ్రూపు ఈ షేర్లను విక్రయించినట్లు తెలుస్తోంది. ఎస్సెల్ గ్రూపు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న మాట వాస్తవమేనని చైర్మన్ సుభాష్ చంద్ర గత నెల 25న విడుదల చేసిన బహిరంగ లేఖలో స్పష్టం చేశారు. ఇన్‌ఫ్రా రంగంలో దూకుడుగా పెట్టుబడులు పెట్టడం, వీడియోకాన్ గ్రూపు డీ2హెచ్ వ్యాపారాన్ని కొనుగోలు చేయడం తమ గ్రూపు కొంప ముంచిందని ఆయన లేఖలో వెల్లడించారు.

మ్యూచువల్ ఫండ్‌ల మద్దతు

ఎస్సెల్ గ్రూపు డిబెంచర్ ట్రస్ట్ డీడ్ల నిబంధనలు, షరతులను సవరించాలంటూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి 'సెబీ'ని పలు మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్)లు కోరినట్లు తెలుస్తోంది. తద్వారా ఈ గ్రూపు వ్యూహాత్మక పెట్టుబడిదారులతో ఒప్పందం కుదుర్చుకునేందుకు అవకాశం లభిస్తుందని.. లేని పక్షంలో ఈ సెక్యూరిటీల ధర తగ్గిన పక్షంలో తనఖా పెట్టిన షేర్లను విక్రయించాల్సి వస్తుందని ఎంఎఫ్‌లు అంటున్నాయి. సాధారణంగా ఏదేని కంపెనీ డిబెంచర్ల జారీకి ముందే వాటిలో పెట్టుబడులు పెట్టబోయే ఇన్వెస్టర్ల ప్రయోజనాలను రక్షించేందుకు ట్రస్టీలను నియమిస్తుంది. ఇందుకు సంబంధించిన నిబంధనలు, షరతులతో కూడిన పత్రమే డిబెంచర్ ట్రస్ట్ డీడ్.

ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి 'ఎఫ్‌డీ ఎక్స్‌ట్రా'

హైదరాబాద్ : ఐసీఐసీఐ బ్యాంక్ 'ఎఫ్‌డీ ఎక్స్‌ట్రా' పేరుతో కొత్త టర్మ్ డిపాజిట్ పథకాన్ని ప్రారంభించింది. జీవితంలో పలు దశల అవసరాలు తీర్చడంతో పాటు వినియోగదారుల లక్ష్యాలైన జీవిత బీమా, గృహ లేదా కారు రుణాల సమయంలో డౌన్ పేమెంట్స్, రిటైర్‌మెంట్ ప్లానింగ్, చైల్డ్ ఎడ్యుకేషన్, వినోద పర్యటన వంటి అవసరాలు తీర్చేలా ఈ డిపాజిట్ పథకాన్ని రూపొందిచారు. కొద్ది రోజుల్లో ఈ డిపాజిట్ పథకం వినియోగదారులకు అందుబాటులోకి వస్తుందని ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది. ఎఫ్‌డీ ఎక్స్‌ట్రా టర్మ్ డిపాజిట్లను ఎఫ్‌డీ లైఫ్‌గా పిలుస్తారు. కనీసం రూ.3 లక్ష డిపాజిట్‌ను రెండేళ్ల పాటు ఉంచే డిపాజిట్‌దారులకు, ఒక సంవత్సరం పాటు ఉచితంగా జీవిత బీమా కూడా లభిస్తుంది.

స్విఫ్ట్.. స్ప్లెండర్ ప్లస్‌లకు అత్యంత ప్రజాదరణ: డ్రూమ్

న్యూఢిల్లీ: వాహనాల క్రయ, విక్రయాలకు అవకాశం కల్పించే ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్ కంపెనీ డ్రూమ్.. గత ఏడాది దేశీయ ఆటోమొబైల్ ఇండస్ట్రీ ట్రెండ్స్‌పై నివేదిక విడుదల చేసింది. కొనుగోలుదారుల ప్రాధాన్యాల్లో మారుతి సుజుకీ స్విఫ్ట్ కారు, హీరో స్ప్లెండర్ ప్లస్ బైక్‌లు మొదటి స్థానాల్లో నిలిచాయని డ్రూమ్ తెలిపింది. లగ్జరీ వాహనాల విషయానికొస్తే.. హ్యార్లే డేవిడ్‌సన్ స్ట్రీట్ 750 బైక్, బీఎమ్‌డబ్ల్యూ 5 సీరీస్ కారు అత్యంత ప్రజాదరణ కలిగిన మోడళ్లుగా నిలిచాయంది. ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్, పుణె నగరాలు తమ ప్లాట్‌ఫామ్‌కు ఐదు అతిపెద్ద మార్కెట్లని డ్రూమ్ తెలిపింది.

358.42 సెన్సెక్స్	128.10 నిఫ్టీ	బంగారం	వెండి (కిలో)	రూపాయి (ఒక డాలరుకు)	ముడి చమురు
36,975.23	11,062.45	33,335	40,040	71.56	61.57
		ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత) 15	275	1 పైసె	

పెప్స్ పెన్నార్ ఆదాయంలో 33% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన మూడు నెలలకు పెన్నార్ ఇంజినీర్డ్ బిల్డింగ్ సిస్టమ్స్ (పెప్స్ పెన్నార్) రూ.154.21 కోట్ల నికర ఆదాయాన్ని ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే కాలం ఆదాయం కంటే రూ.38.30 కోట్లు (33.04 శాతం) ఎక్కువని కంపెనీ వెల్లడించింది. సమీక్ష త్రైమాసికానికి నికర లాభం 29.44 శాతం వృద్ధితో రూ.0.62 కోట్ల నుంచి రూ.2.72 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలలకు రూ.401.94 కోట్ల ఆదాయంపై రూ.5.17 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ప్రకటించిందని పెప్స్ పెన్నార్ వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ స్ట్రాటజీ) కేఎం సునీల్ తెలిపారు.

విమ్టా ఆదాయం రూ.51 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి విమ్టా లాబ్స్ రూ.5.11 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం లాభం రూ.5.97 కోట్లతో పోల్చితే తగ్గింది. సమీక్ష త్రైమాసికానికి మొత్తం ఆదాయం రూ.46.81 కోట్ల నుంచి రూ.50.70 కోట్లకు చేరిందని కంపెనీ వెల్లడించింది.

11000 పైన నిలకడ అవశ్యం

టెక్ వ్యూ

నిఫ్టీ పాజిటివ్ ధోరణిలో ప్రారంభమై కీలక నిరోధం 11000 వరకు వెళ్లి ఆ స్థాయి కన్నా పైన క్లోజింగ్ ఇచ్చింది. ఆ తర్వాత మరింత ఫోరిమెంతో 128 పాయింట్ల లాభంతో డే గరిష్ఠ స్థాయిలో ముగిసింది. మూడు నెలలుగా ఎన్నో విఫల ప్రయత్నాలు చేసిన ఇండెక్స్ చివరికి ఈ మానసిక అవధి కన్నా పైన క్లోజ్ కాగలిగింది. ఈ ప్రధాన బ్రేకౌట్ కారణంగా ఇప్పుడు షార్ట్‌టర్మ్ రియాక్షన్ ఏర్పడే ఆస్కారం ఉంది. అలాగే వచ్చే రోజులుగా నిరంతర అప్‌ట్రెండ్‌లో ఉన్న కారణంగా టెక్నికల్‌గా కూడా కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు. అప్రమత్తంగా ఉండాలి.

గురువారం స్థాయిలివే...

నిరోధం : 11100 మద్దతు : 11000

- ప్రధాన నిరోధం 11100. మరింత అప్‌ట్రెండ్ కోసం అంతకన్నా పైన పటిష్ఠంగా క్లోజ్ కావాలి. మరో ప్రధాన నిరోధం 11200. ఇదే ఇప్పటివరకు ఏర్పడిన గరిష్ఠ స్థాయి.
- పుల్‌బ్యాక్‌లో ప్రధాన మద్దతు స్థాయి 11000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. అంతకన్నా దిగువ రితే స్వల్పకాలిక కరెక్షన్ ముప్పు ఉంటుంది.

■ వి.సుందర్ రాజా

సాధారణంగా మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి: మాఘ శుక్ల తదియ
నక్షత్రం: శతభిషం, పూర్వాభాద్ర

ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి/అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, మీన, కర్కాటక రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ: 11062.45 (+128.10)
ట్రెండ్ మార్పు వేళలు: 12.07 గంటలు

ధోరణి: నిఫ్టీ ఫ్యూచర్ నిలకడగా ప్రారంభమై 10.05 నుంచి 11.40 వరకు నిస్తేజంగా ట్రేడ్ కావచ్చు. అదే ధోరణిలో ట్రేడవుతూ తదుపరి 1.45 వరకు, తిరిగి దిగలాయం మెరుగ్గా ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 1.10 నుంచి 3.15 వరకు మెరుగ్గా ఉంటూ చివరిలో మరో సారి నిస్తేజం అయ్యే ఆస్కారం ఉంది. ఆర్‌బిఐ పాలసీ మార్కెట్ కదలికను నిర్దేశిస్తుంది.

ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్ 10.15 సమయానికి ప్రారంభ స్థాయి/గనుక (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 11.40 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.15 తర్వాత ఎటిపి కన్నా పైన లాంగ్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 11105, 11140
మద్దతు స్థాయిలు : 11025, 10990

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in



నిఫ్టీ @ 11,000

ఆర్‌బీఐ పాలసీపై ఆశలతో జోరు

5 నెలల గరిష్ఠ స్థాయికి దూసుకెళ్లిన సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో వరుసగా ఐదో రోజూ లాభాలు నమోదయ్యాయి. ప్రధాన సూచీలు రెండూ ఐదు నెలల గరిష్ఠ స్థాయి దగ్గర క్లోజయ్యాయి. సెన్సెక్స్ 358.42 పాయింట్ల లాభంతో 36,975.23 వద్ద, నిఫ్టీ 128.10 పాయింట్ల లాభంతో 11,062.45 వద్ద ముగిశాయి. గత ఏడాది అక్టోబరు1 తర్వాత నిఫ్టీ మళ్లీ 11,000 పాయింట్లపైన ముగిసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్ల దన్నుతో ఈ ర్యాలీ కొనసాగింది. గురువారం ఆర్‌బీఐ ప్రకటించే ద్రవ్య పరపతి విధాన సమీక్షలో కీలక వడ్డీ రేట్లు తగ్గించకపోయినా, తటస్థ వైఖరి కొనసాగించే అవకాశం ఉందన్న అంచనాలు, ఈ ర్యాలీకి ప్రధానంగా దోహదం చేశాయి. కొనసాగుతున్న విదేశీ పోర్ట్‌ఫోలియో సంస్థ(ఎఫ్‌పీఐ)ల పెట్టుబడులు సెంటిమెంట్‌ను పెంచాయి. ప్రభుత్వ రుణ పత్రాలపై రాబడులు తగ్గడం, డాలర్‌తో రూపాయి మారకం రేటు స్వల్పంగా కోలుకోవడమూ ఈ ర్యాలీకి దోహదం చేశా యి' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. మెటల్, ఐటీ, ఎనర్జీ, ఆటో, ఫైనాన్షియల్ కంపెనీల ఇండెక్స్‌లు 2.44 శాతం వరకు పెరిగాయి. కన్స్యూమర్ డ్యూరబుల్ ఇండెక్స్ మాత్రమే స్వల్పంగా నష్టపోయింది. సెన్సెక్స్ షేర్లలో యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు కొద్దిపాటి నష్టాలతో ముగిశాయి. టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, ఓఎన్‌జీసీ, బజాజ్ ఆటో, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, కోల్ ఇండియా, రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీల షేర్లు 4.34 శాతం వరకు లాభాలు నమోదు చేశాయి.

అడాగ్ షేర్లలో ఆగని పతనం

అనిల్ అంబానీ సారథ్యంలోని అడాగ్ గ్రూప్ కంపెనీల షేర్లలో పతనం కొనసాగుతోంది. బుధవారం ఈ గ్రూప్‌లోని రిలయన్స్ ఇన్‌ఫ్రా కంపెనీ షేర్లు బీఎస్ఈలో 32.22 శాతం నష్టపోయి రూ.154 వద్ద ముగిశాయి. ఆర్‌కామ్ షేర్లు ఒక దశలో 11 శాతం నష్టంతో రూ.4.85 కనిష్ఠ స్థాయిని తాకాయి. చివరికి 0.74 శాతం స్వల్పలాభంతో రూ.5.48 వద్ద ముగిశాయి. రిలయన్స్ పవర్ కంపెనీ షేర్లు ఇంట్రాడేలో ఒక దశలో 14 శాతం నష్టపోయినా తర్వాత కోలుకుని 6.69 శాతం లాభంతో రూ.12.75 దగ్గర ముగిశాయి. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ (8.28 శాతం), రిలయన్స్ (5.73 శాతం) కంపెనీల షేర్లూ నష్టాల బాట పట్టాయి. ఇదే గ్రూప్‌నకు చెందిన రిలయన్స్ నిప్పాన్ లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ షేర్లు మాత్రం 17.35 శాతం లాభంతో రూ.161 దగ్గర క్లోజయ్యాయి.

నెలాఖర్లో మజగావ్ డాక్ పబ్లిక్ ఇష్యూ

ఈ నెలాఖర్లో ప్రభుత్వ రంగంలోని మజగావ్ డాక్ కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఈ ఇష్యూ ద్వారా రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్లు సమీకరించాలని ఈ రక్షణ రంగ సంస్థ భావిస్తోంది. గత ఏడాది ఆగస్టులోనే సెబీ నుంచి ఈ ఐపీఓకు ఆమోదం లభించింది.

టెక్ మహీంద్రా షేర్లలో ర్యాలీ

మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల దన్నుతో టెక్ మహీంద్రా కంపెనీ షేరు కొత్త గరిష్ఠ స్థాయికి చేరాయి. బీఎస్ఈలో ఈ కంపెనీ షేరు ఒక దశలో రూ.814 ఆల్‌టైమ్ హై స్థాయికి చేరాయి. చివరికి 8.13 శాతం లాభంతో రూ.811 వద్ద క్లోజయ్యాయి.

వొడా-ఐడియా నష్టం రూ.5 వేల కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద టెలికాం సంస్థ వొడాఫోన్-ఐడియా నష్టాలు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం(అక్టోబరు-డిసెంబరు)లో సంస్థ రూ.5,005.7 కోట్ల నష్టం ప్రకటించింది. వొడాఫోన్, ఐడియా కంపెనీల విలీనం గత ఏడాది ఆగస్టు 31న పూర్తయింది. కాబట్టి తాజా గణాంకాలను వార్షిక ప్రాతిపదికన పోల్చలేమని సంస్థ అంటోంది. అయితే రెండో త్రైమాసికంతో పోల్చినా నష్టాలు మరింత పెరిగాయి. డిసెంబరుతో ముగిసిన మూడు నెలల్లో వొడా-ఐడియా మొత్తం ఆదాయం రూ.11,982.80 కోట్లుగా నమోదైంది. జులై-సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఆర్జించిన రూ.7,878.60 కోట్ల ఆదాయంతో పోల్చితే 52 శాతం పెరిగింది. సమీక్షాకాలంలో సంస్థ చేపట్టిన చర్యలు ఆశాజనక ఫలితాలిస్తున్నాయని, నెట్‌వర్క్‌తో పాటు ఇతర సంస్థల ఇతర కార్యకలాపాలు, సేవల అనుసంధానం అంచనా కంటే వేగంగా జరుగుతున్నదని వొడాఫోన్ ఐడియా సీఈఓ బాలేష్ శర్మ తెలిపారు. కీలక మార్కెట్లలో తమ అగ్ర స్థానాన్ని నిలబెట్టుకునేందుకు 4జీ నెట్‌వర్క్‌‌పైనా కసరత్తు [illegible] రించడంపై సంస్థ దృష్టిసారించిందన్నారు.

నష్టాలు తగ్గించుకున్న అలహాబాద్ బ్యాంక్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని అలహాబాద్ బ్యాంక్ డిసెంబరు ముగిసిన మూడో త్రైమాసికంలో నష్టాల భారం తగ్గించుకుంది. గత ఏడాది మూడో త్రైమాసికంలో రూ.1,263.79 కోట్లున్న బ్యాంక్ నష్టాలు, ఈ ఆర్థిక సంవత్సరం (2018-19) మూడో త్రైమాసికంలో రూ.732.81 కోట్లకు తగ్గాయి. ఇదే కాలంలో బ్యాంక్ స్థూల ఆదాయం రూ.4,755.33 కోట్ల నుంచి స్వల్పంగా పెరిగి రూ.4,756.88 కోట్లకు చేరింది. మొత్తం రుణాల్లో స్థూల మొండి బకాయి (ఎన్‌పీఏ)ల వాటా 15.48 శాతం నుంచి (రూ.23,260.81 కోట్లు) నుంచి 17.81 శాతానికి (రూ.28,218.79 కోట్లు) చేరాయి.

అదానీ పోర్ట్స్ లాభంలో 42% వృద్ధి

ఆర్థిక ఫలితాలు

అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ (ఏపీసెజ్) అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో రూ.1,418.93 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఆర్జించిన లాభం రూ.1,001 కోట్లతో పోల్చితే ఇది 41.75 శాతం అధికం. ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.2,924.85 కోట్ల నుంచి రూ.3,168.88 కోట్లకు పెరిగింది. వ్యయాలు రూ.1,347.97 కోట్లకు చేరాయి. బొగ్గు, ముడి చమురు, కంటైనర్, ఇతర బల్క్ ఎగుమతులన్నీ ఏప్రిల్-డిసెంబరు తొమ్మిది నెలల మధ్య కాలంలో రెండంకెల వృద్ధిని నమోదు చేశాయని, వివిధ విభాగాలకు చెందిన వస్తువుల రవాణాపై దృష్టిని కేంద్రీకరించే వ్యూహాన్ని తాము కొనసాగించడంతో పాటు ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలకు కూడా వస్తువులు చేరవేసేందుకు ప్రయత్నిస్తామని కంపెనీ సీఈఓ, హోల్‌టైమ్ డైరెక్టర్ కరణ్ అదానీ తెలిపారు.

తగ్గిన అదానీ పవర్ నష్టాలు

అదానీ పవర్ నష్టాలు మూడో త్రైమాసికంలో రూ.1,313.74 కోట్ల నుంచి రూ.1,180.78 కోట్లకు తగ్గాయి. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.4,916.34 కోట్ల నుంచి రూ.6,677.11 కోట్లకు పెరిగింది. కంపెనీ నిర్వహణలోని విద్యుత్ ప్లాంట్ల సామర్థ్య వినియోగం 73 శాతం ఉన్నట్టు కంపెనీ తెలిపింది. తమ ప్రాజెక్టుల నగదు ప్రవాహానికి అవరోధంగా ఉన్న నియంత్రణాపరమైన సమస్యల పరిష్కారం వేగంగా జరుగుతున్నదని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ అన్నారు. గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్‌లలోని నాలుగు విద్యుత్ ప్లాంట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 10,440 మెగావాట్లని కంపెనీ తెలిపింది.

లుపిన్‌కు కేటాయింపు దెబ్బ

రక్తపోటు చికిత్సలో ఉపయోగించే పెరిన్‌డోప్రిల్ ఔషధానికి సంబంధించి యూరోప్‌లో ఏర్పడిన వివాద పరిష్కారానికి రూ.342.22 కోట్లు కేటాయించాల్సిరావడం లుపిన్ లాభాలను దెబ్బతీసింది. డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ రూ.151.75 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. గత ఏడాది డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ రూ.221.73 కోట్ల లాభం ఆర్జించింది. ఇదే కాలంలో ఆదాయం రూ.3,900.36 కోట్ల నుంచి రూ.4,377.94 కోట్లకు పెరిగినట్టు కంపెనీ ప్రకటించింది. పెరిన్‌డోప్రిల్ సంబంధించి 2014లో యూరోపియన్ కమిషన్ విధించిన 4 కోట్ల యూరోల జరిమానాను సవాలు చేస్తూ దాఖలు చేసిన అప్పీలుపై డిసెంబరు 12న తీర్పు ఇచ్చిన జనరల్ కోర్టు ఈ మొత్తం చెల్లించాల్సిందేనని తేల్చి చెప్పడంతో తాము కేటాయింపులు చేసుకోక తప్పని పరిస్థితి ఏర్పడిందని, దాంతో 4 కోట్ల యూరోలకు వడ్డీ కలిపి 4.28 కోట్ల యూరోల (రూ.342.22 కోట్లు) కేటాయించినట్టు కంపెనీ తెలిపింది. ఆ మొత్తాన్ని కంపెనీ అసాధారణ వ్యయాల్లో చూపింది.

సిప్లా లాభంలో క్షీణత

ఔషధ దిగ్గజం సిప్లా డిసెంబరు త్రైమాసికంలో రూ.322.24 కోట్ల లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.403.45 కోట్లతో పోల్చితే ఇది 20 శాతం తక్కువ. మొత్తం కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.4007.54 కోట్లకు చేరింది. రానున్న త్రైమాసికాల్లో మంచి వృద్ధిని సాధించడం పైనే తాము దృష్టి కేంద్రీకరిస్తున్నామని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఉమంగ్ వోహ్రా తెలిపారు. కొత్త ఔషధాల విడుదలతో ఈ త్రైమాసికంలో తమ అమెరికా వ్యాపారాల్లో మంచి వృద్ధి ఏర్పడిందని ఆయన అన్నారు. టాబ్లెట్ల తర్వాత కొనసాగనున్న రోగులకు ఉపయోగపడే ఔషధాలపై దృష్టి కేంద్రీకరించాలనుకుంటున్నట్టు ఆయన చెప్పారు.

బీఎస్‌ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ఎన్ఎస్ఈ-500 — షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	34,330	33,700	34,370	33,540	33,290
క్రితం ముగింపు	34,480	33,760	34,390	33,700	33,280
22 క్యారెట్లు	31,780	31,250	31,620	31,120	31,820
క్రితం ముగింపు	31,930	31,300	31,630	31,240	31,810
వెండి (కిలో)	41,400	41,600	41,200	41,500	43,600
క్రితం ముగింపు	41,700	41,900	41,500	41,500	44,000

రిటైల్ (ఒక గుడ్డు ధర రూ. 4.65 | నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	406	చిత్తూరు	443
వరంగల్	408	చెన్నై	450
విజయవాడ	406	నమక్కల్	430
గోదావరి	406	బెంగళూరు	435
విశాఖపట్నం	416	ముంబై	459

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. | వెంకాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	70	విజయవాడ	75
కరీంనగర్	71	గుంటూరు	76
వరంగల్	70	ఒంగోలు	77
మహబూబ్‌నగర్	70	చిత్తూరు	88
కర్నూలు	70	నెల్లూరు	88
విశాఖపట్నం	78	అనంతపురం	89
గోదావరి	72		

మా కోసం మీరు.. మీతో మేము



ఎంబీసీల చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అత్యంత వెనుకబడిన తరగతుల సంక్షేమ-అభివృద్ధి సంస్థ రూపొందించిన 'మా కోసం మీరు-మీతో మేము' పోస్టర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. సంస్థ అధ్యక్షుడు కాకి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన 'ప్రచార రథాలను' కూడా బుధవారం ఉండవల్లిలోని తన నివాసం వద్ద సీఎం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జయహో బీసీ సభలో ప్రకటించిన పథకాల పట్ల బీసీ నేతలు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. 'మాకోసం మీరు-మీతో మేము' నినాదంతో ఈ ప్రచార రథాలు రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ప్రచారం నిర్వహిస్తాయని గోవిందరెడ్డి సీఎంకు వివరించారు. ప్రచార రథాలు జిల్లాల్లో ప్రవేశించినప్పుడు ఆ జిల్లా కార్యకర్తలు ప్రచారంలో పాల్గొంటారన్నారు. బీసీల అభివృద్ధికి సీఎం చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. ప్రచార రథంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా పథకాలను ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

అవార్డులే అభివృద్ధికి నిదర్శనం



అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదర్శనను తిలకిస్తున్న చంద్రబాబు

▸▸ రాష్ట్రానికి 670 రావడం సంతోషకరం: సీఎం

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన జాతీయ, అంతర్జాతీయ అవార్డులే మనం చేసిన అభివృద్ధి పనులకు నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గత నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన అవార్డులపై అమరావతి అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను సీఎం బుధవారం తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రానికి 670 అవార్డులు రావడం చాలా సంతోషకరమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పని చేయడం వల్లే ఈ ఫలితాలు వచ్చాయన్నారు. బీజేపీ నాయకులకు రాష్ట్ర అభివృద్ధి అవసరం లేదని, వాళ్లకు రాజకీయాలు మాత్రమే కావాలని ఎద్దేవా చేశారు. కాగా, బడ్జెట్ సమావేశాల సందర్భంగా వివిధ మంత్రిత్వ శాఖలు అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



అశోక్‌బాబు దంపతులను సన్మానిస్తున్న సీఎం, ఎన్జీవో నాయకులు

ఎన్నికలకు ముందే శుభవార్త

▸▸ ఆర్థిక పరిస్థితిని ఉద్యోగులు అర్థం చేసుకోవాలి

▸▸ తెలంగాణ కంటే తక్కువేమీ చేయను: సీఎం

▸▸ ఎన్జీవో మాజీ అధ్యక్షుడు అశోక్‌బాబుకు ఎమ్మెల్సీ

విజయవాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు ముందుగానే ఉద్యోగులకు శుభవార్త చెబుతానని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అన్ని డిమాండ్లు, సమస్యలు తన దృష్టిలో ఉన్నాయని, వాటిలో అవకాశం ఉన్న వాటన్నింటినీ నెరవేరుస్తానని స్పష్టం చేశారు. ఆర్థికమంత్రి, ఉద్యోగ సంఘాల నేతలతో మరోసారి భేటీ అయిన తర్వాత నిర్ణయాన్ని వెల్లడిస్తానన్నారు. బుధవారం రాత్రి విజయవాడ జ్యోతి కన్వెన్షన్ హాల్లో జరిగిన ఏపీ ఎన్జీవో మాజీ అధ్యక్షుడు అశోక్‌బాబు ఆత్మీయ వీడ్కోలు సభలో సీఎం ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఉద్యోగులు అర్థం చేసుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యోగులకు తక్కువ కాకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తానన్నారు. విభజన సమయంలో వారితో సమానంతో 43శాతం ఫిటిమెంట్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయంలో కేంద్రం తనపై కన్నెర్ర చేసిందని, కేంద్రం సహకరించి ఉంటే ఉద్యోగులు ఆశించిన దానికన్నా ఎక్కువగా చేసేవాడినన్నారు. జీడీపీలో ఏపీ దేశంలోనే నంబర్ వన్‌గా ఉండటానికి ఉద్యోగులు రేయింబవళ్లు పడిన కష్టమే కారణమని కొనియాడారు. ఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు అశోక్‌బాబుకు ఎమ్మెల్సీ ఇస్తున్నట్టుగా చంద్రబాబు ప్రకటించారు.

ఢిల్లీ దీక్షకు ఎన్జీవోల మద్దతు

విభజన హామీల అమలు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ఈనెల 11న ఢిల్లీలో సీఎం చంద్రబాబు చేపట్టబోయే దీక్షకు ఎన్జీవోలు మద్దతు తెలిపారు. ఏపీ నుంచి తరలివచ్చి తామూ దీక్షలు పాల్గొంటామని ఎన్జీవో సంఘ నేతలు ప్రకటించారు.



పార్లమెంట్ బయట ఆందోళన చేస్తున్న టీడీపీ ఎంపీలు

కొనసాగిన టీడీపీ నిరసనలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీడీపీ ఎంపీలు చేస్తున్న నిరసనలు కొనసాగాయి. ప్లకార్డులు పట్టుకొని కేంద్రం వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తు బుధవారం పార్లమెంటు ఆవరణలో ఎంపీలు ఆందోళనలు చేశారు.

హోదాపై మళ్లీ పాత పాటే!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే ప్రసక్తి లేదని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల్లో ప్రత్యేక హోదా రాష్ట్రాలకు, సాధారణ కేటగిరి రాష్ట్రాలకు తేడా చూపలేదంటూ మళ్లీ పాత పాటే పాడింది. లోక్‌సభలో బుధవారం తెలుగుదేశం ఎంపీ మురళీమోహన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రణాళికా శాఖ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ ఈ మేరకు జవాబిచ్చారు. హోదా బదులు ఐదేళ్ల వరకు ప్రత్యేక సహాయం అందించడానికి కేంద్రం అంగీకరించిందని, అది 2015-2020 వరకు సంతకాలు చేసిన విదేశీ సహాయ ప్రాజెక్టులకు లభించే నిధుల రూపంలో ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. కాగా.. విభజన చట్టం అమలుపై 18న సమీక్ష ఉంటుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ అహీర్ రాజ్యసభలో వెల్లడించారు.

రాష్ట్రంలో 33 రైల్వే ప్రాజెక్టులకు పనులు

రాష్ట్రంలో 33 రైల్వే ప్రాజెక్టుల పనులు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రాజెన్ గొహైన్ వెల్లడించారు. అమరావతి-గుంటూరు కొత్త లైనును 2017-18 బడ్జెట్‌లో చేర్చామని, అమరావతి మీదుగా ఎర్రపాలెం-నంబూరు సింగిల్ లైనుకు డీపీఆర్ రూపొందించామని, దీనిపై అంతర్ మంత్రిత్వ శాఖ సంప్రదింపులు చేస్తోందని పేర్కొన్నారు.

'రాష్ట్రం వల్లే భోగాపురం ఎయిర్‌పోర్టు ఆలస్యం'

రాష్ట్రప్రభుత్వం బిడ్డింగ్ రద్దు చేయడం వల్లే భోగాపురం ఏయిర్ పోర్టు నిర్మాణం ఆలస్యానికి కారణమని జయంత్ సిన్హా స్పష్టం చేశారు. ప్రైవేటు భాగస్వామ్యంలో ఎయిర్ పోర్టు నిర్మించాలని ఏపీ ప్రభుత్వం భావించిందని, అత్యధిక రెవెన్యూ వాటా ఇస్తామంటూ ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా బిడ్డింగు వేస్తే రాష్ట్రం దాన్ని రద్దు చేసిందని వివరించారు.

మార్చికి అనంతపురం క్లస్టర్ల అప్‌గ్రేడేషన్ పూర్తి

అనంతపురం జిల్లాలోని హిందూపూర్ గ్రోత్ సెంటర్, ఐపీ గొల్లపురం పారిశ్రామిక క్లస్టర్ల అప్‌గ్రేడేషన్ పనులు ఈ ఏడాది మార్చి 31 కల్లా పూర్తవుతాయని కేంద్ర మంత్రి సీఆర్ చౌదరి వెల్లడించారు. విజయనగరం జిల్లా బొబ్బిలి గ్రోత్ సెంటర్ క్లస్టర్ అప్‌గ్రేడేషన్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఏపీలో గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు డీపీఆర్‌లను ఆమోదించామని, రాష్ట్ర ప్రభుత్వం భూమితోపాటు అవసరమైన అనుమతులిస్తే నిధులు విడుదల చేస్తామని గంగారామ్ అహీర్ తెలిపారు.

బుద్దా బెదిరిస్తున్నారు.. కేసు నమోదు చేయండి

▸▸ రాజ్‌నాథ్‌కు జీవీఎల్ ఫిర్యాదు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, ప్రభుత్వ విప్ బుద్దా వెంకన్న తనపై భౌతికదాడి చేస్తామని బెదిరిస్తున్నారని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఫిర్యాదు చేశారు. వెంకన్నపై కేసు నమోదు చేయాలని కోరారు. బుధవారం ఢిల్లీలో ఆయన రాజ్‌నాథ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ట్విటర్ వంటి సామాజిక మాధ్యమాల వేదికగా టీడీపీ నేతలు తనను బెదిరిస్తున్నారని జీవీఎల్ ఆరోపించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ నేతలు హద్దుమీరి మాట్లాడుతున్నారని, బుద్దా వెంకన్న బహిరంగ క్షమాపణ చెబితే ఈ అంశాన్ని ఇంతటితో వదిలేస్తానని చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న తోట, ఆమంచి

ఆమంచితో త్రిమూర్తులు దౌత్యం

▸▸ సీఎంను నేడు కలుస్తా: చీరాల ఎమ్మెల్యే

ఒంగోలు/ద్రాక్షారామ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధిష్ఠానంపై అలక వహించిన ప్రకాశం జిల్లా చీరాల శాసన సభ్యుడు ఆమంచి కృష్ణమోహన్ గురువారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబును కలవనున్నారు. అయితే సీఎం సూచన మేరకు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకున్నారు. బుధవారమే సీఎంను కలవాల్సిన ఆమంచి.. సాయంత్రం త్రిమూర్తులు స్వగ్రామమైన వెంకటాయపాలెం వెళ్లి ఆయనతో చర్చించారు. చీరాల నియోజకవర్గంలో తన వ్యతిరేకికి ఒకటికి రెండు పదవులు ఇవ్వడంతోపాటు, కింది స్థాయిలో కొందరు నాయకుల వ్యతిరేక చర్యలను నిరోధించకపోవడంతో పార్టీ నాయకత్వంపై ఆమంచి గుర్రుగా ఉన్న విషయం విదితమే. మంగళవారం పందిళ్లపల్లిలోని తన స్వగృహంలో అనుచరులతో సమావేశమై అభిప్రాయాలను తెలుసుకున్నారు. చంద్రబాబు, లోకేశ్ జోక్యం, మంత్రి శిద్దా రాఘవరావు చర్చలు జరిపి సీఎంను కలవాలని సూచించిన నేపథ్యంలో..ఆమంచి అప్పటిదాకా తన నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. బుధవారం అమరావతి బయల్దేరారు కూడా. ఈలోపు త్రిమూర్తులు తెరపైకి వచ్చారు. తొలి నుంచి కృష్ణమోహన్‌తో ఆయనకు సాన్నిహిత్యం ఉంది. త్రిమూర్తులు తన కుమారుడి పెళ్లి పనుల నిమిత్తం స్వగ్రామమైన వెంకటాయపాలెంలో ఉన్నారు. అక్కడకు రమ్మని ఆమంచిని ఆహ్వానించారు. ఎమ్మెల్యే బుధవారం సాయంత్రం అక్కడకు చేరుకున్నారు. ఇద్దరూ రెండు గంటలపాటు ఏకాంతంగా మాట్లాడుకున్నారు. అనంతరం ఆమంచి విలేకరులతో మాట్లాడారు. గురువారం ఉదయం ముఖ్యమంత్రిని కలుస్తానని వెల్లడించారు.

పోలీసులకు ప్రలోభాలు

పోలీసుస్టేషన్‌లోకి వెళుతున్న మాగంటి రామారావు; (ఇన్‌సెట్‌లో) రామారావు



▸▸ మైలవరం వైసీపీ నేతల తెగింపు

విజయవాడ, ఆంధ్రజ్యోతి/జి.కొండూరు, ఫిబ్రవరి 6: ఎన్నికలకు ముందే వైసీపీ నేతలు ప్రలోభాలకు దిగారు. ఏకంగా పోలీసు అధికారులకే డబ్బులు ఎరవేసి ఎన్నికల్లో తమకు అనుకూలంగా వ్యవహరించాలని కోరారు. మైలవరం వైసీపీ కన్వీనర్ వసంత కృష్ణ ప్రసాద్ తరఫున ఆయన అనుచరుడు మాగంటి వెంకట రామారావు నేరుగా రంగంలోకి దిగి నియోజకవర్గ పరిధిలోని ఎస్సైలకు డబ్బులు ఇచ్చేందుకు ప్రయత్నించడం సంచలనం రేపుతోంది. తమకు వెంకట రామారావు అనే వ్యక్తి లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారంటూ మైలవరం, జీకొండూరు ఎస్సైలు శ్రీనివాసరావు, ఎండీ అష్ఫక్ బుధవారం ఫిర్యాదు చేయడంతో ప్రలోభాలపర్వం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణ ప్రసాద్ అనుచరుడు వెంకట రామారావు మంగళవారం ఉదయం జి.కొండూరు, మైలవరం పోలీసుస్టేషన్ ఎస్ఐలకు ఫోన్ చేశారు. రానున్న ఎన్నికల్లో కృష్ణ ప్రసాద్‌కు అనుకూలంగా వ్యవహరించాలని కోరారు. ఇందుకుగాను ఆయన డబ్బులు పంపారని, వాటిని అందించేందుకు కలుస్తానని చెప్పారు. డబ్బులు తీసుకునేందుకు ఎస్సైలు తిరస్కరించారు. తమ విధులకు ఆటంకం కలిగించవద్దని వెంకట రామారావును హెచ్చరించారు. ఇదే విషయాన్ని స్టేషన్ జనరల్ డైరీలో నమోదు చేసి, తమ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అదే రోజు మధ్యాహ్నం మాగంటి రామారావు ఆ పోలీసుస్టేషన్లకు వెళ్లి ఎస్సైల గురించి వాకబు చేయగా, వారు అక్కడ లేరని తెలిసింది. దీంతో నేరుగా వారి ఇళ్లకు వెళ్లి డబ్బులు ఇచ్చేందుకు ప్రయత్నించారు. కవర్ తీసుకునేందుకు వారిద్దరూ నిరాకరించారు. తమకు లంచం ఇచ్చేందుకు ప్రయత్నించిన వెంకట రామారావుపై ఉన్నతాధికారుల సూచనల మేరకు బుధవారం మైలవరం, జి.కొండూరు పోలీసుస్టేషన్లలో వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. వెంకట రామారావు పోలీసుస్టేషన్లకు వెళ్లి వాకబు చేసిన ఉదంతానికి సంబంధించిన ఫోన్ డేటా రికార్డులను, సీసీ టీవీ ఫుటేజీలను ఆ ఎస్సైలు సేకరించారు. వాటి ఆధారంగా రామారావుపై కేసు నమోదు చేసినట్టు మైలవరం సీఐ సూరిబాబు తెలిపారు.

ఆది నుంచీ వివాదాలే..

మైలవరం నుంచి మంత్రి దేవినేని ఉమ ప్రాతినిధ్యం వస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో ఆయనను ఓడించాలన్న లక్ష్యంతో వైసీపీ ఆర్థికంగా బలమైన కృష్ణ ప్రసాద్‌ను బరిలోకి దింపుతోంది. ఆరు నెలలుగా ఆయన ప్రచారం నిర్వహిస్తున్నారు. పెద్ద ఎత్తున నియోజకవర్గ ప్రజలకు తాయిలాలనూ అందిస్తున్నారు. పండగల సమయంలో మహిళలకు లక్ష చీరలకు వరకు పంపిణీ చేశారు. గోడ గడియారాలను అందించారు. ఆయన 1999లో నందిగామలో దేవినేని ఉమ చేతిలో ఓటమి పాలయ్యారు. ఈసారి ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో ఆయన భారీగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. కాగా, గత ఏడాది సెప్టెంబరులో గుంటుపల్లిలో వైసీపీ బ్యానర్లను తొలగించిన విషయంలో గుంటుపల్లి కార్యదర్శి నల్లారి నరసింహారావును మాజీ హోం మంత్రి, కృష్ణ ప్రసాద్ తండ్రి వసంత నాగేశ్వరరావు ఫోన్ చేసి మరీ బెదిరించిన సంగతి తెలిసిందే.

ముందుగానే మోదీ విశాఖ పర్యటన?

విశాఖపట్నం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కంటే ముందుగానే ప్రధాని మోదీ విశాఖ పర్యటన ఉండొచ్చని.. అందుకు సిద్ధంగా ఉండాలని బీజేపీ నేతలకు ఢిల్లీ నుంచి సంకేతాలు అందాయి. ఈ నేపథ్యంలో ప్రధాని సభకు ఏయూ మైదానం కేటాయించాలని కోరుతూ బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు ప్రభుత్వానికి లేఖ అందజేశారు. లక్ష మందితో భారీ సభ నిర్వహించాలని పార్టీ నాయకులు భావిస్తున్నారు. వాస్తవానికి ప్రధాని ఈ నెల 16న విశాఖ రావాల్సి ఉంది. ఇప్పుడు ముందే వస్తారంటున్నారు.

క్షవరశాలలకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్

▸▸ డప్పు కళాకారులకు, చర్మకారులకు పింఛన్లపై ఉత్తర్వులు జారీ

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బార్బర్ షాపులకు నెలకు 150 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 150 యూనిట్లకు పైన బిల్లును షాపు యజమానులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ సొమ్మును బీసీ సంక్షేమ శాఖ నుంచి ఇంధన శాఖకు చెల్లించనున్నారు. కాగా.. డప్పు కళాకారులకు యూనిఫాం, గజ్జెలు, డప్పు సెట్ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 30,000 మంది డప్పు కళాకారులకు పింఛను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారి పెన్షన్‌ను రూ.1500ల నుంచి రూ.3 వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీచేశారు. మరోవైపు 20 వేల మంది చర్మకారులకు పెన్షన్‌ను ఇచ్చేందుకు కూడా ఉత్తర్వులు జారీచేసింది. వారికి నెలకు రూ.2 వేల చొప్పున పింఛను ఇస్తారు. దీంతో పాటు 24 వేల మంది చర్మకారులకు సంప్రదాయ పనిముట్లు పంపిణీ చేస్తారు. కాగా, నాలుగు, ఐదు, ఆరు, ఏడు సీట్ల సామర్థ్యం ఉన్న ఆటోలు, గరిష్ఠంగా 3000 కిలోల బరువును మించని తేలికపాటి వాణిజ్య వాహనాలు, వ్యవసాయానికి ఉపయోగించే ట్రాక్టర్లు, వాటి ట్రాలీలపై పన్ను మినహాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

ఎవరితోనూ పొత్తుల్లేవ్!

▸▸ అన్ని స్థానాల్లో ఒంటరి పోరే

▸▸ హోదాపై కాంగ్రెస్, బీజేపీ మోసం

▸▸ బూత్ కమిటీ సభ్యులకు జగన్ పిలుపు

▸▸ తిరుపతిలో సమర శంఖారావం తొలి సభ



తిరుపతిలో కార్యకర్తల సమావేశంలో జగన్

తిరుపతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీతోనూ వైసీపీ పొత్తు పెట్టుకోదని ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ప్రకటించారు. అన్ని స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని తెలిపారు. వైసీపీ ఎన్నికల సమర శంఖారావం పేరిట జిల్లా స్థాయి సన్నాహక సభల్లో భాగంగా తొలి సభను బుధవారం చిత్తూరు జిల్లా రేణిగుంట మండలం కొత్తపాళెం సమీపంలో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా బూత్‌కమిటీ సభ్యులు దీనికి హాజరయ్యారు. వీరినుద్దేశించి జగన్ ప్రసంగించారు. 'ప్రత్యేక హోదా విషయంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ మోసమే చేశాయి. గత ఎన్నికల సమయంలో తిరుపతి వచ్చి.. రాష్ట్రానికి పదిహేనేళ్ల ప్రత్యేక హోదా కొనసాగిస్తామని హామీ ఇచ్చిన నాటి ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోదీ కూడా మోసం చేశారు' అని ఆరోపించారు. ఎన్నికల్లో గెలుపు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు చేయకూడని ప్రతి పనీ చేస్తారని అన్నారు. 'నిరుద్యోగ యువతకు నెలకు రూ.2 వేలు భృతి ఇస్తానని హామీ ఇచ్చి ఐదేళ్లు పట్టించుకోలేదు. తీరా ఎన్నికలు సమీపించేసరికి అది కూడా వచ్చే ఏడాది బడ్జెట్‌లో వేయి రూపాయల భృతి ప్రకటించడం దారుణం. పాదయాత్రలో నేనిచ్చిన హామీలకు, నవరత్నాలకు భయపడిన చంద్రబాబు.. హడావుడిగా మూడు నెలలకోసం సంక్షేమ పథకాలతో ప్రజల్ని మభ్యపెడుతున్నారు. పోలవరం పునాదులు కూడా పూర్తికాకుండానే జాతికి అంకితం చేయడమేంటి? నాలుగేళ్లు బీజేపీతో, పవన్ కల్యాణ్‌తో కలసి రాష్ట్రాన్ని దోచారు. ఇపుడు వారితోనే పోరాడతారట' అని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా కోసం నాలుగున్నరేళ్లు పట్టించుకోలేదని, దాని గురించి ఎవరు మాట్లాడినా కేసులు పెట్టి జైలుపాలు చేసిన చంద్రబాబు ఇపుడు ఎన్నికల ముందు నల్ల చొక్కా వేసుకుని ధర్మపోరాట దీక్ష అంటూ డ్రామా ఆడుతున్నారని జగన్ మండిపడ్డారు. టూరింగ్ టాకీసు ముందు సినిమా మారినప్పుడల్లా పోస్టర్ మారినట్టు వారానికోసారి సీఎం మాట మారుస్తున్నారని విమర్శించారు. 'ఎన్నికల్లో చంద్రబాబు డబ్బులిస్తే తీసుకోవాలని ప్రజలకు చెప్పండి...ఓటు మాత్రం మనస్సాక్షి చెప్పినట్లు వేయమని చెప్పండి' అని సూచించారు. గతంలో ఎన్టీఆర్ టీడీపీ స్థాపించినపుడు ఎన్నికల ప్రచారంలో కిలో బియ్యం రెండు రూపాయలకే పేదలకు అందిస్తామని హామీ ఇస్తే.. అప్పట్లో సీఎంగా ఉన్న కోట్ల విజయభాస్కరరెడ్డి రూ.1.90కే కిలో బియ్యం అందించే పథకాన్ని ప్రవేశపెట్టినా జనం కాంగ్రెస్‌ను నమ్మలేదని చెప్పారు. చంద్రబాబు విషయంలోనూ అదే జరగనున్నదన్నారు.

ఏలూరులో బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తాం: వైసీపీ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 6: ఏలూరులో ఈ నెల 17న జరిగే వైసీపీ బీసీ గర్జనను విజయవంతం చేయాలని ఆ పార్టీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ, జంగా కృష్ణమూర్తి, పిల్లి సుభాష్‌చంద్రబోస్ కోరారు. ఈ సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తామని చెప్పారు. బీసీల్లోని 107 కులాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో గర్జన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వెనుకబడిన కులాలకు, ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంటు చెల్లించాలని జగన్‌ను కోరుతున్నట్టు చెప్పారు. బీసీలను వాడుకుని వదిలివేయడం చంద్రబాబుకు అలవాటేనని, ఎన్నికల ముందు మాత్రమే ఆయనకు బీసీలు గుర్తుకొస్తారని ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి సరైన కేటాయింపులు జరగలేదని విమర్శించారు.



జనసేన సీసీఏ చైర్మన్‌గా పులి శేఖర్

▸▸ కీలక బాధ్యతలు అప్పగించిన పవన్

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జనసేన సెంట్రల్ కమిటీ ఫర్ పార్టీ అఫైర్స్(సీసీఏ) చైర్మన్‌గా పులి శేఖర్‌ను నియమించినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవాసాంధ్రుడైన శేఖర్ అమెరికాలో వందల కోట్ల విలువైన వ్యాపారాన్ని వదులుకొని పార్టీకోసం పని చేసేందుకు నిబద్ధతతో వచ్చారని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం కావడంతో ఆయనలో సామాజిక స్పృహతోపాటు పాలనలో పారదర్శకత ఉండాలనే తపన మెండుగా ఉన్నాయని పేర్కొన్నారు. కాగా, పవన్ ఆలోచనా విధానం, భావజాలం తనను ఎంతో ఆకర్షించాయని, తనకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తానని శేఖర్ పేర్కొన్నారు. 'ఆశాజ్యోతి' సంస్థ ద్వారా ఏటా 5వేల మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వాహకుడైన పులి శేఖర్... మచిలీపట్నం నుంచి 20ఏళ్ల కిందటే అమెరికా వెళ్లి సెటిలయ్యారు. కాగా, జనసేన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులుగా ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పెంటపాటి పుల్లారావు, అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ప్రొఫెసర్ ఎన్.సుధాకర్‌రావు నియమితులయ్యారు. విశ్రాంత ఐపీఎస్ టి.రవికుమార్, ఆయన సతీమణి రమాదేవి జనసేన పార్టీలో చేరారు.

వివరణ ఇస్తారా? కోర్టుకొస్తారా?

▸▸ రాష్ట్ర అధికారులకు హైకోర్టు హెచ్చరిక .. అటవీ ఉత్పత్తుల సేకరణపై నిషేధం కేసు

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల్లోగా కౌంటర్ దాఖలు చేయాల్సిన కేసులో అధికారులు మూడేళ్లు దాటినా స్పందించకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మరో పది రోజుల్లోగా కౌంటర్ దాఖలు చేయకపోతే అటవీశాఖ, సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో పాటు సంబంధిత అధికారులంతా కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందని, ఇదే చివరి అవకాశమని హెచ్చరించింది. గిరిజన ప్రాంతాల్లో పంచాయతీలను విస్తరిస్తూ 2011లో తీసుకొచ్చిన చట్టం కారణంగా అటవీ ఉత్పత్తుల సేకరణకు ఆటంకం ఏర్పడుతోందని, తద్వారా గిరిజనుల జీవనభృతి దెబ్బతింటోందంటూ అటవీ చిన్నతరహా ఉత్పత్తుల సేకరణ సంఘం 2015లో ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ బుధవారం తాత్కాలిక చీఫ్ జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తితో కూడినధర్మాసనం ముందు విచారణకొచ్చింది.

జీవో 43 రద్దుపై తీర్పు రిజర్వు: మైనారిటీ-నాన్ మైనారిటీ ఎయిడెడ్ పాఠశాలల్లో నియామకాలకు సంబంధించి ప్రభుత్వ జోక్యంపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. 1994లో సవరించిన జీవోకు బదులుగా గతేడాది జీవో నం.43 ఇవ్వడంతో ఎయిడెడ్ పాఠశాలల్లో యాజమాన్యాలు స్వేచ్ఛగా సిబ్బందిని నియమించుకునే అవకాశం లేకుండా పోయింది. దీన్ని సవాల్ చేస్తూ యాజమాన్యాలు గతేడాది ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్లపై తాత్కాలిక చీఫ్ జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం బుధవారం విచారించి తీర్పును రిజర్వు చేసింది.

సీఐసీ నియామకంపై నిర్ణయించలేదు: ప్రభుత్వం

ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ) నియామకంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఈ వ్యవహారంలో తగిన ఉత్తర్వులు ఇస్తామని పేర్కొంటూ కేసు విచారణను కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. కాగా.. పశ్చిమ గోదావరి జిల్లాలో 'సర్వ శిక్షా అభియాన్' పథకం ద్వారా పాఠశాలల ఖాతాల్లోకి జమ అవుతున్న నిధులను ప్రభుత్వం అవసరాల నిమిత్తం తన ఖాతాల్లోకి మళ్లిస్తోందంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది.

నమ్మకాన్ని వమ్ము చేయను

▸▸ తండ్రిలేని నాకు సర్వం చంద్రబాబే

▸▸ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా అవినాశ్ ప్రమాణ స్వీకారం

విజయవాడ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): "నా తండ్రి (దేవినేని నెహ్రూ) చనిపోయిన తర్వాత నా జీవితం ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్న దశలో ముఖ్యమంత్రి చంద్రబాబు, యువ నేత, మంత్రి నారా లోకేశ్ వెన్నుతట్టి ధైర్యం చెప్పారు. తండ్రి లేని నాకు అన్నీ తానై చంద్రబాబు రాజకీయంగా ఎంతో ప్రోత్సహిస్తున్నారు. వారి రుణం తీర్చుకోలేనిది. ముఖ్యమంత్రికి నాపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయను. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షునిగా పార్టీకి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తాను. వచ్చే ఎన్నికల్లో టీడీపీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా కృషిచేస్తా" అని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు దేవినేని అవినాశ్ అన్నారు. బుధవారం విజయవాడలో అట్టహాసంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కళా వెంకటరావు ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా కళా వెంకటరావు మాట్లాడుతూ, "రాష్ట్రంలోని 13 జిల్లాలోని యువతను కదిలించి, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన గురుతరమైన బాధ్యత అవినాశ్‌పై ఉంది" అని కళా అన్నారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, "మా కుటుంబ సభ్యుడైన అవినాశ్‌పై నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ పెద్ద బాధ్యతను అప్పగించారు. ఈ చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తన తండ్రి దేవినేని నెహ్రూ ఆశయాలను అవినాశ్ నెరవేరుస్తాడు. 1983 నుంచి ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 'దేవినేని' కుటుంబం నుంచి ఎవరో ఒకరు ఎమ్మెల్యేగా ఉంటూ వస్తున్నాం. చచ్చేదాకా టీడీపీకి, ప్రజలకు రుణపడి ఉంటాం" అని అన్నారు. ఈ సభలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పలువురు హాజరయ్యారు.



అవినాశ్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తున్న కళా వెంకట్రావు



మా సంక్షేమం.. మీ కుట్రలు..

చరిత్రలో నిలిచిపోతాయ్!

- మమతపై దేశమంతా స్పందించింది
- కేసీఆర్, జగన్ మాత్రం కిమ్మనలేదు
- పోలవరం, పట్టిసీమపై కుట్రలు
- కాలువకు గండికొట్టారు
- రాజధానిలో చెరుకుతోట తగులబెట్టారు
- వైసీపీ నీతిమాలిన ప్రతిపక్షం
- ఇలాంటి పార్టీ ఎక్కడా ఉండదు: సీఎం
- గవర్నర్ ప్రసంగ తీర్మానంపై చర్చ



అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు.. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అత్యంత సంతోషాన్నిచ్చాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అభివృద్ధి సంక్షేమంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. 'మా సంక్షేమం.. మీ కుట్రలు చరిత్రలో నిలిచిపోతాయి' అని బీజేపీ, వైసీపీ నేతలనుద్దేశించి అన్నారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలియజేసే తీర్మానంపై బుధవారం జరిగిన చర్చలో ఆయన పాలుపంచుకున్నారు. ఏ రంగాన్ని చూసినా నాలుగున్నరేళ్లలోనే దేశంలోనే మొదటి స్థానానికి వెళ్లామని సీఎం తెలిపారు. '94 లక్షల మంది అక్కచెల్లెళ్లకు పసుపు-కుంకుమ పంపిస్తున్నా. పెద్దకొడుకుగా ఉంటానన్న మాట నిలబెట్టుకుని పింఛను రెండువేల రూపాయలకు పెంచా. నిరుద్యోగ భృతిని మార్చి నుంచే రూ.2 వేలు చేస్తున్నాం. వ్యవసాయాన్ని పండుగగా చేస్తున్నాం. రుణమాఫీ చివరి విడతల మొత్తాన్ని కూడా చెల్లిస్తాం. అన్నదాతా సుఖీభవ కార్యక్రమాన్ని రూ.5వేల కోట్లతో అమలుచేస్తాం' అని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ప్రతిపక్ష వైసీపీ కుట్రలు చేసిందన్నారు. 'వారికి ప్రజలు ఓట్లువేసింది అసెంబ్లీకి రాకుండా ఎగ్గొట్టడానికా? జీతాలు మాత్రం తీసుకుంటున్నారు. సభకు రానివాళ్లకు జీతాలెందుకు? ప్రభుత్వం చేసిన ప్రతి పనినీ అడ్డుకునేందుకు కుట్రలు చేశారు. పోలవరంపై కుట్ర చేశారు. పట్టిసీమ అడ్డుకునేందుకు కుతంత్రం పన్నారు. కాలువకు గండికొట్టారు. అమరావతిపై జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో కేసులు వేశారు. చివరకు రాజధానిలో చెరుకుతోట తగలబెట్టి ప్రభుత్వంపై తోయాలని ప్రయత్నించారు. ఇంత నీతిమాలిన ప్రతిపక్షం మరెక్కడా ఉండదు. చివరకు అమెరికాలో పెట్టుబడుల ఆకర్షణ కోసం మేం వెళ్తే.. అక్కడ కూడా దుష్ప్రచారం చేశారు. రాష్ట్రంలోని అధికారులను బెదిరించారు. కృష్ణా కలెక్టర్‌గా ఉన్నప్పుడు అహ్మద్‌బాబును జైలుకు పంపుతానన్నారు' అని ధ్వజమెత్తారు. 'అవిశ్వాసతీర్మానంపై సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుని అన్ని పార్టీల ఎంపీలను కూడగట్టాం. వైసీపీ మాత్రం మోదీకి వ్యతిరేకంగా మాట్లాడలేక పారిపోయింది. కేసుల భయంతోనే! ఏదో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుచేస్తామని మోదీ దర్శకత్వంలో కేసీఆర్-జగన్ ఒక్కటయ్యారు. కేసీఆర్ రెండు సార్లు మమతా బెనర్జీని కలిసి ఫెడరల్ ఫ్రంట్ అన్నారు. తాజాగా ఆమె మోదీకి వ్యతిరేకంగా చేసిన దీక్షకు దేశమంతా కలిసి వచ్చింది. ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ కూడా మద్దతుగా మాట్లాడారు. కేసీఆర్, జగన్ మాత్రమే మాట్లాడలేదు. అందుకే వాళ్లది ఫెడరల్ ఫ్రంట్ కాదు. ముగ్గురూ మోదీలే. అది మోదీల ఫ్రంట్. ఈ ఫ్రంట్ రాష్ట్ర భవిష్యత్‌ను నాశనం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది' అని విరుచుకుపడ్డారు. మాటల నాయకులు కొట్టుకుపోతారని.. చేతల నాయకులే చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

కన్నకొడుకుగా.. పెద్దకొడుకుగా..

'విభజన తర్వాత రాష్ట్ర పరిస్థితి అగమ్యగోచరం. ఈ 56 నెలలు అధికారులు, మేం రాత్రీపగలు కష్టపడి పనిచేశాం. మేమంతా కష్టపడింది మా కోసం కాదు. ప్రజలందరి బాగుకోసం. రాష్ట్రం బాగుకోసం. మేం చేసిన పనులతో ప్రజలు కూడా సంతోషంగా ఉన్నారు. ఈ రాష్ట్రం నాదనే భావనకు వచ్చారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు గతం కంటే 300 శాతం పెరిగాయి. గుజరాత్‌ను మించిన రాష్ట్రంగా త్వరలోనే అవతరిస్తాం. కన్నకొడుకుగా, పెద్దకొడుకుగా నా మాట నిలబెట్టుకున్నా. పింఛన్లు పెంచి గౌరవం పెంచా. నా పెద్దకొడుకు ఇచ్చాడు. నాకు గౌరవం తెచ్చాడని ఇప్పుడంతా అంటున్నారు. దేశం మొత్తం కలిపి పింఛన్లకు రూ.65 వేల కోట్లు ఖర్చు పెడుతుంటే.. ఒక్క మన రాష్ట్రంలోనే రూ.13,340 కోట్లు ఖర్చుచేస్తున్నాం. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇంత ఖర్చుచేయడం లేదు. రాష్ట్రంలో ఉన్న డ్రైవర్లందరికీ గతంలోనే చంద్రన్న బీమా సౌకర్యం కల్పించాం. ఇప్పుడు డ్రైవర్ల సాధికార సంస్థ ఏర్పాటుచేశాం. నేను కూడా కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని సక్రమంగా నడిపించిన డ్రైవర్‌నే.'

ఉద్యోగులకు ఎన్నో చేశాం

'ప్రభుత్వ ఉద్యోగులను అన్నిరకాలుగా ఆదుకున్నాం. 42 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చాం. పదవీ విరమణ వయసు పెంచాం. 70 ఏళ్లు దాటినవారికి 10శాతం అదనపు పింఛను ఇచ్చాం. అంగన్‌వాడీలు, వీఆర్‌వోలు, వెలుగు సిబ్బంది, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు అందరికీ జీతాలు పెంచాం. కొందరికి మూడు రెట్లు పెంచాం. ప్రతి ఉద్యోగి రాష్ట్రం బాగుకోసం కష్టపడ్డారు. ప్రభుత్వంతో కలిసి పనిచేశారు.'

పిల్లి కళ్లు మూసుకుని..

'పిల్లి కళ్లుమూసుకుని పాలు తాగుతూ తననెవరూ చూడలేదనుకుంటుంది. ఈ ముగ్గురు మోదీల పరిస్థితీ అంతే. ప్రతిపక్ష నేత తునిలో రైలు తగలబెట్టించారు.. మళ్లీ అదే తూర్పుగోదావరి జిల్లాకు వెళ్లి కాపు రిజర్వేషన్లు మా పరిధిలోవి కావని చెప్పారు. పారిశ్రామిక రంగంలో టాటా లాంటివారు 40ఏళ్లకు పైగా కష్టపడుతున్నారు. నేను 40 ఏళ్ల రాజకీయాల్లో ఎప్పుడూ కష్టపడనంతగా ఈ నాలుగున్నరేళ్లలో పడ్డా. రాష్ట్రాన్ని గాడిలో పెట్టా. జీవితాంతం కష్టపడే ఐఏఎస్ అధికారుల జాతకాలను నలుగురితో ఢిల్లీలో కూర్చుని తేల్చేస్తానని మోదీ అంటున్నారు. ఈయన కళాశాలకైనా వెళ్లారో లేదో తెలీదు.

వైద్య పరీక్షల ఖర్చు 570కి తగ్గించాం

'తలసరి వైద్యం ఖర్చు గతంలో రూ.5,770గా ఉండేది. ఎన్టీఆర్ వైద్యసేవ పరిమితిని రూ.5లక్షలకు పెంచాం. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకున్నాం. వైద్య పరీక్షల ఖర్చును రూ.570కి తగ్గించాం. మరోవైపు రాజధాని నిర్మాణం. భూములిచ్చిన రైతులకు మరోసారి ధన్యవాదాలు. రాజధానిలో జరుగుతున్న నిర్మాణాలు ఒకసారి చూసినవారెవరూ విమర్శించలేరు. చూడని కబోధులు మాత్రం విమర్శిస్తారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా అమరావతిని నిర్మిస్తాం.'

ఇప్పుడు మనమే బెస్ట్ బ్రాండ్..

'గతంలో జర్మనీ కంపెనీ వోక్స్‌వ్యాగన్‌తో మాట్లాడి కార్ల తయారీ పరిశ్రమ విశాఖలో పెట్టేందుకు ప్రయత్నించాం. ఈలోపు ప్రభుత్వం మారింది. ఇప్పటి వైసీపీ అధినేత తండ్రే సీఎంగా చేశారు. ఆయన హయాంలో అవినీతికి భయపడి వోక్స్‌వ్యాగన్ పుణే వెళ్లిపోయింది. నాటి మంత్రి బొత్స వైసీపీలో చేరారు. రాష్ట్రానికి చెడ్డపేరు వచ్చింది. దానిని మార్చేశాం. రూ.24వేల కోట్ల పెట్టుబడితో కియాను తెచ్చాం. ఆంధ్ర అంటే ఒక బ్రాండ్‌గా తయారుచేశాం. పాతాళంలో ఉన్న బ్రాండ్‌ను పైకి తీశాం. ఎంతో కష్టపడితే కియా వచ్చింది. బీజేపీ వాళ్లు మేమే తెచ్చామంటున్నారు. వీళ్లు తేవడం కాదు.. చెడగొట్టకుండా ఉంటే చాలు'

ఎక్కడా చేయనంతగా రుణమాఫీ..

రైతులకు ఏ రాష్ట్రంలోను చేయనంతా రూ.1.5లక్షల చొప్పున రుణమాఫీ చేశాం. సంపన్నరాష్ట్రం తెలంగాణలో రూ.లక్షే మాఫీ చేశారు. వ్యవసాయ రంగంలో నాలుగేళ్లలో సగటున 11% వృద్ధి సాధించాం. దేశంలోనే ఇంత వృద్ధి రేటు సాధించిన రాష్ట్రం లేదు. రాబోయే కాలంలో వ్యవసాయంలో 15% వృద్ధి సాధించే దిశగా వెళ్తాం. మోదీ రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్నారు. కానీ మాటలకే పరిమితమయ్యారు. మేం చేసి చూపించాం. కౌలు రైతులకు వడ్డీలేని రుణాల కింద రూ.9,211 కోట్లు కేటాయించాం. 11,564 ట్రాక్టర్లను పంపిణీ చేశాం. వచ్చే ఏడాది 12,217 ట్రాక్టర్లు ఇస్తాం. పశుగ్రాసం పెంపకానికి, పశువుల కొనుగోలుకు డబ్బులిచ్చాం. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పశువులు ఇక్కడ అలవాటు పడేవరకు పశువుల ఆస్పత్రిలో ఉంచి, చూసేందుకు ఒక అధికారిని ఏర్పాటుచేశాం. గతంలో నీటికోసం ఎప్పుడూ గొడవలు జరిగేవి. రాష్ట్రాల మధ్య, ప్రాంతాల మధ్య ఏటా పంచాయతీ ఉండేది. ఆ జలజగడాల నుంచి జలభద్రత కల్పించే స్థాయికి వచ్చాం. 10 లక్షల పంటకుంటలు తవ్వించాం. 62,334 కోట్లతో ప్రాజెక్టులు చేపట్టాం. చేపట్టిన 62 ప్రాజెక్టుల్లో 19 పూర్తిచేసి ప్రారంభించాం. మరో 26 పురోగతిలో ఉన్నాయి. ఇంకో 14 ప్రారంభిస్తున్నాం. పోలవరం ఇప్పటికి 65.07శాతం పూర్తయింది. డిసెంబరు నాటికి పూర్తిచేస్తాం. జూన్‌లో గ్రావిటీ ద్వారా నీళ్లిస్తాం. గోదావరి జలాలను పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు తెచ్చాం. కృష్ణా జలాలను రాయలసీమకు తరలించాం. ఈ నెలలోనే అనంతపురం జిల్లా మడకశిర వరకు నీళ్లు తీసుకెళ్తాం. చిత్తూరు జిల్లాకు తీసుకెళ్లాం. పట్టువిడవకుండా పనిచేయడం వల్లే ఇది సాధ్యమైంది. నాగావళి-వంశధార, గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం జరగాలి. చేస్తాం.'

బీసీలే మాకు వెన్నెముక..

'టీడీపీకి బీసీలే వెన్నెముక. మేం అధికారంలో లేనప్పుడు.. వారిని అణచివేయడానికి ప్రయత్నించారు. మేమొచ్చాక వారి సంక్షేమానికి పని చేశాం. జయహో బీసీ సభలో హామీ ఇచ్చినట్లుగా 21 బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటుచేశాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ బీసీలకు ఇన్ని కార్పొరేషన్లు లేవు. వీటికి రూ.3వేల కోట్లు కేటాయించాం. ఉప ప్రణాళిక ప్రవేశపెట్టాం. దివ్యాంగులకు మూడుచక్రాల స్కూటర్లు ఇచ్చాం. క్షత్రియ కార్పొరేషన్ కొత్తగా ఏర్పాటుచేసి రూ.50 కోట్లు కేటాయించాం. ముస్లిం మైనారిటీలకు షాదీఖానాలు, మౌజంలు, ఇమాంలకు గౌరవ వేతనాలు అందిస్తున్నాం. కడప, విజయవాడల్లో హజ్‌హౌస్‌లు కడుతున్నాం. హైదరాబాద్‌లో మేమే హజ్‌హౌస్ కట్టాం. సంపద సృష్టించడమే కాక.. సమాజంలోని అన్నివర్గాలకు పంచుతున్నాం.'

కేంద్రం సహకరించనందునే సొంతంగా 'ఉక్కు'




- ఓబుళాపురం గనులను వాడుకుంటాం
- 11 లేఖలు రాశాం. సమాచారం ఇవ్వలేదనడం అవాస్తవం: మంత్రి సుజయ
- కేంద్రానికి నేటికీ సమాచారం ఇవ్వలేదు: విష్ణుకుమార్‌రాజు

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన ఉక్కు పరిశ్రమపై ఎన్నిసార్లు విన్నపాలు చేసినా కేంద్రం కనీసం పట్టించుకోలేదు. పైగా ఈ సమస్యను మరింత జఠిలం చేసింది. అందుకే సొంతంగా ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాల్సి వచ్చింది" అని మంత్రి సుజయకృష్ణ రంగారావు అసెంబ్లీలో తెలిపారు. బుధవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా కడపలో స్టీల్‌ప్లాంటు ఏర్పాటు గురించి టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ప్రశ్న లేవనెత్తారు. గనుల శాఖ మంత్రి సుజయకృష్ణ రంగారావు బదులిచ్చారు. "కేంద్రం మేలు చేయనందుకే తీవ్ర ఆవేదనకు గురైన సర్కారు సొంత ఖర్చుతో కడపలో స్టీల్‌ప్లాంటును ఏర్పాటు చేసింది. ఇనుపఖనిజం తవ్వకం, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని రాయలసీమ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశాం" అని మంత్రి చెప్పారు. దీనిపై బీజేపీ శాసనసభపక్ష నేత విష్ణుకుమార్‌రాజు అభ్యంతరం తెలిపారు. 'పలు అంశాలపై సమాచారం ఇవ్వమని కేంద్రం కోరింది. ఇప్పటికీ రాష్ట్రం స్పందించలేదు. ముడి ఇనుము ఎక్కడి నుంచి తీసుకుంటారన్నదానిపై కనీస వివరాలు అందించలేదు. కానీ ఇప్పుడు కేంద్రంపై అభాండాలు వేస్తున్నారు' అని అన్నారు. దీనిపై మంత్రి సుజయకృష్ణ మాట్లాడారు. 'స్టీల్‌ప్లాంటుపై అధ్యయనం చేసిన మెకాన్ సంస్థతోపాటు కేంద్రానికి 11 లేఖలు రాశాం. అన్ని వివరాలు అందించాము. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాస్తూ విభజన చట్టంలో పేర్కొన్నట్లుగా రెండు రాష్ట్రాల్లో ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సి ఉందని చెప్పారు. ఏపీ నుంచి కోరిన సమాచారం వచ్చిందని, తెలంగాణ ఇంకా ఏ సమాచారం ఇవ్వలేదని, దానికోసం ఎదురు చూస్తున్నామని ఆ లేఖలో తెలిపారు. ఇంత జరిగితే కేంద్రానికి సమాచారం ఇవ్వలేదనడం అవాస్తవం. స్టీల్ ప్లాంటు కోసం 3,555 ఎకరాలు, టౌన్‌షిప్ నిర్మాణానికి మరో 1100ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుంది. ఉక్కు పరిశ్రమకు ఏడు సంవత్సరాల పాటు జీఎస్టీని, 15ఏళ్లపాటు ఐటీ, 10ఏళ్లపాటు దిగుమతి సుంకాలను మినహాయించాలని కోరాం. ఉక్కు కర్మాగారానికి అవసరమైన ముడి ఇనుమును ఓబుళాపురం నుంచి సేకరిస్తాం. మనకు 150టన్నుల ముడి ఖనిజం అవసరం ఉండగా ఓబుళాపురంలో 176 టన్నులు ఉంది' అని మంత్రి తెలిపారు.

15న డీఎస్సీ ఫలితాలు: గంటా



అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యోగ నియామాల కోసం నిర్వహించిన డీఎస్సీ ఫలితాలను ఈనెల 15న విడుదల చేస్తామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. బుధవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2014లో మొదటి డీఎస్సీ నిర్వహించి 10వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేశామన్నారు. రెండోసారి ఇటీవల డీఎస్సీ నిర్వహించామని, 6,81,178 మంది దరఖాస్తు చేసుకోగా 5,89,120 మంది పరీక్ష రాశారని తెలిపారు. 10వ తరగతిలో బాలికలు ఉత్తమ ప్రతిభ కనబరిచారని, పైలెట్ ప్రాజెక్టు కింద 31 కేజీబీవీల్లో ఇంటర్‌ను ప్రవేశపెట్టామని వివరించారు. వచ్చే విద్యాసంవత్సరం మరో 70 కేజీబీవీల్లోనూ ఇంటర్ ప్రవేశపెడతామని తెలిపారు. మరోవైపు కేజీబీవీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యేలు చిరంజీవులు, చాంద్‌బాషా కోరారు.

రెవెన్యూ 'చుక్కలు' చూపిస్తోంది

- బీచ్ రోడ్డును, ఎమ్మెల్యే ఇంటినీ 22-ఏలో చేర్చారు
- అసెంబ్లీలో ఎమ్మెల్యేల ఆందోళన



అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): చుక్కలతోపాటు, సాధారణ భూముల విషయంలోనూ సామాన్యులు, ప్రజాప్రతినిధులకు రెవెన్యూశాఖ చుక్కలు చూపిస్తోందని ఎమ్మెల్యేలు శాసనసభలో ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం ఎమ్మెల్యే రాజగోపాల్ చుక్కల భూములపై ప్రశ్న లేవనెత్తగా ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి సమాధానమిచ్చారు. చుక్కల భూముల చట్టం తీసుకొచ్చామని, సమస్యల పరిష్కారానికి చట్టసవరణ కూడా ప్రతిపాదించామని వివరించారు. 1954కు ముందు అసైన్ చేసిన భూములను 22-ఏ నుంచి తొలగించాలని ఉత్తర్వులు ఇచ్చామన్నారు. మంత్రి సమాధానంతో సభ్యులు శాంతించలేదు. బీజేపీపక్షనేత విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ చుక్కల భూములతోపాటు, ప్రైవేటు భూములను కూడా 22-ఏ జాబితాలో చేర్చి ఆవేదన కలిగిస్తున్నారన్నారు. ఎండాడ, మధురవాడను నిషేధ జాబితాలో చేర్చారని ఆరోపించారు. గతంలో ప్రజలు రేషన్, పెన్షన్ కోసం ప్రభుత్వం చుట్టూ తిరిగారని, ఇప్పుడు భూ సమస్యలపై తమ వద్దకు వస్తున్నారని చెప్పారు. ఆపిల్ ఫోన్లు ఇస్తే తప్ప 22-ఏ నుంచి తొలగించడం లేదని ఆరోపించారు. వెలగపూడి రామకృష్ణ మాట్లాడుతూ అన్ని రకాల అనుమతులున్న లే అవుట్‌లు, ప్రైవేటు భూములను కూడా 22-ఏలో చేర్చారని, నాలుగున్నరేళ్లుగా రెవెన్యూ చుట్టూ తిరిగినా తమ సమస్య పరిష్కారం కాలేదన్నారు. విశాఖ బీచ్‌రోడ్, సీతమ్మధార, చివరకు తమ ఇంటిని కూడా నిషేధ జాబితాలో చేర్చారని ఆరోపించారు. దీనిపై కేఈ స్పందిస్తూ.. వివాదాల పరిష్కారానికి భూదార్ తీసుకొస్తున్నట్టు చెప్పారు. ఇంకా సమస్యలు పరిష్కారం కాకపోతే తనకు లేఖ రాయాలని సూచించారు. అయితే, తాము ఒక సమస్య లేవనెత్తితే మంత్రి మరోదానికి బదులిస్తున్నారంటూ సభ్యులు నిట్టూర్చారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని విష్ణుకుమార్‌రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఇప్పుడైనా నిధులు కేటాయిస్తే అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. మంత్రి యనమల స్పందిస్తూ.. విష్ణుకుమార్‌రాజు వైసీపీ తరఫున వకాల్తా పుచ్చుకొని మాట్లాడుతున్నారన్నారు. నియోజకవర్గాలకు ప్రత్యేకంగా నిధులివ్వడం లేదని చెప్పారు.

కాపు కాశారు!

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం 'చట్టబద్ధ' చర్యలు తీసుకుంది. దీనిపై బుధవారం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టింది. టీడీపీ అధికారంలోకి వచ్చినవెంటనే కాపు కోటా కల్పన దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టింది. కమిషన్ ఏర్పాటు చేసి కాపుల సామాజిక, ఆర్థిక స్థితి గతులపై అధ్యయనం చేయించింది. కమిషన్ సిఫారసుల ఆధారంగా... కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని శాసనసభ ఇది వరకే బిల్లు ఆమోదించింది. బీసీ కోటాను యథాతథంగా ఉంచుతూ, కాపులకు అదనపు కోటాను ప్రతిపాదించింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించిపోతున్నందున ఈ రిజర్వేషన్‌లకు చట్టపరమైన భద్రత, రక్షణ కల్పిస్తూ పార్లమెంటు చట్టం ద్వారా రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. కేంద్రం దీనిపై స్పందించలేదు. ఆర్థిక బలహీన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్రం చట్టం చేసింది. దీనికి సంబంధించిన విధి విధానాలను, నిబంధనలను రూపొందించుకునే అధికారం రాష్ట్రాలకే ఉంటుంది. దీనినే రాష్ట్ర ప్రభుత్వం తనకు అనుకూలంగా మార్చుకుంది. ఈడబ్ల్యూఎస్‌లో కాపు, తెలగ, ఒంటరి, బలిజ సామాజిక వర్గాల వారే సగం మంది ఉన్నారని... పది శాతం కోటాలో సగం వారికే కేటాయించాలని ఇదివరకే నిర్ణయించుకుంది. దీనికి సంబంధించి... విద్యా, ఉద్యోగావకాశాల్లో కాపులుకాని ఆర్థిక బలహీన వర్గాల వారికి ఐదు శాతం, కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ ఇచ్చేలా వేర్వేరు బిల్లులు శాసనసభలో ప్రవేశ పెట్టారు. కాపు ఉపకులాలైన తెలగ, కాపు, బలిజ, ఒంటరి కులాలకు చెందిన వారు తమ ఆర్థిక వెనుకబాటుతనం కారణంగా ఇతరులతో పోటీ పడలేక విద్యాపరంగా, సామాజికంగా వెనుకబడి పోతున్నందున వారి స్థితిగతులను మెరుగుపర్చడానికి వీలుగా ఆ కులాలకు చెందిన వారికి విద్యా, ఉద్యోగవకాశాల్లో 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం తన బిల్లులో పేర్కొంది. ఇందులోనే మూడోవంతు సీట్లు, ఉద్యోగాలను ఆ వర్గాల మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది. దీంతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, రిజర్వేషన్ల పరిధిలోకి రాని ఇతర వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి మరో 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఇంకో బిల్లు ప్రవేశ పెట్టారు., అందులో కూడా ఆయా వర్గాల మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తామని ఆ బిల్లులో పేర్కొన్నారు.

మతం మారినా ఎస్సీలే!

మతం మారిన దళితులకు ఇతర షెడ్యూల్డ్ కులాలతో సమాన హోదా కల్పించాలని... దీనికి అనుగణంగా రాజ్యాంగాన్ని సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. దీనిపై బుధవారం శాసనసభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. తీర్మాన ప్రతిని ముఖ్యమంత్రి చంద్రబాబు సభలో చదివి వినిపించారు. "తరతరాల వారసత్వంగా వస్తున్న కుల వ్యవస్థ అసమానతలను పెంచి పోషించింది. సామాజిక వర్గాలుగా విడదీసింది. అస్పృశ్యత కుల వ్యవస్థలో అంతర్భాగమైంది. కుల వ్యవస్థ నుంచి ఎదురవుతున్న అవమానాలు, అణచివేతను, ఆధిపత్యాన్ని తప్పించుకుని స్వేచ్ఛగా, సగౌరవంగా జీవించాలన్న ఆకాంక్షతో అట్టడుగు వర్గాల వారు మత విశ్వాసాలు మార్చుకుంటున్నారు. దళితులు క్రైస్తవ, బౌద్ధ, సిక్కు మతాలకు మారిపోయారు. కానీ, కులవ్యవస్థ అక్కడ కూడా వెన్నాడుతోంది. వారి మతమార్పిడి ఉద్దేశం నెరవేరలేదు. స్వాతంత్ర్యానంతరం దేశంలో కులవ్యవస్థ ఏర్పరిచిన అసమానతలను తొలగించడానికి అంబేద్కర్ కృషి, మేధస్సుతో రచించిన రాజ్యాంగం ద్వారా పొందిన విధి విధానాల ద్వారా ఉపాధి, విద్యలో షెడ్యూల్డ్ కులాల వారికి రిజర్వేషన్లు లభించాయి. ఆంధ్రప్రదేశ్‌లో 59 కులాలను షెడ్యూల్డు కులాల జాబితాలో చేర్చారు. ఎస్సీలు బౌద్ధ మతంలో చేరినా, సిక్కు మతంలో చేరినా వారికి యథావిధిగా రిజర్వేషన్లు, ఇతర రక్షణ లభించేలా చేశారు. క్రైస్తవ మతంలో చేరిన షెడ్యూల్డ్ కులాల వారికి మాత్రం నిరాకరించారు. అయితే... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1977లో జారీ చేసిన జీవో 341 ప్రకారం ఎస్సీ సహకార ఆర్థిక సంస్థ ద్వారా అమలయ్యే నాన్ స్టాట్యుటరీ రాయితీలైన ఆర్థిక భద్రతా పథకాలు దళిత క్రిస్టియన్లకు కూడా వర్తింప చేసింది. షెడ్యూల్డ్ కులాల హాస్టళ్లలో, రెసిడెన్షియల్ పాఠశాలల్లో వారికి 12 శాతం ప్రవేశాలను కల్పించింది. క్రైస్తవ మతంలోకి మారిన తర్వాత కూడా వారికి కూడా షెడ్యూల్డ్ కులాల హోదాను కల్పించడానికి అనువుగా రాజ్యాంగ సవరణ తేవాలని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాం" అని ఈ తీర్మానంలో పేర్కొన్నారు.

మండలి చైర్మన్‌గా షరీఫ్ ఏకగ్రీవం

- నేడు బాధ్యతల స్వీకరణ

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్‌గా అహ్మద్ షరీఫ్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఒక్కరు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక లాంఛనప్రాయంగా మారింది. గతంలో చైర్మన్‌గా ఉన్న ఎన్ఎండీ ఫరూక్ మంత్రి కావడంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఈ పదవిని ముస్లిం మైనారిటీలకే కొనసాగించాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించడంతో షరీఫ్‌కు అవకాశం దక్కింది. షరీఫ్ ఇప్పటి వరకూ మండలిలో ప్రభుత్వ విప్‌గా ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో పుట్టిన ఆయన టీడీపీలో ఆరంభం నుంచీ పని చేస్తున్నారు. ఎన్టీ రామారావు టీడీపీని స్థాపిస్తున్నట్లు ప్రకటించిన రోజే నర్సాపురంలో మరో పది మందితో కలిసి ఆయన టీడీపీ శాఖ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా, గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా కూడా పనిచేశారు. న్యాయశాస్త్రం చదివిన ఆయన 2015లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్టీ క్రమశిక్షణ విభాగం చైర్మన్‌గా ఉన్నారు. గురువారం ఆయన చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు.

చంద్రన్న పాలనలో రామరాజ్యం

- అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పాలన: టీడీపీ ఎమ్మెల్యేలు
- కేంద్రం సహకారంతోనే 10.68 వృద్ధిరేటు: విష్ణుకుమార్ రాజు



అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'చంద్రన్న పాలనలో రామరాజ్యం నెలకొంది. రామరాజ్యం గురించి పుస్తకాల్లో చదివాం, విన్నాం. కానీ.... చంద్రబాబు ప్రభుత్వంలో స్వయంగా చూస్తున్నాం. వృద్ధులకు పెన్షన్ పెంచి నిజమైన రామరాజ్యం నెలకొల్పారు' అని టీడీపీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. 'చంద్రన్న పెళ్లికానుకతో బాల్య వివాహాలు నిర్మూలించినట్లయింది. బీజేపీ రాముడికి గుడి కట్టాలంటోంది. కాని రామ రాజ్యం స్థాపించాలనే ఆలోచన లేదు' అని వాసుపల్లి అన్నారు. "అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం చంద్రబాబు ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. మోదీ గల్లీ లీడర్‌గా వ్యవహరిస్తున్నారు' అని ప్రభుత్వ విప్ కూన రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ పక్షనేత విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ, 'కేంద్ర ప్రభుత్వ పూర్తి సహకారంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలై 10.68% వృద్ధిరేటు సాధించింది. మోదీ గల్లీ లీడరే. గల్లీలో ఉన్న ప్రతి ఒక్కరిని పట్టించుకునే గల్లీ లీడర్' అని అన్నారు.క్షత్రియులకు రూ.50కోట్లు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ కమ్మ, రెడ్డి, వెలమల్లో కూడా వెనుకబడిన ఉన్నారు. వారికి కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

కేసీఆర్‌కు ఎన్నిక రద్దు భయం: జవహర్



అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'ఈవీఎంల్లో జరిగిన లోటుపాట్ల వల్ల ఎన్నిక రద్దు అవుతుందన్న అనుమానం కేసీఆర్‌ని వెంటాడుతోంది. అందుకే 60 రోజులైనా తెలంగాణలో కేసీఆర్ కేబినెట్‌ని ఏర్పాటు చేయలేదు. ఇద్దరే పరిపాలన సాగిస్తున్నారు' అని మంత్రి జవహర్ వ్యాఖ్యానించారు. బుధవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. 'దేశంలో ప్రజాస్వామ్యం ఎవరి వల్ల ప్రమాదంలో పడిందో బీజేపీ ఎంపీ జీవీఎల్ చెప్పాలి. ఈవీఎంలు ట్యాంపరింగ్ అయ్యే అవకాశం ఉందనీ, బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలని 'డెమొక్రసీ ఎట్ రిస్క్' అనే పుస్తకంలో రాసిన జీవీఎల్ తన అభిప్రాయాన్ని ఎందుకు మార్చుకున్నారో ప్రజలకు చెప్పాలి. సర్వేల పేరిట కేంద్రం నుంచి పెద్ద మొత్తంలో నిధులు పొందుతున్న జీవీఎల్... ఈవీఎంపై ప్రజల్లో, రాజకీయ పార్టీల్లో చర్చ సమర్థనీయమో, కాదో చెప్పాలి' అని జవహర్ ధ్వజమెత్తారు. అంతకుముందు మండలిలో ఎమ్మెల్సీ మాధవ్‌కు సమాధానమిస్తూ..'అబద్ధాన్ని ఎంత గట్టిగా చెప్పినా నిజం కాదన్న సంగతిని బీజేపీ నేతలు తెలుసుకోవాలి' అని స్పష్టం చేశారు.

కన్నా అవాకులు చవాకులు: బుద్దా



అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో బీజేపీ ఇప్పుడు బస్సుయాత్ర చేసే బదులు ఎన్నికల తర్వాత శవయాత్ర చేసుకోవడం మంచిది. ఏపీని ప్రగతి పథంలో నడుపుతున్న చంద్రబాబుపై బస్సు యాత్రల్లో అవాకులు చవాకులు పేలుతున్న కన్నా లక్ష్మీనారాయణను ప్రజలు ఛీకొడుతున్నారు" అని టీడీపీ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బుద్దా వెంకన్న వ్యాఖ్యానించారు. అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడారు. "ఇంటిపై బీజేపీ జెండా, ఇంట్లో వైసీపీ జెండా పెట్టుకుని కన్నా 10 ఏళ్లు ప్రజలను ఏవిధంగా దోచుకున్నారో అందరికీ తెలుసు. దోచుకున్న సొమ్మును కాపాడుకోవడానికి ఆయన బీజేపీ షెల్టర్ తీసుకున్నారు' అని బుద్దా విమర్శించారు.

కేంద్ర నిధుల వల్లే రాష్ట్రానికి అవార్డులు: మాధవ్



అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన నిధుల వల్లే ఏపీ ప్రభుత్వానికి అనేక అవార్డులు వచ్చాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, మంత్రుల చాకచక్యంతో అవార్డులు వచ్చాయంటూ చంద్రబాబు ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇస్తున్నారు' అని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'పబ్లిసిటీ కోసం అసెంబ్లీ ఆవరణలో పెట్టిన అవార్డుల ప్రదర్శన ముందు 'థ్యాంక్ యూ పీఎం మోదీ' అని రాసి ఉండాల్సింది. సన్‌రైజ్ ఏపీ అనే చంద్రబాబు నినాదంలో సన్ అంటే ఆయన కుమారుడనే విషయం ప్రజలు అర్థం చేసుకోవాలి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు అత్యధికంగా వచ్చిన అవార్డులన్నీ మంత్రి అయ్యన్న ఉన్నప్పుడు వచ్చినవే. కానీ లోకేశ్ బాధ్యతలు చేపట్టాక వచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారు' అని అన్నారు. అంతకుముందు మండలిలో గవర్నర్ ప్రసంగంపై మాట్లాడారు.

నకిలీ విత్తనాలపై నియంత్రణేదీ?

- అసెంబ్లీలో ఎమ్మెల్యేల ఆందోళన..చక్కదిద్దాలన్న స్పీకర్
- త్వరలో వ్యవసాయమంత్రి సమక్షంలో సమావేశం



అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ విత్తనాల దందా తీవ్రస్థాయిలో కొనసాగుతోందని ఎమ్మెల్యేలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నకిలీలను అరికట్టాల్సిన అధికారులే అక్రమార్కులతో కుమ్మక్కవ్వడంతో నకిలీ విత్తనాల అమ్మకాలు భారీగా పెరిగిపోయాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సభ్యులు తీవ్ర ఆరోపణలు చేశారు. అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కూడా ఇదేఅంశంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను చాలా తీవ్రమైనదిగా పరిగణించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరా అనే అంశంపై బుధవారం ఉదయం అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి ప్రశ్నలేవనెత్తారు. నకిలీ విత్తన తయారీదారులపై మొక్కుబడిగా కేసులు పెడుతూ సరుకు సీజ్‌చేస్తున్నారు కానీ... చట్టంలో పేర్కొన్నట్లుగా కఠిన శిక్షలు వేయడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాల వల్ల పంట నష్టపోయిన రైతులకు అయా కంపెనీల నుంచి ఎలాంటి నష్టపరిహారమూ ఇప్పించడం లేదన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ జోక్యం చేసుకుంటూ కల్తీ విత్తనాల సమస్య ఉన్నమాట నిజమే అన్నారు. నకిలీని నిర్ధారించే విధానం ఉందా? లేదా? మరోసారి పరిశీలన చేసుకోవాలని సూచించారు. కల్తీ విత్తనాలపై పౌరసరఫరాల మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ... ఇప్పటిదాకా 13 కంపెనీల లైసెన్సులు రెండేళ్లపాటు రద్దుచేశామని చెప్పారు. త్వరలో వ్యవసాయమంత్రి సమక్షంలో ఈ అంశంపై సమావేశం జరిగేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

మిథాలీకి మళ్లీ మొండిచేయి



వెల్లింగ్టన్: వెటరన్ మిథాలీరాజ్‌కు టీ20ల్లో మరోసారి మొండిచేయి ఎదురైంది. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో ఆమెకు చోటు దక్కలేదు. గత నవంబరులో టీ20 ప్రపంచకప్ సెమీస్ తుదిజట్టులో మిథాలీకి చోటు కల్పించకపోవడం ఎంత దుమారం రేపిందో తెలిసిందే. యువ ప్లేయర్లకు ఎక్కువ అవకాశాలు ఇచ్చేందుకే మిథాలీకి తుది జట్టులో చోటివ్వలేదని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ చెప్పింది. ప్రస్తుతం విదేశాల్లో జరిగే టీ20లు ఈ మూడేనని, ఆ తర్వాత స్వదేశంలో ఎక్కువగా మ్యాచ్‌లు ఆడనున్నామని తెలిపింది. అందుకే..విదేశీ పిచ్‌లపై యువ క్రీడాకారిణులకు ఎక్కువగా ఆడే అవకాశాలివ్వనున్నామని హర్మన్‌ప్రీత్ వివరించింది. అంటే.. మిగిలిన రెండు మ్యాచ్‌లకు కూడా మిథాలీకి తుది జట్టులో చోటు కష్టమని ఆమె పరోక్షంగా చెప్పినట్టయింది.

ప్రొ వాలీబాల్‌లో నేడు

చెన్నై X హైదరాబాద్
రాత్రి 7 గం. నుంచి
సోనీ సిక్స్, సోనీ టెన్-3లో..

వన్డేల్లో తొలి మూడు మ్యాచ్‌ల్లో అద్భుత విజయాలతో సిరీస్‌కు ఘనంగా బోణీ కొట్టిన భారత్.. టీ20 సిరీస్‌ను ఘోర పరాజయంతో ఆరంభించింది. భారీ లక్ష్య ఛేదనలో ఏ ఒక్కరూ కుదురుకోకపోగా ఒకరివెంట ఒకరు పెవిలియన్‌కు చేరడంతో 80 పరుగుల తేడాతో చిత్తయింది. తొలుత ఓపెనర్ సీఫెర్ట్ ఆకాశమే హద్దుగా కదం తొక్కి న్యూజిలాండ్ భారీ స్కోరుకు బాటలు వేయగా.. ఆపై బౌలర్లు ముఖ్యంగా టిమ్ సౌథీ దెబ్బకు భారత్ ఆటగాళ్లు బ్యాట్లెత్తేయడంతో నిర్ణీత ఓవర్లకంటే ముందే జట్టు ఇన్నింగ్స్ ముగిసింది. అంతేకాదు టీ20ల్లో భారీ తేడాతో ఓడిన చెత్త రికార్డును కూడా రోహిత్ సేన సొంతం చేసుకుంది. మొత్తంగా కలిసి కట్టుగా రాణించిన న్యూజిలాండ్ శుభారంభం అందుకుంటే, భారత్ సమష్టిగా విఫలమైంది.

సీఫెర్ట్, సౌథీ జిగేల్

భారత్ ధమాల్



జెమీమా రోడ్రిగ్స్ (39)



తొలి టీ20లో న్యూజిలాండ్ ఘన విజయం

శిఖర్ ధవన్ (29) బౌల్డ్

రోహిత్ (1)

1

టీ20ల్లో భారత్‌కు ఇది అతిపెద్ద పరాజయం. ఇంతకుముందు 2010లో ఆసీస్‌పై 49 పరుగుల తేడాతో ఓడింది.

51 పరుగులకు 2 వికెట్లు తీసిన హార్దిక్ పాండ్యాకు టీ20ల్లో ఇది అతి చెత్త ప్రదర్శన.



సీఫెర్ట్ (43 బంతుల్లో 84)

వెల్లింగ్టన్: అటు బ్యాట్స్‌మెన్ ఇటు బౌలర్లు విఫలమైన వేళ న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌ను భారత్ ఓటమితో ఆరంభించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో న్యూజిలాండ్ 80 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 219 పరుగుల భారీ స్కోరు చేసింది. బౌలర్ల భరతం పట్టిన ఓపెనర్ సీఫెర్ట్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 84) కివీస్‌కు అద్భుత ఆరంభం ఇవ్వగా, మన్రో (20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 34), విలియమ్సన్ (22 బంతుల్లో 3 సిక్సర్లతో 34), రాస్ టేలర్ (14 బంతుల్లో 2 సిక్సర్లతో 23) అతడికి చక్కటి సహకారం అందించారు. ఇక చివర్లో కుగ్‌లైన్ (7 బంతుల్లో 3 ఫోర్లు, సిక్సర్‌తో 20 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. భారత బౌలర్లలో పాండ్యా రెండు వికెట్లు (2/51) తీసినా కెరీర్‌లో అత్యధిక పరుగులిచ్చి చెత్త ప్రదర్శన నమోదు చేశాడు. అనంతరం లక్ష్య ఛేదనలో భారత్ 19.2 ఓవర్లలో 139 పరుగులకు కుప్పకూలింది. ధోనీ (31 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్‌తో 39) తన వంతు పాత్ర నిర్వర్తించగా ధవన్ (18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 29), విజయ్ శంకర్ (18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 27), క్రునాల్ పాండ్యా (18 బంతుల్లో ఫోర్, సిక్సర్‌తో 20) ఓ మోస్తరుగా రాణించారు. కివీస్ బౌలర్లలో సౌథీ (3/17) మూడు వికెట్లు పడగొట్టగా, ఫెర్గూసన్ (2/22), శాంట్నర్ (2/24), సోధీ (2/26) తలో రెండేసి వికెట్లు కైవసం చేసుకున్నారు. సీఫెర్ట్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రెండో టీ20 శుక్రవారం ఆక్లాండ్‌లో జరగనుంది.

దక్కని శుభారంభం: ఓవర్‌కు 11 పరుగుల లక్ష్యం. మొదటి ఓవర్లో ఒకటే పరుగొచ్చినా.. రెండో ఓవర్లోనే బ్యాట్ ఝుళిపించిన ధవన్.. కుగ్‌లైన్ మూడు బంతుల్ని 6,6,4గా మలిచి స్కోరుబోర్డులో కదలిక తెచ్చాడు. పేలవ ఫామ్‌ను కొనసాగించిన కెప్టెన్ రోహిత్.. సౌథీ షార్ట్ బంతిని పుల్ చేయబోయి అవుటయ్యాడు. నాలుగో ఓవర్లో ఫెర్గూసన్ బంతిని సిక్సర్‌గా కొట్టిన ధవన్ ధాటిగా బ్యాటింగ్‌ను కొనసాగించాడు. వన్‌డౌన్‌లో వచ్చిన ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ కూడా రెచ్చిపోయి కుగిలీన్ బౌలింగ్‌లో 4,4,6 బాదడంతో భారత్ ఇన్నింగ్స్ లక్ష్యం దిశగా సాగుతున్నట్టు కనిపించింది. కానీ ఆరో ఓవర్లో ఫెర్గూసన్ యార్కర్‌కు ధవన్ బౌల్డయ్యాడు. మరో మూడు ఓవర్ల తర్వాత లెఫ్టామ్ స్పిన్నర్ శాంట్నర్ మూడు బంతుల వ్యవధిలో పంత్, విజయ్ శంకర్‌లను అవుట్ చేసి భారత్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. మరో ఓవర్ అయిందో లేదో..ఈసారి లెగ్‌స్పిన్నర్ సోధీ వంతైంది. 11వ ఓవర్లో కార్తీక్, హార్దిక్ పాండ్యాను సోధీ అవుట్ చేయడంతో 77 పరుగులకు 6 వికెట్లు చేజార్చుకొని భారత్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఈ దశలో వెటరన్ ధోనీ, క్రునాల్ పాండ్యా అడపాదడపా షాట్లు కొడుతూ జట్టు ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేసినా అప్పటికే లక్ష్యం చేరుకోలేని స్థాయికి చేరింది. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 52 పరుగులు జోడించారు. క్రునాల్‌ను సౌథీ అవుట్ చేశాక.. భారత్ ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎంతోసేపు పట్టలేదు.


సీఫెర్ట్ దంచుడు: కివీస్ ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ టిమ్ లూయిస్ సీఫెర్ట్ ఆటే హైలైట్. రెండు లైఫ్ (17, 71 పరుగులు)లు దక్కించుకొన్న అతడు కండ బలంతో అలవోకగా సిక్సర్లు, ఫోర్లు కొట్టి భారత బౌలర్లకు ముచ్చెమటలు పట్టించాడు. అతడికి మన్రో కూడా తోడు కావడంతో కివీస్‌కు స్కోరుబోర్డు పరుగులు పెట్టింది. భువీ మూడో ఓవర్లో రెండు బంతులను క్రీజ్ బయటకు వచ్చి సీఫెర్ట్ 6, 4 కొట్టిన తీరు అమోఘం. తర్వాత ఖలీల్ బౌలింగ్‌లో మన్రో రెండు సిక్స్‌లు బాదాడు. హార్దిక్ బౌలింగ్‌లో సీఫెర్ట్ రెండు సిక్స్‌లు కొట్టడంతో 6 ఓవర్లు ముగిసే సరికే న్యూజిలాండ్ 66/0 స్కోరుకు దూసుకుపోయింది. హార్దిక్ బౌలింగ్‌లోనే 4,6 కొట్టడంతోపాటు తొమ్మిదో ఓవర్లో టీ20ల్లో తన తొలి అర్ధ సెంచరీ సాధించాడు. ఇదే ఓవర్లో మన్రోను క్రునాల్ క్లీన్‌బౌల్డ్ చేయడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. అయినా వెనక్కు తగ్గని సీఫెర్ట్ ధాటిగా బ్యాటింగ్ కొనసాగించి 13వ ఓవర్లో అవుటయ్యాడు. ఆపై విలియమ్సన్, రాస్ టేలర్స్, ఆఖర్లో కుగ్‌లైన్ ధాటిగా ఆడడంతో కివీస్ స్కోరు 200లకుపైగా దాటింది.

క్యాచ్ మిస్



కనురెప్ప పాటులో స్టంపింగ్‌లు, రనౌట్లు చేసే ధోనీ ఈ మ్యాచ్‌లో క్యాచ్ మిస్ చేజార్చడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. కివీస్ ఓపెనర్ సీఫెర్ట్ 17 పరుగుల వద్ద క్రునాల్ వేసిన బంతి అతడి బ్యాట్‌ను తాకుతూ వెళ్లింది. కానీ ధోనీ కాస్త ఆలస్యంగా కదలడంతో ఆ క్యాచ్‌ను పట్టలేకపోయాడు.

9వ ఓవర్‌లో కానీ ..



ఓ పక్క వారు వీరు అనే తేడా లేకుండా బౌలర్లందరినీ సీఫెర్ట్ చితక్కొడుతుండగా.. కెప్టెన్ రోహిత్ 9వ ఓవర్లో కానీ స్పిన్నర్ చాహల్‌ను బౌలింగ్‌కు దించకపోవడం గమనార్హం. ఇన్నింగ్స్ ముగిసేసరికి చాహల్ బంతులను ఆరింటినే ఎదుర్కొన్న సీఫెర్ట్ వాటి ద్వారా 18 పరుగులే చేశాడు. అంటే.. ముందే చాహల్‌ను దించివుంటే పరిస్థితి వేరుగా ఉండేదేమో!



వావ్.. ఏం పట్టాడు!

డారిల్ మిచెల్ క్యాచ్‌ను దినేశ్ కార్తీక్ అందుకున్న తీరు అద్భుతం. హార్దిక్ పాండ్యా వేసిన 15వ ఓవర్ ఆఖరి బంతిని మిచెల్ లాంగాన్‌లోకి కొట్టాడు. అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న కార్తీక్..బంతిని పైకెగిరి ఒడిసి పట్టాడు. అయితే క్యాచ్ తీసుకొనే క్రమంలో బౌండరీ లైన్ దాటతాననే ఉద్దేశంతో.. గాల్లోకి ఎగురుతూ బంతిని ముందుకు విసిరాడు. వెంటనే బౌండరీ లైన్ బయట నుంచి లోపలికి వచ్చి క్యాచ్ పట్టేశాడు. పలుమార్లు రీప్లేలో చూసిన అనంతరం కార్తీక్ క్యాచ్ సరైనదేనని తేలడంతో డారిల్‌ను అవుట్‌గా ప్రకటించారు.

స్కోరు బోర్డు

న్యూజిలాండ్ : సీఫెర్ట్ (బి) ఖలీల్ 84, మన్రో (సి) శంకర్ (బి) క్రునాల్ 34, విలియమ్సన్ (సి) హార్దిక్ (బి) చాహల్ 34, మిచెల్ (సి) కార్తీక్ (బి) హార్దిక్ 8, టేలర్ (సి) ఖలీల్ (బి) భువనేశ్వర్ 23, గ్రాండ్‌హోమ్ (సి-సబ్) సిరాజ్ (బి) హార్దిక్ 3, శాంట్నర్ (నాటౌట్) 7, కుగ్‌లైన్ (నాటౌట్) 20, **ఎక్స్‌ట్రాలు 6, మొత్తం 20 ఓవర్లలో 219/6; వికెట్లపతనం:** 1/86, 2/134, 3/164, 4/164, 5/189, 6/191; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-47-1, ఖలీల్ 4-0-48-1, క్రునాల్ పాండ్యా 4-0-37-1, హార్దిక్ 4-0-51-2, చాహల్ 4-0-35-1

భారత్: రోహిత్ (సి) ఫెర్గూసన్ (బి) సౌథీ 1, ధవన్ (బి) ఫెర్గూసన్ 29, శంకర్ (సి) గ్రాండ్‌హోమ్ (బి) శాంట్నర్ 27, పంత్ (బి) శాంట్నర్ 4, ధోనీ (సి) ఫెర్గూసన్ (బి) సౌథీ 39, కార్తీక్ (సి) సౌథీ (బి) సోధీ 5, హార్దిక్ (సి) మిచెల్ (బి) సోధీ 4, క్రునాల్ (సి) సీఫెర్ట్ (బి) సౌథీ 20, భువనేశ్వర్ (సి) సీఫెర్ట్ (బి) ఫెర్గూసన్ 1, చాహల్ (బి) మిచెల్ 1, ఖలీల్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు 7, మొత్తం 19.2 ఓవర్లలో 139; ఆలౌట్ వికెట్లపతనం:** 1/18, 2/51, 3/64, 4/65, 5/72, 6/77, 7/129, 8/132, 9/136, 10/139; **బౌలింగ్:** సౌథీ 4-0-17-3, కుగ్‌లైన్ 2-0- 34-0, ఫెర్గూసన్ 4-0-22-2, శాంట్నర్ 4-0- 24-2, మిచెల్ 2.2-0-13-1, సోధీ 3-0-26-2.

మంధానా మెరిసినా!

తొలి టీ20లో భారత్ ఓటమి ● 23 పరుగులతో కివీస్ గెలుపు



స్మృతి మంధానా (34 బంతుల్లో 58)

వెల్లింగ్టన్: సూపర్ ఫామ్‌లో ఉన్న డాషింగ్ ఓపెనర్ స్మృతి మంధానా (34 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 58) రికార్డు అర్ధ శతకంతో అదరగొట్టినా.. న్యూజిలాండ్‌తో తొలి టీ20లో భారత మహిళల జట్టుకు ఓటమి తప్పలేదు. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన మొదటి మ్యాచ్‌లో భారత్ 23 పరుగుల తేడాతో కివీస్ చేతిలో ఓడింది. దీంతో సిరీస్‌లో న్యూజిలాండ్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. భారత మహిళల క్రికెట్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీతో తన పేరిట ఉన్న రికార్డును మంధానా మరోసారి అధిగమించింది. 24 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన స్మృతి.. ఒక్క బంతి తేడాతో గత రికార్డును తానే సవరించింది. కివీస్ నిర్దేశించిన 160 పరుగుల లక్ష్య ఛేదనలో మంధానా క్రీజ్‌లో ఉన్నంతవరకు గెలుపు బాటలో ఉన్న భారత్.. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' తహుహు (3/20) దెబ్బకు 19.1 ఓవర్లలో 136 పరుగులకు కుప్పకూలింది. జెమీమా రోడ్రిగ్స్ (39), హర్మన్‌ప్రీత్ (17) తప్ప మిగతావారు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. కీలక మంధానా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ వికెట్లను చేజిక్కించుకున్న లెగ్ స్పిన్నర్ అమేలియా కెర్ (2/28) భారత్ అవకాశాలకు గండికొట్టింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 159/4 స్కోరు చేసింది. సోఫీ డివైన్ (48 బంతుల్లో 62) అర్ధ శతకం చేయగా.. శాటర్త్‌వెయిట్ (33), మార్టిన్ (27 నాటౌట్) చక్కని సహకారం అందించారు. డివైన్, శాటర్త్‌వెయిట్ కలిసి మూడో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆఖరి 3.3 ఓవర్లలో 38 పరుగులు రాబట్టిన కివీస్.. సవాల్ విసరగలిగే 159 పరుగుల స్కోరు సాధించింది.

మంధానా జోరు..: లక్ష్య ఛేదనలో ఓపెనర్‌గా బరిలోకి దిగిన అరంగేట్రం ఆల్‌రౌండర్ ప్రియా పూనియా (4) వికెట్‌ను భారత్ తొలి ఓవర్‌లోనే కోల్పోయింది. ఆ తర్వాత మరో ఓపెనర్ మంధానా, రోడ్రిగ్స్ రెండో వికెట్‌కు 98 రన్స్ జోడించడంతో టీమిండియా విజయం నల్లేరుపై నడకే అనిపించింది. కానీ తహుహు రంగంలోకి దిగడంతో భారత ఇన్నింగ్స్ ఒక్కసారిగా గాడితప్పింది. 101/1తో విజయం దిశగా దూసుకెళ్తున్న భారత్.. ఐదు ఓవర్లలో ఐదు వికెట్లు చేజార్చుకుని 117/6తో నిలిచింది. హర్మన్‌ప్రీత్ (17 బంతుల్లో 15) స్టంపౌట్ కావడంతో మ్యాచ్ కివీస్‌వైపు మొగ్గింది. అనూజ (0), దీప్తి (5), తానియా (1), రాధ (3) వరుసగా పెవిలియన్ చేరారు.

స్కోరు బోర్డు

న్యూజిలాండ్: సుజి బేట్స్ (సి) తానియా భాటియా (బి) రాధా యాదవ్ 7, సోఫీ డివైన్ (సి) దీప్తి (బి) అరుంధతి 62, కైట్లిన్ గర్రే (బి) పూనమ్ యాదవ్ 15, శాటర్త్‌వెయిట్ (సి) రోడ్రిగ్స్ (బి) దీప్తి 33, కేథీ మార్టిన్ (నాటౌట్) 27, ఫ్రాన్సిస్ మెకె (నాటౌట్) 10; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 159/4; వికెట్ల పతనం:** 1-11, 2-47, 3-116, 4-121; **బౌలింగ్:** అరుంధతి రెడ్డి 4-0-38-1, రాధా యాదవ్ 4-0-38-1, దీప్తి శర్మ 4-0-19-1, అనూజ పాటిల్ 4-0-33-0, పూనమ్ యాదవ్ 4-0-30-1.

భారత్: ప్రియా పూనియా (సి) కాస్పరెక్ (బి) శాటర్త్‌వెయిట్ 4, స్మృతి మంధాన (సి) రో (బి) కెర్ 58, జెమీమా రోడ్రిగ్స్ (సి) మార్టిన్ (బి) తహుహు 39, హేమలత (సి) కెర్ (బి) తహుహు 3, హర్మన్‌ప్రీత్ (స్టంప్డ్) మార్టిన్ (బి) కెర్ 17, అనూజ (సి) కెర్ (బి) తహుహు 0, అరుంధతి (ఎల్బీ) మైర్ 2, దీప్తి శర్మ (సి) శాటర్త్‌వెయిట్ (బి) డివైన్ 5, తానియా (సి అండ్ బి) కాస్పరెక్ 1, రాధా యాదవ్ (సి) మార్టిన్ (బి) కాస్పరెక్ 3, పూనమ్ యాదవ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 19.1 ఓవర్లలో 136 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-4, 2-102, 3-103, 4-111, 5-111, 6-117, 7-129, 8-132, 9-136; **బౌలింగ్:** ఫ్రాన్సిస్ మెకె 0.3-0-4-0, శాటర్త్‌వెయిట్ 1.3-0-3-1, లి తహుహు 4-1-20-3, కాస్పరెక్ 3-0-25-2, రోజ్‌మేరి మైర్ 3-0-31-1, సోఫీ డివైన్ 3.1-0-24-1, అమేలియా కెర్ 4-0-28-2.

'ఎక్స్‌ట్రాలు' టాప్ స్కోరు!



వాన్‌వీన్ (5/1)

● ఆసీస్ దేశవాళీలో వింత

సిడ్నీ: 'ఎక్స్‌ట్రాలు' టాప్ స్కోరుగా నిలిచిన వింత ఘటన ఆస్ట్రేలియా మహిళల దేశవాళీ క్రికెట్‌లో చోటు చేసింది. జాతీయ చాంపియన్‌షిప్స్‌లో భాగంగా న్యూసౌత్ వేల్స్‌తో మ్యాచ్‌లో సౌత్ ఆస్ట్రేలియా అత్యల్పంగా 10 పరుగుల స్కోరు నమోదు చేసింది. బ్యాట్ ద్వారా వచ్చిన 4 పరుగులను మాన్‌సెల్ చేయగా.. మిగిలిన 9మంది బ్యాట్స్‌వుమెన్‌లో ఆరుగురు డకౌట్ కావడం విశేషం. వైడ్ల ద్వారా ఆరు ఎక్స్‌ట్రా పరుగులు లభించాయి. రోక్సన్నే వాన్‌వీన్ (5/1)తో సౌత్ ఆస్ట్రేలియా వణికింది. ఈ లక్ష్యాన్ని సౌత్ వేల్స్ 2 వికెట్లు కోల్పోయి సాధించింది.

కష్టాల్లో సౌరాష్ట్ర

● పుజారా డకౌట్
● సర్వాటే మాయాజాలం
● విదర్భతో రంజీ ఫైనల్

నాగపూర్: ఆదిత్య సర్వాటే ఆల్‌రౌండ్ నైపుణ్యంలో సౌరాష్ట్రతో రంజీ ఫైనల్లో డిఫెండింగ్ చాంప్ విదర్భ పట్టుబిగించింది. 206 పరుగుల లక్ష్యఛేదనలో సర్వాటే (3/13) స్పిన్ మాయాజాలానికి సౌరాష్ట్ర రెండో ఇన్నింగ్స్‌లో 58/5తో ఎదురీదుతోంది. విశ్వరాజ్ జడేజా (23), కమలేష్ (2) క్రీజులో ఉన్నారు. స్టార్ బ్యాట్స్‌మన్ చటేశ్వర్ పుజారాను డకౌట్ చేసిన ఆదిత్య.. మ్యాచ్‌ను విదర్భవైపు మొగ్గేలా చేశాడు. విజయానికి సౌరాష్ట్రకు ఇంకో 148 పరుగులు కావాల్సి ఉండగా.. విదర్భకు మరో 5 వికెట్లు చాలు. స్పిన్‌కు సహకరిస్తున్న పిచ్‌పై బుధవారం ఒక్క రోజే 13 వికెట్లు కూలాయి. అంతకు ముందు 55/2తో నాలుగో రోజు ఆటను కొనసాగించిన విదర్భ 200 పరుగులకు ఆలౌటైంది. ధర్మేంద్రసింహ్ జడేజా (6/19) దెబ్బకు విదర్భ టాపార్డర్ విలవిల్లాడింది. 147/8తో కష్టాల్లో పడ్డ విదర్భను.. ఎనిమిదో నెంబర్ బ్యాట్స్‌మన్ సర్వాటే (49) ఆదుకోవడంతో 200 పరుగుల మార్క్‌ను చేరుకోగలిగింది. మోహిత్ కాలే (38), గణేష్ (35) ఫర్వాలేదనిపించారు. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 312 పరుగులు, సౌరాష్ట్ర 307 పరుగులు చేశాయి.

పాక్ X భారత్

సెప్టెంబరులో డేవిస్ కప్ క్వాలిఫయర్స్

నాగ్‌పూర్: డేవిస్‌కప్‌లో సొంతగడ్డపై పోరులో ఇటలీ చేతిలో ఓడిన భారత్‌కు విదేశీ వేదికపై పోరులో ప్రత్యర్థిగా పాకిస్థాన్ ఎదురైంది. బుధవారం లండన్‌లో జరిగిన డ్రా కార్యక్రమంలో పాక్ గడ్డపై ఆడే జట్టుగా భారత్ పేరు ఖరారైంది. ఈ పోరు ఈ ఏడాది సెప్టెంబరులో జరగనుంది. అయితే, ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా కొన్నాళ్లుగా పాక్‌కు భారత జట్లను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ డేవిస్ కప్ పోరు తటస్థ వేదికపై జరిగే అవకాశముంది.

కొచ్చికి వరుసగా రెండో గెలుపు

కొచ్చి: ప్రొ వాలీబాల్ లీగ్‌లో కొచ్చి బ్లూ స్పైకర్స్ వరుసగా రెండో విజయం సాధించింది. బుధవారం జరిగిన థ్రిల్లింగ్ ఫైట్‌లో కొచ్చి 3-2 (10-15, 15-11, 11-15, 15-12, 15-12)తో అహ్మదాబాద్ డిఫెండర్స్‌ను ఓడించింది. తొలిసెట్ ఆరంభంలో చెలరేగిన డిఫెండర్స్ 4-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 10-5తో నిలిచిన అహ్మదాబాద్ 15-10తో సెట్‌ను నెగ్గింది. కానీ, రెండోసెట్‌లో పుంజుకున్న కొచ్చి 15-11తో ఆ సెట్ నెగ్గి స్కోరు సమం చేసింది. మూడో సెట్‌ను 15-11తో నెగ్గిన అహ్మదాబాద్ మళ్లీ లీడ్‌లోకి వస్తే.. నాలుగో సెట్‌ను 15-12తో గెలిచిన స్పైకర్ 2-2తో సమం చేసి మ్యాచ్ ఫలితాన్ని చివరి సెట్‌కు తీసుకెళ్లింది. నిర్ణాయక ఐదోసెట్‌లో జోరు ప్రదర్శించిన కొచ్చి 8-4తో పైచేయి సాధించింది. కానీ, వరుసగా మూడు పాయింట్లు సాధించిన అహ్మదాబాద్ 7-8తో సత్తా చాటింది. అయితే, ఆధిక్యాన్ని నిలబెట్టుకున్న కొచ్చి.. ప్రభాకరన్ స్పైక్‌తో 14-11తో నిలిచింది. అదే జోరులో సెట్‌తోపాటు మ్యాచ్‌నూ నెగ్గింది.



స్విమ్మింగ్‌లో సాజిదాకు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ క్రీడాకారిణి షేక్ సాజిదా అంతర్జాతీయ వేదికపై సత్తాచాటింది. టర్కీలోని ఇస్తాంబుల్‌లో జరిగిన ఇండో-టర్కీ ఇంటర్నేషనల్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళల 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో సాజిదా రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా సాజిదాకు తెలంగాణ స్విమ్మింగ్ సంఘం అభినందనలు తెలిపింది.

అవయవాల కొరతకు త్వరలో స్వస్తి పలకనున్నామా? మనుషులకు అవసరమయ్యే అవయవాలను సమీప భవిష్యత్తులో పందులు, గొర్రెల్లో తయారు చేసుకోబోతు న్నామా? అంటే అవుననే చెబుతోంది తాజా పరిశోధన. ఎలుకల్లో ఒక రకమైన మూలకణాలతో మూత్రపిండాలను పెంచి జపాన్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైకలాజికల్ సైన్సెస్ శాస్త్రవేత్తలు చరిత్ర సృష్టించారు.



ఇక్కడ కిడ్నీలు తయారు చేయబడును!

మూలకణాలతో ఎలుకల్లో కిడ్నీల అభివృద్ధి.. త్వరలో మానవ మూత్రపిండాలూ తయారీ

టోక్యో, ఫిబ్రవరి 6: అవయవ దాతలు తక్కువ.. అవసరం ఎక్కువ.. అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తూ కన్నుమూసిన గ్రహీతలెం దరో! ప్రస్తుతం ఎక్కువ మంది ఎదుర్కొంటున్నది మూత్రపిండాల సమస్యతోనే. కిడ్నీ మార్పిడి చేస్తేనే ఎక్కువ కాలం బతకగలమన్న ధీమా. అవి దొరక్క ఎంతోమంది శస్త్రచికిత్సకు దూరంగానే ఉంటు న్నారు. ఒక్క అమెరికాలోనే 95వేల మంది గ్రహీతలు కిడ్నీల కోసం అర్థిస్తున్నారు. ఈ సమస్య నుంచి గట్టెక్కించేందుకు ఏళ్లుగా పరిశోధ నలు జరుగుతూనే ఉన్నాయి. వాటికి కొత్త రూపునిస్తూ జపాన్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైకలాజికల్ సైన్సెస్ శాస్త్రవేత్తలు ప్రత్యేకమైన మూల కణాలతో ఎలుకల్లో కిడ్నీలను విజయవంతంగా పెంచగలిగారు. వాటి పనితీరు కూడా ఆశాజనకంగా ఉందని గుర్తిం చారు. కేవలం మనుషుల మూలకణాలతోనే మరో ప్రమేయం లేకుండా అవయవాల అభివృద్ధికి ఈ పరిశోధన దోహదం చేస్తుందని శాస్త్రవే త్తలు అభిప్రాయపడుతున్నారు.

పందులు, గొర్రెల్లో మానవ అవయవాలు

మానవ అవయవాలు తయారు చేయాలంటే.. సరైన పరిమాణంలో ఉండే అవయవాలు కలిగే జీవాలు అయ్యి ఉండాలి. అందుకు పందులు, గొర్రెలే సరైన ప్రత్యామ్నాయం. ఎందుకంటే వీటి అవయ వాలు, దాదాపు మనిషి అవయవాల పరిమాణంలోనే ఉంటాయి.

మూల కణమే మూలం..

సరైన రసాయనిక పద్ధతులతో మూల కణాన్ని ఏ రకమైన కణజాలంగానైనా మార్చవచ్చు. అయితే, లోపాలు లేని అవ యవం అభివృద్ధి చేయడం కష్టసాధ్యం. పైగా, నిజమైన అవయవాన్ని పోలి, అదే పరిమాణంలో ఉండాలి. దానికోసం శాస్త్రవే త్తలు ప్లూరిపోటెంట్ మూలకణాలను సేక రించి, బ్లాస్టోసైట్స్ సహాయంతో గర్భస్థ పిండాన్ని కలిగిన ఎలుకల్లో ప్రవేశపెట్టగా కిడ్నీల పెరుగుదల ప్రారంభమైంది. నెఫ్రాన్, పోడోసైట్స్, వంపులు తిరిగే సన్ని హిత గొట్టం, టీడీఎల్, టీఏఎల్ గొట్టాలు, రక్తనాళం, వాహిక అభివృద్ధి చెందాయి. ఆ కిడ్నీని పరిశీలించగా మూత్రం వడపోత, సరఫరా సాఫీగా ఉన్నట్లు తేలింది.

ఈడీ ఎదుట వాద్రా హాజరు

కార్లో డ్రాప్ చేసిన ప్రియాంక.. భర్తకు అండగా ఉంటానని ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: సార్వత్రిక ఎన్నికల వేళ రాజ కీయ యుద్ధం బుధవారం మరింత పదునుదేలింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బావ.. రాబర్ట్ వాద్రా - మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎదుట హాజరయ్యారు. లండన్‌లో భారీగా స్థిరాస్తులు సంపాదించారని, యూపీఏ హయాంలో అనేక అక్రమ ఆర్థిక లావాదేవీలకు పాల్పడ్డారని ఆయ నపై అభియోగం. ఈ ఆరోపణలను ఆయన తిరస్కరిం చారు. 'ఇది రాజకీయ కక్ష సాధింపులో భాగంగా సాగు తున్న దర్యాప్తు.. అక్రమంగా, అనధికారికంగా, కేవలం బురద జల్లడమే ధ్యేయంగా ఇది చేస్తున్నారు' అని ప్రత్యారోపణ చేశారు. ఈడీ ఆయనను నాలుగ్గంటల సేపు ప్రశ్నించింది. లండన్‌లో తనకెలాంటి ఆస్తులూ లేవని ఆయన ఈడీకి స్పష్టం చేశారు. విశేషమేమంటే ఆయన భార్య, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమి తులైన ప్రియాంక వాద్రా స్వయంగా ఈడీ ఆఫీసు వద్ద కార్లో డ్రాప్ చేశారు. తద్వారా ఆమె- మోదీ ప్రభు త్వానికి బలమైన రాజకీయ సంకేతాన్ని పంపారు. ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ప్రయోగించి తనను రాజకీయంగా ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తే భయ పడేది లేదని, తానూ పోరాడతానని ఆమె పరోక్షంగా తేల్చిచెప్పారు. కార్లోనే పరస్పర ఆలింగనం చేసుకుని, చెక్కిళ్లపై ముద్దులిడుకున్న తరువాత రాబర్ట్ కారు దిగారు. ఆపై ఆమె నేరుగా ఏఐసీసీ ప్రధాన కార్యా లయానికి వెళ్లి కొత్త బాధ్యతలను స్వీకరించారు. "ఆయ న నా భర్త. ఆయన నా కుటుంబం. నేను నా కుటుం బానికి అండగా నిలబడతా" అని ఆమె స్పష్టం చేశారు. "ఈ విచారణ ఎందుకు చేస్తున్నారో ప్రజలకు తెలుసు. నేను ఈడీ కార్యాలయం వద్ద ఉండడమే ప్రభుత్వానికి స్పష్టమైన సంకేతం" అని పేర్కొన్నారు. ఈడీ ఎదుట రాబర్ట్ వాద్రా హాజరవడం ఇదే మొదటిసారి. ఈడీ తదుపరి విచారణను ఈనెల 16కు వాయిదా వేసింది.



ఈడీ కార్యాలయానికి కారులో వెళ్తున్న రాబర్ట్ వాద్రాతో ప్రియాంక గాంధీ

ఆరోపణలేంటి?

వాద్రా 2005-10 సంవత్సరాల మధ్య కాలంలో అక్ర మంగా లండన్‌లో 9 భవంతులు కొనుగోలు చేశారని ఈడీ ఆరోపణ. ఇందులో మూడు విల్లాలు కాగా మిగి లినవి విలాసవంతమైన ఫ్లాట్లు. రెండు విల్లాల ఖరీదు 83 కోట్ల రూపాయలని ఈడీ ఆరోపించింది. వాద్రా సొంత వ్యాపార సంస్థ సన్‌లైట్ హాస్పిటాలిటీ ద్వారా పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడించింది. ఇదే సంస్థ రాజ స్థాన్‌లోని బికనీర్‌లో కూడా అక్రమ భూలావాదేవీలకు పాల్పడ్డట్లు ఆరోపిస్తోంది. 69 హెక్టార్ల భూమిని 72 లక్షలకు కొనుగోలు చేసి ఆ తరువాత అదే భూమిని ఎలెగెనీ ఫిన్‌లీజ్ అనే సంస్థకు రూ 5.5 కోట్లకు అమ్మి నట్లు చెబుతోంది. ఈ సంస్థలో పనిచేస్తున్న వాద్రా సన్నిహితుడు మనోజ్ అరోరాను ఈనెల 16వరకూ అరెస్ట్ చేయరాదని ఢిల్లీ కోర్టు బుధవారం ఈడీని ఆదే శించింది.

ప్రియాంక అరంగేట్రం

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీ బుధవారం లాంఛనంగా బాధ్యతలు చేప ట్టారు. భర్త ఓ పక్క ఇంటరాగేషన్ ఎదుర్కొం టున్న సమయంలో పూర్తిస్థాయి రాజకీయ రంగ ప్రవేశం చేయడం ఆమెకు ఇబ్బందికరమేనని కాంగ్రెస్ కార్యాలయ ప్రతినిధి ఒకరు అన్నారు. క్లుప్తంగా మీడియాతో మాట్లాడాక- ఆమె నేరుగా తనకు కేటాయించిన ఛాంబర్‌లోకి వెళ్లి కూర్చు న్నారు. సోనియా కాంగ్రెస్ చీఫ్‌గా ఉన్నపుడు రాహుల్ ప్రధాన కార్యదర్శిగా అదే గది నుంచి బాధ్యతలు నిర్వహించారు. ఆ గదిలో ఉన్న రెండు వినాయక ప్రతిమలకు పూజ చేసి ఆమె తన సీట్లో కూర్చున్నారు. అనంతరం యూపీ, మహారాష్ట్ర కాంగ్రెస్ నేతలతో భేటీ అయ్యారు.

మీ తీర్పు మాకు ఓకే!

- 'శబరిమల'పై మాట మార్చిన ఆలయ బోర్డు
- మహిళల ప్రవేశానికి మద్దతు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: శబరిమల అయ్యప్ప ఆల యంలోకి అన్ని వయసుల మహిళల ప్రవేశానికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు విషయంలో ట్రావెన్‌కోర్ దేవస్థాన బోర్డు(టీడీబీ) మాట మార్చింది. సుప్రీం తీర్పును తాము గౌరవిస్తామని తెలిపింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేరళ ప్రభుత్వం, టీడీబీ, నాయర్ సర్వీస్ సొసైటీ సహా పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిలో తీర్పును సమీక్షించాలంటూ వేసిన పిటిషన్లు కూడా ఉన్నాయి. వీటిపైన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం బుధవారం విచారణ చేప ట్టింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ ఆర్.ఎఫ్.నారిమన్, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఇందు మల్హోత్రాలు సభ్యులుగా ఉన్నారు. టీడీబీ తరఫున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదనలు వినిపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో 'జీవ సంబంధిత లక్షణాల' ఆధారంగా ప్రత్యేకించి మహి ళల పట్ల వివక్ష చూపరాదని పేర్కొన్నారు. ఆర్టికల్ 25(1) ప్రకారం మతాచారాలు అందరికీ సమానంగా ఉంటాయని గుర్తుచేశారు. రుతుక్రమ మహిళలను ఆలయంలోకి అనుమతించబోమని గతంలో పలు మార్లు స్పష్టం చేసిన టీడీబీ తాజాగా తన వైఖరి మార్చుకోవడం గమనార్హం. మహిళల ప్రవేశం విష యంలో సుప్రీం తీర్పును సమర్థించారు. అంతకు ముందు కేరళ ప్రభుత్వం తరపు న్యాయవాది వాద నలు వినిపిస్తూ గత సెప్టెంబరు 28న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు కట్టుబడి ఉంటామని తెలిపారు. తీర్పుపై సమీక్ష కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేయాలని కోరారు. నాయర్ సర్వీస్ సొసైటీ తర పున సీనియర్ న్యాయవాది కె.పరాశరన్ వాదనలు వినిపిస్తూ.. వివక్షపై రాజ్యాంగం విధించిన నిషేధం మతపరమైన ప్రదేశాలకు వర్తించదని స్పష్టం చేశారు. అందరి వాదనలు విన్న తర్వాత ధర్మాసనం తీర్పును రిజర్వ్‌లో ఉంచుతున్నట్లు ప్రకటించింది. గతంలో ఇచ్చిన తీర్పును సమీక్షించాలా? వద్దా? అనే విషయంపై తర్వాత తెలియజేస్తామని వెల్లడించింది.



ఫ్రెంచ్ గయానా నుంచి జీశాట్‌తో దూసుకెళ్తున్న ఏరియన్ రాకెట్

కక్ష్యలోకి జీశాట్-31

ఫ్రెంచ్ గయానా నుంచి విజయవంతంగా ప్రయోగం

శ్రీహరికోట(సూళ్లూరుపేట), ఫిబ్రవరి 6: డీటీహెచ్, ఏటీఎం సేవలను మరింత మెరుగుపర్చే జీశాట్-31 ఉపగ్రహాన్ని ఇస్రో విజయవంతంగా కక్ష్య లోకి చేరవేసింది. ఇది దేశీయ 40వ సమాచార ఉపగ్రహం. ఫ్రెంచ్ గయానా లోని కౌరు అంతరిక్ష కేంద్రం నుంచి భారత కాలమానం ప్రకారం బుధ వారం తెల్లవారుజామున 2.31 గంటలకు ఏరియన్-5 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. జీశాట్-31 ఉపగ్రహం ఏటీఎం, డీటీహెచ్‌లతో పాటు వీశాట్ నెట్‌వర్క్స్, టెలివిజన్ అప్‌లింక్స్, డిజిటల్ శాటిలైట్ న్యూస్ గ్యాదరింగ్, సెల్‌ఫోన్ సర్వీసులు, బల్క్ డేటా ట్రాన్స్‌ఫర్, ఈ-గవర్నెన్స్ అప్లికే షన్లకు కీలకం కానుంది. 15 ఏళ్లపాటు పనిచేస్తుంది.

● ఆధార్‌తో 'పాన్' లంకె అనివార్యం: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:ఆదాయ పన్ను(ఐటీ) రిటర్న్‌లు సమర్పించడానికి ఆధార్‌తో 'పాన్' అనుసంధానం తప్పనిసరి అని సుప్రీంకోర్టు తెలిపింది. న్యాయమూర్తులు జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

● 'లోక్‌పాల్'కు దరఖాస్తుల ఆహ్వానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: లోక్‌పాల్ నియమించాలని సామాజిక ఉద్యమకా రుడు అన్నాహజారే వారం రోజులు చేసిన నిరాహార దీక్షకు తలొగ్గిన కేంద్రం.. ఎట్టకేలకు చర్యలు ప్రారంభించింది. ఎన్నికల ఏడాదిలో లోక్‌పాల్ చైర్మన్, సభ్యులతో పాటు అంబుడ్స్‌మన్ (ఫిర్యాదులు స్వీకరించే వ్యక్తి) నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ బుధ వారం తెలిపింది. ఈ నెల 22 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.

● కాన్పూర్ అల్లర్ల దర్యాప్తునకు సిట్

లఖ్‌నవూ, ఫిబ్రవరి 6: ఇందిర హత్యానంతరం కాన్పూర్‌లో జరిగిన అల్లర్ల దర్యాప్తునకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటుచేసింది. యూపీ డీజీపీ అతుల్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ బృందంలో రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి సుభాష్ చంద్ర అగర్వాల్, రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్(విచారణ) యోగేశ్వర్ కృష్ణ శ్రీవాస్తవ సభ్యులుగా నియమించారు.

● న్యాయవ్యవస్థను లాయర్లే 'ఖూనీ' చేస్తారా?

- కోర్టు పరిధిలోని అంశాలపై వ్యాఖ్యానించొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: "బాధ్యతగా పనిచేసేవారికే స్వేచ్ఛ లభిస్తుంది. న్యాయవ్యవస్థనే మట్టుబెట్టేందుకు బార్ ప్రయత్నిస్తే ఇక చెప్పేదేముంది? పరిస్థితి అలా కనిపిస్తోంది. న్యాయవ్యవస్థ భద్రతకు అంతర్గతంగా కాకుండా వెలుపల నుంచి సహకారం అవసరం ఉంది. న్యాయవ్యవస్థను 'ఖూనీ' చేసేందుకు కొంతమంది న్యాయవాదులు చేతిలో కత్తిపట్టుకుని తిరుగుతు న్నట్లు కనిపిస్తోంది" అంటూ సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. న్యాయ వాది ప్రశాంత్ భూషణ్ ఇటీవలి వివాదాస్పద వ్యాఖ్యలకు అభ్యంతరం చెపు తూ....ఏజీ వేణుగోపాల్ దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యంపై సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం తీవ్రంగా స్పందించింది. సీబీఐ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఎం నాగేశ్వరరావు నియామక సమావేశ వివరాలను నివేదించడంలో ప్రభుత్వం సుప్రీంకోర్టును తప్పుదోవ పట్టించిందంటూ భూషణ్ ఘాటుగా ట్వీట్లు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై ధర్మాసనం భూషణ్‌కు నోటీసులిచ్చి మూడు వారాల్లోగా సమాధానమివ్వాలని ఆదేశించింది.

● నన్‌లపై అత్యాచారాలు నిజమే: పోప్

యూఏఈ, ఫిబ్రవరి 6: నన్‌లపై బిషప్‌లు, ప్రీస్ట్‌లు అత్యాచారం చేశారని పోప్ ఫ్రాన్సిస్ అంగీకరించారు. ప్రపంచవ్యాప్తంగా కేథలిక్ చర్చిల్లో నన్‌లు అత్యాచారాలు, లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆయన తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి తాను కృషి చేస్తానని ఆయన శపథం చేశారు.

● భారతీయుల దొంగ ఓట్లతో ఓడిపోయా

- న్యూజెర్సీ మున్సిపల్ ఎన్నికల్లో పోటీదారు ఆరోపణ

ట్రెంటన్ (న్యూ జెర్సీ), ఫిబ్రవరి 6: అక్రమంగా వలస వచ్చి తిష్టవేసిన భారతీయుల దొంగ ఓట్ల వల్ల తాను ఓడిపోయానని- చెస్టర్‌ఫీల్డ్ టౌన్‌షిప్ కమిటీ (మునిసిపల్) ఎన్నికల్లో ఓటమి పాలైన శామ్ డేవిస్ అనే రిపబ్లికన్ అభ్యర్థి ఆరోపించారు. నవంబరులో జరిగిన ఎన్నికల్లో ఆయనను 117 ఓట్ల తేడాతో డెమొక్రాట్ అభ్యర్థి, భారత సంతతికి చెందిన శ్రీకాంత్ దోప్తే ఓడిం చారు. "ఓట్లు వేసిన భారతీయులెవరూ పౌరులు కాదు. వారి ఓట్లకు చట్టబ ద్ధతే లేదు. వారికి 15వేల డాలర్ల చొప్పున జరిమానా విధించాలి" అని ఆయన ఎఫ్‌బీ పోస్టులో పేర్కొన్నారు. ఓ స్కూల్ టీచర్‌గా పనిచేస్తూ దాన్ని వదులుకుని ఆయన రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీచేశారు. అయితే ఈ ఆరో పణలు జాతి వివక్ష, ద్వేషపూరితమని బర్లింగ్టన్ కౌంటీ బోర్డు డిప్యూటీ డైరె క్టర్ బల్వీర్ సింగ్ కొట్టిపారేశారు. స్థానికంగా ఉండే శ్వేతజాతీయులే ఆయ నకు వ్యతిరేకంగా ఓటేశారన్నారు.



పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఫాదర్ ఫ్రానోయిస్ లాబోర్డేను ఫ్రెంచ్ రాయబారి అలెగ్జాండర్ జీగ్లర్ 'లెజియాన్ డి హానర్'తో బుధవారం సత్కరించారు. ఇది ఫ్రాన్స్‌లోనే అత్యున్నత పౌర పురస్కారం. అరవై ఏళ్లుగా ఆయన మానసిక, శారీరక వికలాంగులైన పిల్లలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డుతో సత్కరించారు. గతంలో ఈ అవార్డు సత్యజిత్ రే, సౌమిత్ర ఛటర్జీకి లభించింది.

మోదీ రాఫెల్ స్కాం ఇచ్చారు.. మేం కనీస ఆదాయం ఇస్తాం

- దళితుల భూములను లాక్కొన్న మోదీ
- ఆయన ఓ అబద్ధాల రాజు: రాహుల్
- ఒడిసాలోని భవానీపట్నాలో ర్యాలీ

న్యూఢిల్లీ/భవానీపట్నా(ఒడిసా), ఫిబ్రవరి 6: నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. ప్రధాని మోదీ, ఒడిసా సీఎం నవీన్ పట్నాయక్ కలిసి పేదల వద్ద నుంచి భూములను దోచు కుని.. తమ పారిశ్రామిక మిత్రులకు అప్పగించారని మండిపడ్డారు. ఒడిసాలోని కలహండి జిల్లా భవానీప ట్నాలో బుధవారం నిర్వహించిన ర్యాలీలో రాహుల్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ప్రజలకు రాఫెల్ కుంభకోణం ఇచ్చిందని.. అదే తాము అధికారంలోకి వస్తే పేదలకు కనీస ఆదాయం కల్పిస్తామని ప్రకటించారు. ఇది 'పేదల ఖాతాలో రూ.15లక్షలు వేస్తాం.. 2లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం' అని బీజేపీ ఇచ్చిన హామీలాంటిది కాదని స్పష్టం చేశారు. పేద లకు కనీస ఆదాయం ఇవ్వకుండా ప్రపంచంలోని ఏ శక్తి తమని అడ్డుకోలేదని స్పష్టం చేశారు. ఈ పథకం కోసం కాంగ్రెస్ ఐదారు నెలలుగా కసరత్తు చేస్తోందని తెలి పారు. కాపలాదారుడే దొంగ అని పరోక్షంగా మోదీనుద్దే శించి విమర్శించారు. ఒడిసా సీఎం నవీన్ పట్నాయక్ రిమోట్.. కాపలాదారుడి(మోదీ) చేతులో ఉందని.. ఆయన ఏం చెబితే పట్నాయక్ అదే చేస్తాడని ఆరోపిం చారు. ఒడిసాలో దళితుల సంక్షేమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఇక్కడి దళిత యువకులు ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు లను ఆదుకునేందుకు బడ్జెట్‌లో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని మోదీ ప్రభుత్వం చెబుతోందన్నారు. కానీ ఒక్కో రైతుకు రోజుకు రూ.3.50, అదే ఒక రైతు కుటుం బానికి రోజుకు రూ.17 మాత్రమే మోదీ ప్రభుత్వం అంది స్తుందని చెప్పారు. అదే 15-20 మంది పారిశ్రామిక మిత్రులకు మాత్రం రూ.3.5లక్షల కోట్లు మాఫీ చేసిందని ఆరోపించారు. కాగా, మోదీ అబద్ధాల రాజు అని రాహుల్ గాంధీ ట్విటర్‌లో విమర్శించారు. మోదీ పాలనలో రైతులు మద్దతు ధర పొందడం లేదని, యువకులు సరైన ఉద్యోగాలు పొందలేకపోతున్నారని ఆరోపించారు.



భవానీపట్నా ర్యాలీలో అభివాదం చేస్తున్న రాహుల్

అమెరికాకు చట్టబద్ధంగా రండి

వలసదారులను కాపాడుకొంటాం: ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 6: అమెరికాకు వలసవచ్చే ఇతర దేశాలవారు చట్టబద్ధంగా మాత్రమే రావాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. తమ దేశ పౌరుల జీవితాలను, ఉద్యోగాలను పరిరక్షిం చేలా ఉండే ఇమ్మిగ్రేషన్ విధానాన్ని రూపొందించా ల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. బుధవారం అమె రికా ఉభయ సభల వార్షిక సమావేశం (ఎస్‌ఓటీ యూ)లో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "అమెరికా చట్టాలను, నియమాలను గౌర విస్తూ ఇక్కడ ఉన్న లక్షల మంది వలసదారులను జాగ్రత్తగా చూసుకోవడం మా బాధ్యత. చట్టబద్ధంగా వలస వచ్చినవారు మా దేశాన్ని సుసంపన్నం చేసేం దుకు, మా సమాజాన్ని బలోపేతం చేసేం దుకు ఎంతో కృషి చేస్తున్నారు. ఇతర దేశాల వారు మా దేశానికి రావాలనే కోరుకుంటున్నాను. కానీ, వారు చట్టబ ద్ధంగా రావాలి" అని ట్రంప్ అన్నారు.

తప్పుదోవ పట్టించారు

- అటార్నీ అనూ పేషవారియా

వాషింగ్టన్, ఫిబ్రవరి 6: అమెరికా ప్రభుత్వం.. భారత విద్యార్థులను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించిందని ప్రముఖ ఇండియన్ అమెరి కన్ అటార్నీ అనూ పేషవారియా ఆరోపించారు. నకిలీ వర్సిటీని సృష్టించేందుకు అనుమతించడం ద్వా రా హోంల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్.. ఎక్కడో ఇతర దేశంలో ఉన్నవారిని అమెరికాకు రప్పించి ఇరి కించిందన్నారు. భారత విద్యార్థులు తెలిసే తప్పు చేశారంటూ డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మంగళవారం ఆరోపించిన నేపథ్యంలో పేషవారియా బుధవారం స్పందించారు. "మా విద్యార్థుల పొరపాటు లేదని మేం అనడంలేదు. వారు అన్ని విషయాలూ ముందే తెలుసుకోవాల్సింది. వారు ఉద్దేశపూర్వకంగానే తప్పు చేసి ఉంటే శిక్షించాల్సిందే. కానీ, నేరం చేసేలా పురి గొల్పి అందులో ఇరికిస్తే మాత్రం వారికి సహాయం చేయాల్సి ఉంటుంది" అని పేషవారియా అన్నారు.



మరిన్ని నకిలీ వర్సిటీలు ఉండొచ్చు!

అడ్డదారితో ఎప్పుడూ ప్రమాదమే.. చేయని నేరానికి జైలుపాలైన విద్యార్థులు

- విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి
- 'ఆంధ్రజ్యోతి'తో అమెరికా ఇమిగ్రేషన్ అటార్నీ రాహుల్‌రెడ్డి

వరంగల్ అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అమె రికా చదువు కోసం ఆరాటపడ్డ మన విద్యార్థులు అన వసరంగా కష్టాల్లో చిక్కుకున్నారు. అక్కడి చట్టాలపై అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం, అడ్డదారిలో సంపాదనకు ప్రయత్నించడంతో అమెరికాలో భారత విద్యార్థులు అష్టకష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎన్నో ఆశలతో అమెరికా వెళ్లిన విద్యార్థులు కటకటాలు లెక్కించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఫార్మింగ్టన్ యూని వర్సిటీ లాంటి ఘటనలు మరిన్ని వెలుగు చూసే అవకాశాలున్నా యన్న భయం తెలుగు రాష్ట్రాల విద్యార్థులను వెంటాడుతోంది. ఇప్ప టికే చాలా మంది అమెరికా నుంచి తిరిగి వచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మన విద్యార్థులకు అండగా ఉన్న, దాదాపు 26 ఏళ్ల నుంచి అమెరికాలో ఇమిగ్రేషన్ కేసు లను వాదిస్తున్న ప్రముఖ అటార్నీ(న్యాయవాది) రాహుల్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు..

● ఫార్మింగ్టన్ వర్సిటీలో అసలేం జరిగింది?

➡ అమెరికా పోలీసులు 2015లోనే ఓ నకిలీ వర్సిటీని సృష్టించారు. అప్పటి నుంచే వేట నకిలీ విద్యార్థుల వేట మొదలుపెట్టారు. ఫార్మింగ్టన్ విశ్వవిద్యా లయం అనేది ఒక ఎర. దురదృష్టవశాత్తు తెలుగు రాష్ట్రాల పిల్లలు అందులో చిక్కుకున్నారు.

● పోలీసులే నకిలీ వర్సిటీని సృష్టించి, విద్యార్థు లను ప్రలోభపెట్టి చేర్పించి.. వారిని నేరస్థు లనడం చట్టబద్ధమేనా?

➡ భారత చట్టాలకు, అమెరికా చట్టాలకు చాలా తేడా ఉంటుంది. భారత్‌లో పోలీస్ యంత్రాంగం స్టింగ్ ఆపరేషన్ చేయాలంటే చాలా అనుమతులు కావాలి. అమెరికాలో పరిశోధనలో భాగంగానే అనేక స్టింగ్ ఆపరేషన్‌లు చేస్తారు. విద్యార్థులను ప్రలోభ పెట్టడం విషయానికి వస్తే.. వర్సిటీకి ఎలాంటి అను మతుల్లేవు. తరగతులకు హాజరు కానవసరం లేదు. బయట ఉద్యోగాలు చేసుకునే వెసులుబాటు ఉంది. విద్యార్థులను చేర్పించిన వారికి కమీషన్ ఉంటుం దని వర్సిటీ అధికారులుగా నటించిన పోలీసులు చెప్పారు కదా. ఇదంతా తెలిసే అందులో చేరార న్నది హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారుల అభి యోగం. తెలిసి చేసినా తెలియక చేసినా నేరం నేరమే అవుతుంది కదా!

● ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి ఏమిటి..? దీన్నుంచి విముక్తి పొందేదెలా?

➡ ఫార్మింగ్టన్ విద్యార్థులందరి మీద క్రిమినల్ కేసులు నమోదు చేయలేదు. కమీ షన్లు తీసుకుని చాలా మంది విద్యార్థులను చేర్పించిన 8 మంది మీదే క్రిమినల్ కేసులు నమోద య్యాయి. మిగిలిన వారిపై సివిల్ కేసులు పెట్టారు. ఈ కేసుల లక్ష్యం చట్ట విరుద్ధంగా అమె రికాలో ఉంటున్న వారిని పంపివేయడమే. నిర్బంధంలో ఉన్న వారంతా దాదాపు 2, 3 నెల ల్లోపే విముక్తి పొందుతారు.



● ఆ 8 మందికి శిక్ష తప్పదా?

➡ అలా అని ఎలా చెబుతాం! మన వంతు ప్రయత్నం చేయాలి కదా. ఇప్పటికే వారి తరఫు న్యాయవాదులు ఆ పని చేస్తున్నారు. 8 మంది నేరం రుజువైతే ఐదేళ్లకు తక్కువ కాకుండా శిక్షలుంటాయి.

● ఫార్మింగ్టన్ లాంటి నకిలీ వర్సిటీలో చేరేందుకు అధికారులు అసలు ఎలా అనుమతిస్తారు?

➡ ఈ విషయంలోనే చాలా మంది పొరపాటు పడు తున్నారు. ఫార్మింగ్టన్ వర్సిటీలో చేరిన 600 మంది విద్యార్థులెవరూ నేరుగా అడ్మిషన్లు పొందిన వారు కాదు. అమెరికాలో అన్ని రకాల అనుమతులు పొందిన ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొం దడం ద్వారా వారికి వీసా దొరికింది. ఇక్కడికి వచ్చి న తర్వాత అన్ని రకాలుగా తమకు అనుకూలంగా ఉంటుందని మాత్రమే అందులో చేరారు.

● ఫార్మింగ్టన్ లాంటివి ఇంకా ఉన్నాయా?

➡ అమెరికా పోలీస్ వ్యవస్థకు సంబంధించిన అంశ మిది. చదువుల పేరుతో అక్రమ వలసదారులుగా మిగులుతున్న లక్షలాది మందిని అమెరికా నుంచి బయటకు పంపించేందుకు మాత్రం పెద్ద ఎత్తున కసరత్తు జరుగుతోంది. నాకు తెలిసిన సమాచారం మేరకు కొద్ది రోజుల్లోనే అలాంటి మరికొన్ని వర్సిటీల గుట్టు రట్టు చేసే యోచనలో అమెరికా పోలీస్ వ్యవస్థ ఉంది.

● వర్సిటీలు నకిలీవని తెలుసుకునేదెలా?

➡ చాలా సింపుల్. తరగతు లకు హాజరు కానవసరం లేదనడం, ఆన్‌లైన్ క్లాస్‌లకే పరిమితం కావడం, కొన్ని వర్సిటీ లైతే ఏడాదికి ఆరు లేదా ఏడు క్లాసులే నిర్వహిస్తాయి. ఏడాది పొడవునా అడ్మిషన్లు ఇవ్వడం. స్టూడెంట్ వీసాలో ఉన్నప్పుడు కూడా పనిచేసుకునే అవకాశం కల్పించడం. టోఫెల్, జీఆర్ఈ లాంటి ప్రామాణిక పరీక్షల స్కోర్ అవసరం లేకుండా పోవడం. అన్నిటికీ మించి విద్యార్థులను చేర్పిస్తే క మీషన్ ఇస్తామని ఆశ చూపే ఏ వర్సిటీ అయినా నకిలీదే.

● ఇమిగ్రేషన్‌కు సంబంధించి సమస్యలు ఉన్న వారు మిమ్మల్ని ఎలా సంప్రదించాలి?

➡ అమెరికా ఇమిగ్రేషన్ చట్టాలపై అవగాహన కోసం చాలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రత్యేక యూ ట్యూబ్ చానెల్ (రెడ్డి అండ్ న్యూమాన్ పీసీ) ఉంది.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107*
Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.